ఆంధ్రభూమి

సంపుటి: 29 . సంచిక: 227 | విజయవాడ సిటీ | హైదరాబాద్, విశాఖపట్నం, విజయవాడ, రాజమహేంద్రవరం, అనంతపురం, కరీంనగర్, నెల్లూరు | www.andhrabhoomi.net | బుధవారం 17 జనవరి, 2018 | 20 పేజీలు | ధర: 3.00

శుభోదయం

కలియుగం - 5119
శాలివాహన శకం - 1939

శ్రీ చాంద్రమాన హేమలంబ నామ సం॥
ఉత్తరాయణం, హేమంతఋతువు,
పుష్యమాసం, కృష్ణపక్షం
తిథి: బహుళ అమావాస్య ఉ.6.55
నక్షత్రం: ఉత్తరాషాఢ రా.9.44
వర్జ్యం: రా.2.07 నుండి 3.52 వరకు
దుర్ముహూర్తం: ఉ.11.36 నుండి 12.24 వరకు
రాహుకాలం: మ.12.00 నుండి 1.30 వరకు



ఆది దంపతుల కల్యాణం
సంక్రాంతి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం శ్రీశైలంలో పార్వతీ పరమేశ్వరుల కల్యాణాన్ని నిర్వహిస్తున్న దృశ్యం



ఘనంగా పార్వేటి ఉత్సవం
తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామివారికి మంగళవారం పార్వేటి ఉత్సవం నిర్వహిస్తున్న అర్చకులు



మాతా పితలకు శ్రద్ధాంజలి
తల్లిదండ్రుల సమాధులవద్ద శ్రద్ధాంజలి ఘటిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఆయన సతీమణి భువనేశ్వరి



యూపీతో మొదలు..
కాంగ్రెస్‌ను బలోపేతం చేయాలన్న లక్ష్యంతో తొలిసారిగా అమేథీలో పర్యటిస్తున్న కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ

22 నుంచి ఇంటర్వ్యూలు

18 మంది సభ్యులతో ఏపీపీఎస్సీ బోర్డు

విజయవాడ (బెంజిసర్కిల్), జనవరి 16: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ తొలిసారిగా గ్రూప్-1 మౌఖిక పరీక్షలను నవ్యాంధ్రప్రదేశ్ నూతన రాజధాని అమరాతిలో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తోంది. రాష్ట్ర విభజన అనంతరం ఇప్పటికే హైదరాబాద్ నుండి తరలివచ్చిన ఏపీపీఎస్సీ అన్ని విభాగాలకు సంబంధించిన పరీక్షలను ఇక నుంచి ఏపీ కేంద్రంగానే నిర్వహిస్తామని గతంలో ప్రకటించి దానికి అనుగుణంగా అవరమైన ఏర్పాట్లలో నిమగ్నమైయింది. సుప్రీం కోర్టు ఆదేశాలతో గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలు నిర్వహించిన ఏపీపీఎస్సీ, దీనిలోభాగంగా 2011లో ఇచ్చిన లిమిటెడ్ జనరల్ సర్వీసుల నోటిఫికేషన్లకు సంబంధించిన 152 పోస్టులకు గాను మౌఖిక పరీక్షలను అమరావతి కేంద్రంగా విజయవాడలో నిర్వహించనుంది. జనవరి 22న గ్రూప్-1 సర్వీసు పోస్టుల భర్తీ కోసం ఇప్పటికే ఎంపికైన 152 మంది అభ్యర్థులకు మౌఖిక పరీక్షలు నిర్వహించనుంది. ఇందుకుగాను ఏపీపీఎస్సీ 18 మంది సీనియర్ ఐఏఎస్, ఐపీఎస్ అధికారులతో ప్రత్యేక బోర్డును కూడా ఏర్పాటు చేసింది. ఈ నెల 22 నుంచి ఫిబ్రవరి 20 వరకు ఈ ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ఏపీపీఎస్సీ అధికారికంగా ప్రకటించింది. నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం బోర్డు సభ్యులు ఎంపికైన అభ్యర్థులకు గ్రూప్-1 ఇంటర్వ్యూలు నిర్వహించనున్నారు. దీనికోసం విజయవాడలోని ఏపీపీఎస్సీ కార్యాలయంలో అవసరమైన ఏర్పాట్లను అధికారులు పూర్తిచేస్తున్నారు.



పాపికొండల్లో పైశాచికత్వం

- పర్యాటకులపై తెగబడ్డ నిర్వాహకులు
- విచ్చలవిడిగా దాడులు
- బాధితుల పరుగులు

3

వరాల బడ్జెట్?

- ఆదాయం పన్నులో ఊరట
- మూడు లక్షలకు పెరగనున్న పరిమితి
- వార్షికాదాయంపైనా వెసులుబాటు
- అధికారులతో ఆర్థిక మంత్రి జైట్లీ మల్లగుల్లాలు



ఆంధ్రభూమి ప్రత్యేక ప్రతినిధి

న్యూఢిల్లీ, జనవరి 16: దేశంలోని మధ్య తరగతి ప్రజల మద్దతు కూడగట్టాలనుకుంటున్న ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రభుత్వం 2018-19 వార్షిక ప్రణాళికలో ఆదాయం పన్ను పరిమితిని రెండున్నర లక్షల నుండి మూడు లక్షల రూపాయలకు పెంచే అవకాశం ఉంది. కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి అరుణ్ జైట్లీ ఆదాయం పన్ను పరిమితిని పెంచే అంశంపై ఆర్థిక శాఖ సీనియర్ అధికారులతో సమాలోచనలు జరుపుతున్నారు. ఆరుణ్ జైట్లీ ఫిబ్రవరి ఒకటో తేదీ ఉదయం పదకొండు గంటలకు లోక్‌సభలో 2018-19 సంవత్సరం వార్షిక ప్రణాళికను ప్రతిపాదించనున్నారు. పార్లమెంటు బడ్జెట్ సమావేశాలు జనవరి 29 నుండి ప్రారంభం అవుతున్నాయి. లోక్‌సభ ఎన్నికలు 2019లో జరుగనున్న నేపథ్యంలో నరేంద్ర మోదీ ప్రభుత్వం ఆదాయం పన్ను పరిమితిని పెంచటంపై దృష్టి సారించటం గమనార్హం. మోదీ ప్రభుత్వం ఆదాయం పన్ను పరిమితిని రెండున్నర లక్షల నుండి మూడు లక్షల రూపాయలకు పెంచటంతోపాటు వార్షికాదాయం పది లక్షలు, అంతకంటే అధికంగా ఉంటే విధించే ముప్పై శాతం పన్నును ఇరవై ఐదు శాతానికి తగ్గించే ప్రతిపాదన కూడా పరిశీలనలో ఉన్నట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. ఈ ప్రతిపాదనల గురించి జైట్లీ ఇదివరకే నరేంద్ర మోదీతో ప్రాథమిక చర్చలు జరిపారనీ, మోదీ పచ్చజెండా ఊపిన తరువాతే ఆయన ఆర్థిక శాఖ సీనియర్ అధికారులతో సంప్రదింపులు కొనసాగిస్తున్నారని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. ఆరుణ్ జైట్లీ ఫిబ్రవరి ఒకటో తేదీన ప్రతిపాదించే పూర్తి స్థాయి బడ్జెట్ ఎన్‌డీఏ ప్రభుత్వానికి ఆఖరు బడ్జెట్ అవుతుంది. 2019లో ఎన్నికలకు ముందు ఓట్ ఆన్ అకౌంట్ మాత్రమే ప్రతిపాదించేందుకు అవకాశం ఉంటుంది. అందుకే ప్రస్తుతం తిపాదించే బడ్జెట్ ఎన్‌డీఏ ఎన్నికల బడ్జెట్ అవుతుందని అంచనా వేస్తున్నారు. ఆదాయం

- మిగతా 7వ పేజీలో

హజ్ యాత్ర సబ్సిడీకి స్వస్తి

- ఈ ఏడాది నుంచి నిలిపివేస్తున్నాం
- ప్రయాణ ఖర్చు తగ్గించేందుకు కృషి
- ముస్లిం సాధికారతే లక్ష్యం: నఖ్వీ



న్యూఢిల్లీ, జనవరి 16: ఈ ఏడాది హజ్ యాత్రికులకు సబ్సిడీలు ఇవ్వడం లేదని కేంద్ర మైనారిటీ వ్యవహారాల మంత్రి ముక్తార్ అబ్బాస్ నఖ్వీ మంగళవారం నాడిక్కడ ప్రకటించారు. ఎలాంటి బుజ్జగింపు లేకుండా మైనారిటీలకు సాధికారత కల్పించాలన్న ఉద్దేశంతోనే కేంద్రం ఈ నిర్ణయం తీసుకుందని ఆయన తెలిపారు. ఈ ఏడాది రికార్డు సంఖ్యలో 1.75 లక్షల మంది ముస్లింలు హజ్ యాత్ర చేపట్టనున్నారని వెల్లడించారు. అయితే ఈ ఏడాది హజ్ యాత్రకు ఎలాంటి సబ్సిడీ ఇవ్వకూడదని నిర్ణయించినట్లు వెల్లడించిన ఆయన సౌదీ అరేబియాకు వార్షికంగా జరిగే ఈ ముస్లిం తీర్థయాత్రపై గత ఏడాది సబ్సిడీ రూపంలో 250 కోట్లను ప్రభుత్వం ఖర్చు చేసిందన్నారు. తాజా నిర్ణయం సుప్రీంకోర్టు 2012లో జారీచేసిన ఉత్తర్వు ప్రకారమే తీసుకున్నామని వివరించారు. కొంతకాలంగా ఈ సబ్సిడీని ఎత్తివేయాలంటూ బీజేపీ నేతలు డిమాండ్ చేస్తున్న విషయాన్ని ఆయన గుర్తుచేశారు. ముస్లింలను బుజ్జగించడానికే కాంగ్రెస్ తదితర పార్టీలు ఈ సబ్సిడీని ఇచ్చాయన్నది బీజేపీ అభిప్రాయమన్నారు. ఎప్పుడైతే సుప్రీం కోర్టు ఉత్తర్వులు జారీచేసిందో క్రమానుగతంగా సబ్సిడీ మొత్తాన్ని తగ్గిస్తూ వచ్చామని నఖ్వీ తెలిపారు. మైనారిటీలకు ఎలాంటి బుజ్జగింపు లేకుండా హుందాతనాన్ని కల్పించాలన్నదే మోదీ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. అయితే సబ్సిడీని ఇవ్వకపోవడం వల్ల హజ్ యాత్ర అన్నది ముస్లిం మైనారిటీలకు వ్యక్తిగతంగా భారం కాదా అన్న ప్రశ్నకు ఈ ఖర్చును గణనీయంగా తగ్గించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని తెలిపారు. అలాగే సముద్ర మార్గాల్లో వెళ్లే విధంగా సౌదీ ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోందని, రెండు దేశాల అధికారులు ఇందుకు సంబంధించిన అంశాలపై చర్చిస్తున్నారని తెలిపారు. కొన్ని ప్రాంతాలనుంచి హజ్ యాత్ర చేపట్టేందుకు అదనపు అవకాశాలు కూడా ఉన్నాయని వివరించారు. దీనివల్ల కొన్ని మార్గాల ద్వారా ఈ యాత్ర ఖర్చు 70 శాతం పైనే తగ్గిపోతుందన్నారు. తొలిసారిగా పురుష సంరక్షకుడు లేకుండానే 1300మంది మహిళలు హజ్ యాత్ర చేపడుతున్నారని వివరించారు. వీరికి ముస్లిం మహిళలే సహాయకులుగా ఉంటారని, వీరు సౌదీలో ఉండటానికి ప్రభుత్వం తగిన ఏర్పాట్లు చేసిందని తెలిపారు.

భక్తి యాత్రకు రాయితీ యుక్తులన్ని
కంపు రాజకీయపు బుజ్జగింపుగాదె
చదువు సందెలె సంస్కార శక్తులొసగ
ముస్లిములకదె సంక్షేమ మార్గమౌను!

పునర్విభజనపై ధీమా

'దేశం'లో చిగురిస్తున్న ఆశలు ◆ మోదీ ఒప్పుకున్నారంటున్న టీడీపీ నేతలు

ఆంధ్రభూమి ప్రత్యేక ప్రతినిధి

అమరావతి, జనవరి 16: రాష్ట్రంలో రాజకీయ సుస్థిరత కోసం నియోజవర్గాల సంఖ్య పెంచాలని ముఖ్యమంత్రి చంద్రబాబు చేస్తున్న ప్రయత్నాలు ఫలించే సూచనలు కనిపిస్తున్నాయి. ఆ మేరకు ఇటీవలి ప్రధాని నరేంద్ర మోదీతో జరిగిన భేటీలో ఆయనకు గట్టి హామీ లభించినట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. 175 ఉన్న అసెంబ్లీ స్థానాలు 225కు పెంచాలని కోరుతూ శాసనసభ గతంలోనే తీర్మానం ఆమోదించి కేంద్రానికి పంపింది. వెంకయ్య నాయుడు కేంద్ర మంత్రిగా ఉన్నంతవరకూ ఆ అంశానికి సంబంధించి హోం, న్యాయ శాఖ అధికారులను పిలిపించి సమీక్ష నిర్వహించిన విషయం తెలిసిందే. ఇటీవల ప్రధాని మోదీతో చంద్రబాబు భేటీ తర్వాత పునర్విభజనకు సంబంధించి టీడీపీ వర్గాల్లో ధీమా పెరిగినట్లు వారి మాటలు స్పష్టం చేస్తున్నాయి. 'సీట్ల సంఖ్య కచ్చితంగా పెరుగుతుంది. ప్రధాని గతంలో ఆ అంశానికి పెద్ద ప్రాధాన్యం ఇచ్చేవారుకాదు. బాబుతో భేటీ తర్వాత ఆయన వైఖరి సానుకూలంగా మారింది. విభజన చట్టం అమలు విషయంతో పాటు, నియోజకవర్గాల పునర్విభజనకు తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ కూడా తీర్మానం చేసిన విషయాన్ని సార్ గట్టిగా వినిపించారు. అయితే అదే డిమాండ్ ఉన్న మరికొన్ని రాష్ట్రాల్లో కూడా అదే విధానం వర్తింపచేయాలన్న ఆలోచనతో ప్రధాని ఉన్నట్లు మాకు అనిపించింది. సమీపకాలంలో కొన్ని కీలక రాష్ట్రాల్లో జరగనున్న ఎన్నికల్లో జయాపజయాల లెక్కలు, బీజేపీ భవిష్యత్తు రాజకీయ అవసరాలు కూడా మోదీ సానుకూలతకు కారణం కావచ్చు' అని ఓ సీనియర్ ఎంపీ విశ్లేషించారు. మునుపటి మాదిరిగా ఇప్పుడు ఆలస్యం జరిగే అవకాశాలు లేవని, కంప్యూటరీకరణ చేసినందున వివరాలన్నీ అందుబాటులోనే ఉంటాయని వివరించారు. మిగిలిన



రాష్ట్రాల డిమాండ్లు పక్కకుపెడితే విభజన చట్టం ప్రకారంగానయినా మనకు వెసులుబాటు ఉందని ఆ ఎంపీ వివరించారు. కాగా ఇప్పటివరకూ నియోజకవర్గాల పునర్విభజన వల్ల రాజకీయంగా తమ పార్టీకి అదనంగా వచ్చే లాభమేమీ లేదని రెండు తెలుగు రాష్ట్రాల బీజేపీ నేతలు జాతీయ నాయకత్వం దృష్టికి తీసుకొచ్చిన విషయం తెలిసిందే. అయితే, ఇప్పుడు రాష్ట్ర బీజేపీ నేతలు సైతం పునర్విభజన అంశం అమలవుతుందని చెబుతుండటం విశేషం. 'ఇదేదో బాబు-కేసీఆర్ పట్టుపడుతున్నారది కాదు. పార్టీ ఆలోచనలు, అవసరాలు పరిగణనలోకి తీసుకునే చేయవచ్చు' అని ఓ బీజేపీ ప్రముఖుడు వ్యాఖ్యానించారు. ఇదిలావుండగా, పార్లమెంట్ తొలి విడత సమావేశాల్లో ఇది రాకపోవచ్చని, మార్చి ఏప్రిల్ 9 వరకూ రెండో విడత సమావేశాల్లో పార్లమెంట్ ముందుకు రావచ్చని మరో ప్రముఖుడు చెప్పారు. మొత్తానికి వచ్చే పార్లమెంట్ సమావేశాల ముగింపు నాటికి శుభ వార్త వినవచ్చని సూచనప్రాయంగా వెల్లడించారు. గుజరాత్ ఎన్నికల తర్వాత మిత్ర పక్షాల పట్ల బీజేపీ నాయకత్వ ధోరణి కొంతవరకూ మారిందని విశ్లేషించారు.

ఫనగామా



మన కాలేజీల్లో కూడా జరిపితే
ఆ కిక్కే వేరు సార్!!

మాట్లాడుకుందాం!

- ఆర్‌డీఎస్ సమస్యలను పరిష్కరించుకుందాం
- ఏపీ నీటిపారుదల మంత్రికి హరీశ్‌రావు లేఖ
- మూడు రాష్ట్రాల మంత్రులతో భేటీకీ కసరత్తు



ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 16: రాజోలి బండ డైవర్షన్ పథకం (ఆర్‌డిఎస్) పూర్తి చేయడంలో ఎదురవుతున్న సమస్యలపై చర్చించేందుకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్నాటక రాష్ట్రాల నీటిపారుదల మంత్రులతో 'త్రైపాక్షిక' సమావేశానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ సమావేశంలో పాల్గొనేందుకు రావాలంటూ ఏపీ నీటిపారుదల శాఖ మంత్రి ఉమామమహేశ్వర రావుకు తెలంగాణ నీటిపారుదల మంత్రి టి. హరీశ్‌రావు మంగళవారం లేఖ రాశారు. వీలైన రెండు తేదీలను తెలియచేస్తే, సమావేశం తేదీని నిర్ణయిద్దామంటూ ఈ లేఖలో హరీశ్ కోరారు. ఆర్‌డిఎస్‌ను 2018 జూలై వరకు పూర్తి చేయాలని కర్నాటక ప్రభుత్వం యోచిస్తోందని హరీశ్ రావు లేఖలో తెలిపారు. కర్నాటక నీటిపారుల మంత్రి ఎంబి పాటిల్ ఈ నెల నాలుగున తెలంగాణ వచ్చారని, ఈ సందర్భంగా ఆర్‌డిఎస్‌ను పూర్తి చేసేందుకు సహకారం అందించాలంటూ తెలంగాణ,

- మిగతా 7వ పేజీలో

జూదాల జాతర

- సిద్ధమవుతున్న కొత్తతరం
- బరులకు కుటుంబాలకు కుటుంబాలే..!
- మూడురోజులుగా జూదాలే జూదాలు
- చేతులెత్తేసిన పోలీసు యంత్రాంగం



ఆంధ్రభూమి బ్యూరో

ఏలూరు, జనవరి 16: ఏటికేడు కోడిపందాలను నిరోధిస్తామంటూ పోలీసులు చెప్పడం, ఆ తర్వాత న్యాయస్థానాలు కూడా జోక్యం చేసుకోవటం, చివరకు ఆ మూడురోజులు యధావిధిగా జూదాల జాతర జరిగిపోవటం పశ్చిమ గోదావరి జిల్లాలో ఆనవాయితీగా మారిపోయింది. ఇది చివరకు సంప్రదాయంగా కూడా పేరొందేసింది. మొత్తంమీద ఈ వ్యవహారాలన్నీ పశ్చిమగోదావరి జిల్లా అంటే కోడిపందేలు, పేకాట, గుండాట వంటివి సంస్కృతి, సంప్రదాయాలుగా విలసిల్లే ప్రాంతమనే పరిస్థితిని తీసుకువచ్చేసింది. ఇక్కడ పుట్టిన సారస్వతం, ఇతర వ్యవహారాలు ప్రస్తావనకే రాకపోతుండగా ఇప్పటి పరిస్థితులు చూసుకుంటే అందరూ కలిసి ఒక జూదవిశ్వవిద్యాలయాన్ని ఆవిష్కరించినట్లుగా ఈ మూడురోజుల పరిణామాలు కన్పిస్తున్నాయి. ఒకతరం పందాలు వేసివేసి రిటైరైపోతుంటే వారే కొత్త తరాన్ని కూడా తయారుచేసుకుంటున్నట్లు కనిపిస్తోంది. భవిష్యత్ పందేగాళ్లు ఈసారి కోతాట, గుండాట వంటి వ్యవహారాల్లో మంచి ఉత్సాహంగా పాల్గొనడం గమనార్హం. ఆరకంగా భవిష్యత్‌కు ఇబ్బంది లేకుండా కొత్తతరం పందేగాళ్లు కూడా ఇక్కడ తయారైపోతున్నారు. దాదాపుగా ఎక్కడ బరి చూసినా అక్కడ చిన్నారుల సంఖ్య అధికంగానే కన్పించింది. మరోవైపు పిల్లలకు కోడిపందాలు చూపేందుకు ఈసారి కుటుంబాలతో సహా పెద్దఎత్తున విహారానికి రావటం విశేషంగానే చెప్పుకోవాలి. ఆ అంశాన్ని అలాఉంచితే ఈ మూడురోజులు పందేగాళ్లు పూర్తిస్థాయిలో చెలరేగిపోయారు. ఎక్కడెక్కడి నగదో ఇక్కడొచ్చి వాలిపోయింది. అది పేకాటలో పోనీ, కోడిపందాల్లో కోల్పోని, లేదా వాటిలో గెలవని ఏదైనా నగదు మాత్రం కళ్లు మిరుమిట్లు గొలిపే రీతిలో దర్శనమిచ్చింది. ఇదే సమయంలో పండుగ ఖర్చులకు ఎటిఎంల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న కుటుంబ సంఖ్య ఈనెల మొదటినుంచి అలాగే ఉంది. పందేలకు మాత్రం ఎక్కడా నగదు కొరత రాకపోవటం ప్రత్యేకంగానే చెప్పుకోవాలి. అయితే జిల్లాలో ప్రతిష్ఠాత్మకంగా కోడిపందేలు నిర్వహించే వెంపలో మాత్రం పోలీసులు వీటిని అడ్డుకోగలగటం ఒకరకంగా

- మిగతా 7వ పేజీలో



ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి సమస్యలు వివరిస్తున్న రైస్ మిల్లర్స్ సంఘం నేతలు

రైతుల నుంచి తక్షణం ధాన్యం కొనండి

- మద్దతు ధర చెల్లించి ఆదుకుందాం
- ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశం

ఆంధ్రభూమి ప్రత్యేక ప్రతినిధి

అమరావతి, జనవరి 16: ఆరు గాలం శ్రమించి పండించిన పంటకు అమ్మకంలో ఎదురవుతున్న ఇబ్బందులను పరిష్కరించి తక్షణం ధాన్యం కొనుగోలు చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పౌర సరఫరాల శాఖను ఆదేశించారు. పట్టిసీమ నీటితో అధిక దిగుబడులు వచ్చినప్పటికీ పౌర సరఫరాల శాఖ ఆంక్షల వల్ల రైతులు కల్లాల్లోనే ధాన్యాన్ని నిల్వ ఉంచుకోవాల్సిన దుస్థితి నెలకొందన్న విషయం తెలిసి చంద్రబాబు స్పందించారు. రైతుల నుంచి ధాన్యం కొనుగోలుపై ఆంక్షలు విధించి ఇబ్బందులకు గురిచేస్తున్న కృష్ణా జిల్లా రెవిన్యూ యంత్రాంగంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులు, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ నాయకులు ఉండవల్లిలోని నివాసంలో ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి ధాన్యం కొనుగోలులో ముఖ్యంగా కృష్ణా జిల్లాలో పౌర సరఫరాల శాఖ ఆంక్షలతో ఎదురవుతున్న సమస్యలను వివరించారు. ఈ విషయంపై పౌర సరఫరాల కమిషనర్ రాజశేఖర్, కృష్ణా జిల్లా జాయింట్ కలెక్టర్ విజయకృష్ణన్‌ను ఆయన పిలిపించి మాట్లాడారు. రైతుల వద్ద వున్న ధాన్యాన్ని తక్షణం కొనుగోలు చేసి సమస్యను పరిష్కరించాలని సూచించారు. ధాన్యానికి మద్దతు ధర చెల్లించాలని కూడా చంద్రబాబు ఆదేశించారు.

రైతుల్లో సంతోషమే నిజమైన సంక్రాంతి

★ ఒంగోలు జాతి ఎడ్లను కాపాడుకుందాం ★ గుడివాడ ఎమ్మెల్యే కొడాలి నాని

గుడివాడ, జనవరి 16: రైతులు ఎక్కడ పాడిపంటలతో సంతోషంగా ఉంటారో అక్కడే నిజమైన సంక్రాంతి జరుగుతుందని గుడివాడ ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు (నాని) అన్నారు. కృష్ణా జిల్లా గుడివాడలోని కే కన్వెన్షన్ ఆవరణలో జరుగుతున్న జాతీయస్థాయి ఒంగోలు జాతి ఎడ్ల బండలాగుడు పోటీలకు వచ్చిన జన సందోహాన్ని ఉద్దేశించి సోమవారం ఆయన మాట్లాడారు. తెలుగుజాతికి వన్నె తెచ్చిన ఒంగోలు జాతి ఎడ్లను కాపాడుకుందామని రైతులకు పిలుపునిచ్చారు. తెలుగుజాతి గౌరవం ఒంగోలు జాతి ఎడ్లపై ఆధారపడి ఉందనే విషయాన్ని ప్రభుత్వాలు గుర్తించినపుడే ఎడ్లను సంరక్షించుకోవటం సాధ్యమవుతుందన్నారు. దృఢమైన, బలిష్ఠమైన శరీరాకృతి ఒంగోలు జాతి ఎడ్ల సొంతమన్నారు. పొడవాటి మూపురంతో నడకలో అవి రాజఠీవిని ఒలకబోస్తాయన్నారు.

అంతర్జాతీయ ఖ్యాతి గడించిన ఒంగోలు జాతి ఎడ్లకు ఆంధ్ర రాష్ట్రమే పుట్టినిల్లన్న విషయం నేటికీ పాలకులు గుర్తించకపోవటం రైతుల దురదృష్టమన్నారు. వైసీపీ అధికారంలోకి వస్తే ఒంగోలు జాతి ఎడ్ల పరిరక్షణ బాధ్యతను తాను భుజాలపై వేసుకుంటానని చెప్పారు. స్వతహాగా తాను ఒంగోలు జాతి పశు పోషకుడినని, ఈ జాతిని అభివృద్ధి చేయడం, పోషణ భారం వంటి అనేక విషయాల్లో అవగాహన వుండడం వల్లే జాతీయస్థాయిలో పోటీలు నిర్వహించ గలిగానన్నారు. రైతుల సహకారం ఉంటే ప్రతి ఏటా ఇదేవిధంగా జాతీయస్థాయి పోటీలు నిర్వహించడం ద్వారా ఒంగోలు జాతి ఎడ్ల ఖ్యాతి, సామర్థ్యాన్ని దేశానికి తెలియజేస్తానన్నారు. పోటీలో పాల్గొనే ప్రతి పోటీదారునికి రూ. 5వేలు చొప్పున నగదు బహుమతి, జ్ఞాపిక అందజేస్తూ ఒంగోలు జాతి పశు పోషకులందరినీ గౌరవిస్తున్నానని ఎమ్మెల్యే నాని వివరించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ రాష్ట్ర నేత దుక్కిపాటి శశిభూషణ్, మున్సిపల్ వైస్ చైర్మన్ అడపా బాబ్జి, గొర్ల శ్రీను, మట్టా జాన్‌విక్టర్, కొడాలి చిన్ని పాల్గొన్నారు.





సీనియర్స్ విభాగం పోటీలను ప్రారంభిస్తున్న గుడివాడ ఎమ్మెల్యే కొడాలి నాని. పోటీలు చూసేందుకు తరలివచ్చిన జనసందోహం

ఘనంగా పోటీలు

ఎన్టీఆర్ టూ వైఎస్సార్ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఒంగోలు జాతి ఎడ్ల బండలాగుడు పోటీలను చూసేందుకు దాదాపు లక్ష మంది రైతులు తరలివచ్చారు. దీంతో ఉదయం 10 గంటల నుండి రాత్రి 8గంటల వరకు లింగవరం వైపు వెళ్లే రోడ్లన్నీ ట్రాఫిక్‌తో నిండిపోయాయి. వందలాది కార్లు, వేలాది బైక్‌లను ఎక్కడపడితే అక్కడ పార్కింగ్ చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. కాగా, సీనియర్స్ విభాగంలో కృష్ణా జిల్లా గనవ్వరం మండలానికి చెందిన శ్రీ లక్ష్మీ నరసింహా నంది బ్రీడింగ్ బుల్ సెంటర్ అధినేతలు కాసనేని పావనా చౌదరి, గగనాచౌదరిల ఎడ్ల జత 2500 కేజీల బండను నిర్ణీత సమయం 15 నిముషాల్లో 2,432 అడుగుల దూరం లాగి మొదటి స్థానంలో నిలిచింది. విజేతలకు రూ. లక్ష బహుమతి అందజేశారు. జూనియర్స్ విభాగంలో 2,100 కేజీల బరువున్న బండను విజయవాడ సమీపంలోని కానూరుకు చెందిన దేవభక్తుని సుబ్బారావు ఎడ్ల జత 2400 అడుగుల దూరం లాగి మొదటి స్థానంలో నిలవగా రూ. 70వేలు బహుమతి అందజేశారు. కాగా పాలపళ్లు, వ్యవసాయ విభాగం, సబ్ జూనియర్స్, జూనియర్స్, సీనియర్స్ విభాగాల్లో మొత్తం 37 బహుమతులతో పాటు పాల్గొన్న ప్రతి ఎడ్ల జతకు రూ.5వేలు నగదు బహుమతులను అందజేశారు. ఈ పోటీల నిర్వహణకు దాదాపు రూ. 40లక్షలు ఖర్చు చేసినట్టు తెలుస్తోంది.

‘కార్పొరేట్ స్థాయి’కి కోడి పందేలు!

- మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలే నిర్వాహకులు
- కళ్లు మూసుకున్న పోలీసులు
- జగన్ కార్యక్రమాలను మాత్రం అడ్డుకుంటారా?
- వైసీపీ అధికార ప్రతినిధి అంబటి రాంబాబు ధ్వజం

ఆంధ్రభూమి ప్రత్యేక ప్రతినిధి

అమరావతి, జనవరి 16: రాష్ట్రంలో టీడీపీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు ప్రజల బలహీనతలైన కోడి పందేల పేరుతో జూదశాలలు తెరిచి వాటిని కార్పొరేట్ స్థాయికి తీసుకెళ్లారని, తద్వారా కోట్లాది రూపాయల అక్రమ సంపాదనకు తెరతీశారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి అంబటి రాంబాబు ఆరోపించారు. విజయవాడలోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. క్రికెట్ పిచ్‌లు ఏర్పాటు చేసి ట్వంటీ 20 క్రికెట్ మ్యాచ్‌ల మాదిరిగా ఫ్లడ్‌లైట్లు పెట్టి కోడి పందేలకు కార్పొరేట్ లుక్‌ను తీసుకొచ్చారని వ్యాఖ్యానించారు. సంక్రాంతి పండుగలో ముగ్గులు, కోడి పందేలు అనేవి సంప్రదాయంగా వస్తున్నాయని, అయితే అవి ఆయా పల్లెల్లో రైతులు వారి స్తోమతకు తగ్గట్లు నిర్వహించుకునేవారని గుర్తుచేశారు. టీడీపీ నేతలు వాటిని జూదశాలలుగా మార్చేసి ఏకంగా వారి ఫ్లెక్సీలతో ఆహ్వానిస్తూ క్రికెట్ పిచ్‌ల మాదిరిగా బరులు తయారుచేశారని విమర్శించారు. ఆ బరుల చుట్టూ జూదక్రీడలైన పేకాట, గుండాట, మద్యం షాపులు, బిర్యానీ పాయింట్లు పెట్టి స్టాల్స్ పెట్టించి వేలం ద్వారా కోట్లాది రూపాయలకు విక్రయించారని ఆరోపించారు. ఇవి కళ్లెదుట కనిపిస్తున్నా పోలీసులు చూసీ చూడనట్లు వదిలివేశారని ఆరోపించారు. పోలీసు వ్యవస్థ నిర్వీర్యం అయిపోయిందని, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి చిన రాజప్పలు కోడి పందేల పట్ల చూసీ చూడనట్లు ఉండమని ఇచ్చిన ఆదేశాలే దీనికి కారణమని విమర్శించారు. హోం మంత్రి నియోజకవర్గంలోనే పందెం కోళ్ల కాళ్లకు కత్తులు కట్టి మరీ పోటీలు నిర్వహిస్తున్నారని, ఆయా స్టాల్స్‌లో మద్యం ఏరులై పారుతోందని, అక్కడ టీడీపీ నేతలు, ప్రజాప్రతినిధులు ఫ్లెక్సీలతో స్వాగత ద్వారాలు ఏర్పాటుచేయడంతో పోలీసులు అక్కడకు వెళ్లే ధైర్యం చేయలేకపోతున్నారని వివరించారు. జూదాలు అరికట్టాల్సిన పోలీసులు చట్టం అమలు చేయలేక చేతులెత్తేస్తూ ప్రతిపక్ష నేత వైఎస్ జగన్ ప్రత్యేక హోదా కోసం ప్రదర్శన చేద్దామని వస్తే విశాఖ ఎయిర్‌పోర్టులో వేల మంది పోలీసులు వచ్చి అడ్డుకున్నారని గుర్తుచేశారు. ముద్రగడ పద్మనాభం రిజర్వేషన్ల అమలు కోసం పాదయాత్ర చేద్దామంటే ఆయన ఇంటిని, ఊరును చుట్టుముట్టి రోజుల తరబడి తిష్టవేసి కాపు కాస్తారన్నారు. అదేవిధంగా ప్రజల సమస్యలపై ఉద్యమిద్దామంటే తనను ఇంటికి వచ్చి నిర్బంధిస్తారని వ్యాఖ్యానించారు. మరి చట్టవ్యతిరేక, న్యాయస్థానం ఆదేశాలకు విరుద్ధంగా జూదం, బెల్ట్‌షాపులు, అసభ్య నృత్యాలు నడుస్తుంటే పోలీసులు చోద్యం చూస్తున్నారని, ఇది దారుణమైన విషయం కాదా అని అంబటి ప్రశ్నించారు. క్రికెట్ బెట్టింగ్ ఆడుతున్నారంటూ క్రికెట్ మ్యాచ్‌ల సమయంలో రాష్ట్రంలో దాన్ని జూదంగా పేర్కొంటూ ఇదే పోలీసులు వారిని అరెస్ట్ చేస్తున్నారని, ఇక్కడ మాత్రం టీడీపీ ఫ్లెక్సీలు కట్టుకుని బోర్డులు పెట్టుకుని జూదశాలలు నిర్వహిస్తుంటే, వాటిని టీవీలలో లైవ్‌లు



ఇస్తుంటే పోలీసులకు ఆ ధైర్యం ఏమైందని నిలదీశారు.


‘ముఖ్యమంత్రి కూడా కత్తులు కట్టకుండా పందేలు వేయమని చెప్పారు. అందుకే ముఖ్యమంత్రినే అడుగుతున్నాం. మీ టీడీపీ నేతలు ఇలా చేస్తున్నట్లు ఆధారాలతో చెప్పడానికి సాక్ష్యాలు కూడా ఉన్నాయి. చట్టాన్ని విచ్చలవిడిగా అతిక్రమిస్తున్నారు. చట్టాలు, న్యాయసూత్రాలను అమలు చేసేందుకు మాత్రం పోలీసు ఉన్నతాధికారులు చోద్యం చూస్తూ మీనమేషాలు లెక్కిస్తున్నారు. ఇది మంచి పద్ధతి కాదు. చరిత్ర మిమ్మల్ని క్షమించదు. చట్టాలను ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకోండి’ అని రాంబాబు డిమాండ్ చేశారు.

దేశంలో మోదీకి, బీజేపీకి తిరుగులేదు

- కర్ణాటక ఎన్నికల్లోనూ మాదే గెలుపు
- పార్టీ జాతీయ అధికార ప్రతినిధి జీవీఎల్

ఆంధ్రభూమి బ్యూరో

విజయవాడ, జనవరి 16: దేశంలో ప్రధాని నరేంద్ర మోదీకి, భారతీయ జనతా పార్టీకి ఇక తిరుగులేదని, త్వరలో ఎన్నికలు జరుగబోతున్న కర్నాటకలో బీజేపీ భారీ మెజార్టీతో అధికారాన్ని కైవసం చేసుకోబోతోందని బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి జీవీఎల్ నరసింహారావు అన్నారు. ప్రధాని మోదీ తన సమర్థతతో ప్రపంచంలోనే అత్యున్నత స్థానానికి చేరుకున్నారని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయనన్నారు. ప్రపంచంలోనే అత్యంత ప్రాచుర్యం కలిగిన గేలప్ ఇంటర్నేషనల్ సర్వే సంస్థ కొన్నిరోజుల క్రితం వెల్లడించిన తన సర్వే నివేదికలో మోదీ మూడో స్థానానికి చేరుకున్నారంటే ప్రపంచ ప్రజలు ఆయనను ఎంతగా ఆదరిస్తున్నారో, అభిమానిస్తున్నారో ఇట్టే అర్థమౌతోందన్నారు. మూడున్నరేళ్ల క్రితం వరకు జాతీయ రాజకీయాల్లో లేరని, పేరొందిన రాజకీయ కుటుంబం నుంచి వచ్చిన వ్యక్తి కూడా కాదని, ప్రజల కోసం పనిచేస్తూ మోదీ స్వతహాగా ఎదుగుతూ వచ్చారని అన్నారు. ఈ తాజా సర్వేలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పదో స్థానం, రష్యా అధ్యక్షుడు పుతిన్ ఆరో స్థానానికి వెళ్లారని ఆయన తెలిపారు. ప్రపంచ బ్యాంక్ తాజాగా భారత్ ఆర్థిక ప్రగతిని ప్రశంసిస్తోందని, ప్రస్తుతం ఆర్థిక ప్రగతి 7.3 శాతానికి పెరిగిందన్నారు. పదేళ్లపాటు ప్రధానిగా వున్న మన్మోహన్‌సింగ్ ఆర్థికవేత్త అయినా సాధించింది ఏమీలేదని ఆయన విమర్శించారు. చైనా ఆర్థిక ప్రగతి భారత్ ముందు వెలవెలబోతోందన్నారు. రాజకీయంగా బీజేపీ శరవేగంతో విస్తరిస్తోందని, 14 రాష్ట్రాల్లో బీజేపీ ముఖ్యమంత్రులు ఉండగా మిత్రపక్షాల భాగస్వామ్యంతో మరో ఐదు రాష్ట్రాల్లో అధికారంలో ఉందన్నారు. 70 శాతం ప్రజలు కలిగిన రాష్ట్రాలకు బీజేపీ సారథ్యం వహిస్తుంటే రెండో స్థానంలో వున్న కాంగ్రెస్ పార్టీ కేవలం 9 శాతం ప్రజలున్న రాష్ట్రాలకే ప్రాతినిధ్యం వహిస్తోందన్నారు. కర్నాటకలో బీజేపీ గెలుపు ఖాయమంటూ తద్వారా దక్షిణాది రాష్ట్రాల్లో పాగా వేస్తామని చెప్పారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో కూడా పుంజుకుంటామన్నారు. త్వరలోనే మేఘాలయ, మిజోరం రాష్ట్రాల్లో కూడా ఎన్నికలు జరగబోతున్నాయని, అక్కడా బీజేపీ విజయం తథ్యమన్నారు. అభివృద్ధిపరంగా బీజేపీ ప్రజాదరణ పొందుతోందంటూ ఉజ్వల పథకం కింద 5కోట్ల మంది ముస్లింలకు ఉచిత గ్యాస్ కనెక్షన్లు అందిస్తున్నామన్నారు. ముద్రా యోజన పథకం కిదం 7 కోట్ల మందికి నేరుగా రుణ సౌకర్యంతో ఉపాధి కల్పిస్తున్నామని జీవీఎల్ నరసింహారావు వివరించారు. విలేఖరుల సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి జమ్ముల శ్యాంకిషోర్, తదితరులు పాల్గొన్నారు.



ఏకీకృత సర్వీస్ రూల్స్ సాధనలో అవరోధాల్ని అధిగమిస్తాం

★ టి.ఉపాధ్యాయ ఎమ్మెల్సీ జనార్ధనరెడ్డి

ఆంధ్రభూమి బ్యూరో


విజయవాడ, జనవరి 16: రాష్ట్రంలోని ఉపాధ్యాయులకు ఏకీకృత సర్వీస్ రూల్స్ సాధనలో ఎదురవుతున్న సాంకేతికపరమైన అవరోధాలను అధిగమించి తీరుతామని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ, పీఆర్‌టీయు నేత, తెలంగాణ ఫ్రంట్ ఫ్లోర్‌లీడర్ కె జనార్ధనరెడ్డి అన్నారు. మంగళవారం కృష్ణా జిల్లా గన్నవరం సమీపంలోని పెద అవుటుపల్లికి తెలంగాణ రాష్ట్ర పీఆర్‌టీయు ప్రధాన కార్యదర్శి ఎస్ చెన్నకేశవరెడ్డితో కలసివచ్చిన ఆయన తనను కలిసిన విలేఖరులతో మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ శాసనమండలి సభ్యుల ఫ్రంట్ లీడర్ గాదె శ్రీనివాసులునాయుడుతో కలిసి తాను త్వరలో ఢిల్లీ వెళ్లి న్యాయ నిపుణులతో చర్చించనున్నట్లు తెలిపారు. ఏదిఏమైనా సర్వీస్ రూల్స్ ఫలాలు ఉపాధ్యాయులందరికీ అందేలా కృషి చేస్తామన్నారు. వీరికి పీఆర్‌టీయు కృష్ణా జిల్లా అధ్యక్షుడు డి శ్రీను ఆధ్వర్యంలో పలువురు ఉపాధ్యాయులు ఆయనకు ఘన స్వాగతం పలికారు.

దావోస్‌లో ఏపీ ప్రగతి రథం!

★ చంద్రబాబు, లోకేష్ కన్నా ముందే చేరిక
★ పెట్టుబడుల అనుకూల ప్రచారంపైనే దృష్టి

ఆంధ్రభూమి ప్రత్యేక ప్రతినిధి

అమరావతి, జనవరి 16: దావోస్‌లో ఈ నెలలో జరగనున్న ప్రపంచ ఆర్థిక వేదికకు వివిధ దేశాలు, రాష్ట్రాల నుంచి పారిశ్రామికవేత్తలు, ప్రపంచ దిగ్గజ కంపెనీల ప్రతినిధులు హాజరుకానున్నారు. దావోస్ సదస్సుకు హాజరుకావడమంటే అదో ప్రతిష్ఠ. ఆయా దేశాలు, రాష్ట్రాలు తమ ప్రాంతంలో కంపెనీలు స్థాపించాలని కోరుతూ, అందుకు తగిన పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ఇస్తాయి. అలాంటి దావోస్ సదస్సుకు హాజరవుతున్న విదేశీ కంపెనీలను ఆకట్టుకునేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ముందుగానే రంగంలోకి దిగింది. అక్కడ ఏకంగా ఒక ప్రత్యేక ప్రచార రథాన్నే ఏర్పాటు చేసింది. ఏపీలో పెట్టుబడులకు అనుకూల అంశాలు, అందుబాటులో ఉన్న వనరులు, ప్రభుత్వం ఇస్తున్న రాయితీలు, దేశంలో తమ రాష్ట్రానికి వ్యాపారంలో ఉన్న అనుకూల అంశాలు, వాటికి వచ్చిన రేటింగ్‌లను ఆ ప్రచార రథంలో రూపొందించింది. ఇప్పుడు ఆ రథం దావోస్ నగర రహదారులపై విహరిస్తోంది. ఈ నెల 20న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఐటీ శాఖ మంత్రి లోకేష్ దావోస్ వెళ్లనున్నారు.



సాగరతీర పర్యాటకానికి అంతర్జాతీయ అవార్డు

★ బెర్లిన్ వేదికగా మార్చిలో ప్రదానం
★ ఉద్యోగుల పనితీరుకు అవార్డులే గీటురాయి: ముఖేష్‌కుమార్ మీనా

ఆంధ్రభూమి ప్రత్యేక ప్రతినిధి

అమరావతి, జనవరి 16: ఆంధ్రప్రదేశ్ పర్యాటక రంగానికి అవార్డుల పరంపర కొనసాగుతోంది. రాష్ట్ర విభజన అనంతరం 13 జిల్లాల పరిధిలో పర్యాటక శాఖ చేపడుతున్న ప్రాజెక్టులు ఇప్పటికే సత్ఫలితాలు ఇస్తుండగా, వివిధ జాతీయ, అంతర్జాతీయ స్థాయి సంస్థలు ఉత్తమ సేవల అవార్డులు అందిస్తున్నాయి. తాజాగా పసిఫిక్ ప్రాంత పర్యాటక రచయితల సంస్థ ఆంధ్రప్రదేశ్ పర్యాటక శాఖకు అవార్డు ప్రకటించింది. మార్చి 9న బెర్లిన్ వేదికగా జరిగే అవార్డుల ప్రదానోత్సవంలో అతిరథ మహారథుల సమక్షంలో రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ కార్యదర్శి ముఖేష్‌కుమార్ మీనా ఈ అవార్డును అందుకోనున్నారు. సాగర తీర పర్యాటకంలో ఉత్తమ ఆగమన కేంద్రం విభాగంలో ఈ అవార్డును అందిస్తున్నట్లు పట్వా ప్రధాన కార్యదర్శి సాగర్ అహ్లూవాలియా రాష్ట్ర పర్యాటక శాఖకు సమాచారం అందించారు. అవార్డుల ప్రదానోత్సవం సందర్భంగా బెర్లిన్ వేదికగా పసిఫిక్ ఏరియా ట్రావెల్ రైటర్స్ అసోసియేషన్ పలు కార్యక్రమాలను చేపడుతుండగా, ఆంధ్రప్రదేశ్ పర్యాటక శాఖ ఆయా కార్యక్రమాల్లో భాగస్వామి కాబోతుంది. వరల్డ్ టూరిజం ఏవియేషన్ లీడర్స్ సమ్మిట్‌తో పాటు, సుస్థిర పర్యాటకం అనే అంశంపై అంతర్జాతీయ స్థాయి సెమినార్ జరగనుంది. ఈసందర్భంగా పర్యాటక, సాంస్కృతిక శాఖ కార్యదర్శి ముఖేష్‌కుమార్ మీనా మాట్లాడుతూ విభజన అనంతరం ఎదురవుతోన్న ఇబ్బందులను సైతం అధికమించి సమగ్ర అభివృద్ధికి అవసరమైన ప్రణాళికలను అమలు చేస్తున్నామని, దీన్ని జాతీయ, అంతర్జాతీయ స్థాయి సంస్థలు గుర్తించటం ముదావహమన్నారు.

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడి నుండి తమకు లభిస్తున్న ప్రోత్సాహంతో ఈ విజయాలను సాధించగలుగుతున్నామని, ఈ క్రమంలో పర్యాటక శాఖ ఉద్యోగుల పనితీరు ప్రశంసనీయమైనదని మీనా కితాబిచ్చారు. అవార్డు సాధనలో గణనీయమైన భూమికను పోషించిన ఆంధ్రప్రదేశ్ పర్యాటక అభివృద్ధి సంస్థ, ఆంధ్రప్రదేశ్ టూరిజం అథారిటీ అధికారులు, సిబ్బందికి రాష్ట్ర ప్రభుత్వం పక్షాన ఆయన అభినందనలు తెలిపారు.

దుగ్గిరాలపాడులో చిరుత సంచారం

★ భయం గుప్పిట్లో గ్రామస్థులు

జి.కొండూరు, జనవరి 16: కృష్ణా జిల్లా జి.కొండూరు మండల పరిధిలోని దుగ్గిరాలపాడు గ్రామంలో చిరుతపులి సంచరిస్తున్నట్లు గ్రామస్థులు చెబుతున్నారు. దీనిపై సర్పంచ్ సంపశాల వెంకట కృష్ణారావు అటవీ శాఖాధికారులకు సమాచారం అందించారు. పాదముద్రలు, ఆనవాళ్లను బట్టి గ్రామంలో చిరుత సంచరిస్తున్నట్లు అటవీ శాఖ అధికారులు కూడా అనుమానం వ్యక్తం చేస్తున్నారు. కాగా కొందరు గ్రామస్థులు చిరుతను తాము చూసినట్లు చెబుతున్నారు. దుగ్గిరాలపాడు గ్రామం అటవీ ప్రాంతానికి దగ్గరగా ఉండటం వల్ల ఇక్కడ వన్యమృగాలు సంచరించే అవకాశాలు లేకపోలేదని అంటున్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా అడవిలోని క్రూర జంతువు జనారణ్యంలోకి రావడంతో ప్రభుత్వ యంత్రాంగం కూడా అప్రమత్తమైంది. చిరుత కదలికలను కనుగొనేందుకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వారు సూచించారు. చిరుత ఎప్పుడు, ఎటువైపు నుంచి దాడి చేస్తుందోనని ప్రజలు భయం గుప్పిట్లో ప్రాణాలు అరచేత పెట్టుకుని కాలం గడుపుతున్నారు.




దుగ్గిరాలపాడులో చిరుత సంచారం సమాచారం తెలిసి పాదముద్రలు పరిశీలిస్తున్న అటవీ శాఖ అధికారులు

ఏవియేషన్ కార్పొరేషన్‌కు రూ. 7.76 కోట్లు విడుదల

★ గత ఏడాది నిధుల మంజూరును తప్పుపట్టిన ‘కాగ్’

విజయవాడ (బెంజిసర్కిల్), జనవరి 16: ఆంధ్రప్రదేశ్ ఏవియేషన్ కార్పొరేషన్‌కు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విమాన, హెలీకాప్టర్, సిబ్బంది జీతభత్యాల కోసం అవసరమైన నిధులను మంజూరు చేసింది. ఏడాది తుది త్రైమాసికానికి సంబంధించి ఇప్పటికే బకాయి ఉన్న మొత్తానికి గాను 7.76 కోట్ల రూపాయల నిధులను ప్రభుత్వం తాజాగా విడుదల చేసింది. ముఖ్యమంత్రి వినియోగించే విమాన, హెలీకాప్టర్ సర్వీసులను ప్రభుత్వానికి అందిస్తున్న సరస్ ఏవియేషన్ సంస్థతో కుదుర్చుకున్న ఒప్పందంలో భాగంగా ఈ నిధులను ప్రభుత్వం విడుదల చేసింది. ఏవియేషన్ కార్పొరేషన్, సరస్ ఏవియేషన్ సంస్థతో గతంలో చేసుకున్న ఒప్పందంలో భాగంగా ముఖ్యమంత్రి ప్రభుత్వ అవసరాల కోసం వినియోగించే విమాన, హెలికాప్టర్ సర్వీసులను అందిస్తోంది. ఇందుకుగాను సరస్ ఏవియేషన్ సంస్థకు ప్రభుత్వం గంటకు రెండున్నర లక్షల రూపాయలు, వినియోగించని పక్షంలో నెలకు రూ. 25 లక్షలు చెల్లిస్తోంది. గత ఏడాది 14.33 కోట్ల రూపాయలను సేవలు వినియోగించుకోకుండానే ఈ సంస్థకు చెల్లించడం పట్ల ‘కాగ్’ అభ్యంతరం తెలిపింది. ప్రభుత్వం విడుదల చేసిన నిధుల్లో విమాన, హెలికాప్టర్ సేవల ఫీజుతో పాటు సిబ్బంది జీతభత్యాలు కూడా ఉంటాయి.




గాలిపటం ఎగరేస్తూ బాలుడి దుర్మరణం

నందిగామ, జనవరి 16: సంక్రాంతి పండుగ రోజు సరదాగా గాలిపటం ఎగురవేస్తూ ప్రమాదవశాత్తూ అపార్ట్‌మెంట్ పైనుండి జారి కిందపడి ఓ బాలుడు మృతి చెందాడు. కృష్ణా జిల్లా నందిగామలోని ఎన్టీఆర్ అపార్ట్‌మెంట్ పైనుంచి నేలవెల్లి నితీష్ కుమార్(15) సోమవారం గాలిపటం ఎగురవేస్తూ ప్రమాదవశాత్తూ కింద పడిపోవటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ బాలుడు స్థానిక ఓ ప్రైవేటు పాఠశాలలో పదో తరగతి విద్యార్థి. కుమారుని అకాల మరణంతో తల్లిదండ్రులు అంజలి, చంద్రశేఖర్ కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. అంజలి ఫిర్యాదు మేరకు పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

పాపికొండలకు పోటెత్తిన వీఐపీలు!

■ ప్రత్యేక బోట్లలో మంత్రి కామినేని, సినీ నటుడు వెంకటేష్ విహారం

పోలవరం, జనవరి 16: సంక్రాంతి పర్వదినాన పశ్చిమగోదావరి జిల్లాలో పాపికొండల విహారయాత్రకు రాష్ట్ర మంత్రి కామినేని శ్రీనివాస్, సినీనటుడు దగ్గుబాటి వెంకటేష్ ప్రత్యేక బోట్లలో బయలుదేరి వెళ్లారు. మంత్రి కుటుంబ సభ్యులతోపాటు ప్రత్యేక బోట్‌లో వెళ్లగా సినీనటుడు వెంకటేష్ తన కుటుంబ సభ్యులు, అన్న సురేష్ కుటుంబ సభ్యులతో కలిసి పాపికొండల విహారయాత్రకు పయనమయ్యారు. సోమవారం ఉదయం విక్టరీ వెంకటేష్ టూరిజం పాయింట్ వద్దకు చేరుకుని తనను ఎవరూ గుర్తించకుండా ముఖానికి తువ్వాలు కట్టుకుని బోట్‌లోకి చేరుకున్నట్టు బోటు ఆపరేటర్లు తెలిపారు. గత వారం రోజులుగా సెలవులు కావడంతో పోలవరం టూరిజం పాయింట్ వద్ద ఉన్న 17 బోట్లు, 5 లాంచీలకు సంబంధించి ఈ నెల 21వ తేదీ వరకు అడ్వాన్స్ బుకింగ్‌లు జరిగినట్టు టూరిజం బోట్ల యూనియన్ వెల్లడించింది.



టూరిజం బోటులో సినీనటుడు వెంకటేష్ సందడి

మాకో గవర్నర్ కావాలి

నరసింహన్ మార్పుకు పట్టు ◆ కేంద్రానికి హరిబాబు లేఖ

ఆంధ్రభూమి ప్రత్యేక ప్రతినిధి



కంభంపాటి హరిబాబు

అమరావతి/విశాఖపట్నం, జనవరి 16: ఉమ్మడి రాష్ట్ర గవర్నర్ నరసింహన్‌ను మార్చాలన్న డిమాండ్ భారతీయ జనతా పార్టీలో ఊపందుకుంటోంది. తాజాగా రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు, విశాఖ ఎంపీ కంభంపాటి హరిబాబు ఆంధ్రప్రదేశ్‌కు కొత్త గవర్నర్‌ను నియమించాలని కోరుతూ కేంద్ర హోం మంత్రి రాజనాథ్‌సింగ్‌కు రాసిన లేఖలో కోరారు. అదే సమయంలో రాష్ట్ర హైకోర్టు కోసం ప్రభుత్వం భవనాలను అన్వేషిస్తోందని, రాష్ట్ర ప్రజల మనోభావాలు గమనించి హైకోర్టు ఏర్పాటుకు చొరవ తీసుకోవాలని ఆయన లేఖలో కోరారు. ఇప్పటివరకూ గవర్నర్ పనితీరుపై బీజేపీ శాసనసభా పక్ష నేత విష్ణుకుమార్ రాజు ఒక్కరే నిరసన గళం వినిపిస్తున్నారు. గవర్నర్ ఇప్పటివరకూ రాష్ట్రంలో పట్టుమని పదిరోజులు కూడా ఉండలేదని, ఆయన తెలంగాణ రాష్ట్రం వైపే ఉన్నారంటూ బహిరంగ విమర్శలు చేశారు. నాలా చట్టం ఆమోదంపై గవర్నర్ వైఖరి రాష్ట్రాన్ని అవమానించేలా ఉందన్న విష్ణుకుమార్‌రాజు.. తక్షణం ఆయనను గవర్నర్ పదవి నుంచి తప్పించాలని, ఆమేరకు ఎంపీలంతా ఢిల్లీపై ఒత్తిడి చేయాలని డిమాండ్ చేసి సంచలనం సృష్టించారు. అయితే, తాజాగా రాష్ట్ర అధ్యక్షుడు కంభంపాటి హరిబాబు కూడా గవర్నర్‌ను తొలగించాలని చెప్పకుండా, కొత్త రాష్ట్రానికి గవర్నర్‌ను నియమించాలంటూ లౌక్యంగా లేఖ రాయడం ప్రస్తావనార్హం. నిజానికి గవర్నర్ వైఖరిపై అటు అధికార తెలుగుదేశం పార్టీ కూడా తీవ్ర అసంతృప్తితో ఉంది. విభజన సమస్యలు అనేకం అపరిష్కృతంగా ఉండగా వాటిని పరిష్కరించకుండా, తెలంగాణ రాష్ట్రానికి ప్రయోజనం చేకూర్చే ప్రతిపాదనలనే ఎప్పుడూ చర్చల్లో తీసుకురావడం టీడీపీకి రుచించడం లేదు. ప్రధానంగా సెక్రటేరియట్ అప్పగింతలో గవర్నర్ ప్రయత్నాలను టీడీపీ సీనియర్లు అప్పట్లోనే ఆక్షేపించారు. పక్కనే ఉన్న తెలంగాణ రాష్ట్రం పంపిన ప్రతిపాదనలు మూడురోజుల్లోనే ఆమోదిస్తున్న గవర్నర్, తమ రాష్ట్రం వంతు వచ్చేసరికి కొర్రీలు వేస్తున్నారన్న అసహనంతో ఉంది. అయినప్పటికీ బాహాటంగా ఒక్కసారి కూడా దాన్ని వ్యక్తీకరించలేదు. ఇప్పుడు ఆ బాధ్యతను మిత్రపక్షమైన బీజేపీ తీసుకోవడంతో తెలుగుదేశం పార్టీకి కావలసిన కార్యం గంధర్వులు చేసినట్టవుతోంది.

ఇక్కడి నుంచే పనిచేయాలి

ఆంధ్రప్రదేశ్‌కు కొత్త గవర్నర్‌ను నియమించాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కంభంపాటి హరిబాబు కేంద్ర హోం మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు లేఖ రాశారు. రాష్ట్ర విభజన తరువాత ఆంధ్రప్రదేశ్ కొత్తగా ఏర్పడిన రాష్ట్రమని, విజయవాడ రాజధానిగా పాలన సాగుతోందని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కూడా హైదరాబాద్ నుంచి విజయవాడకు మకాం మార్చారని హరిబాబు ఆ లేఖలో పేర్కొన్నారు. అమరావతి నుంచే ఇప్పుడు పాలన సాగుతోందని అన్నారు. తాత్కాలిక సచివాలయం, శాసన సభా భవనం అమరావతిలోనే నిర్మించారన్నారు. అయినా, ఇప్పటికీ హైకోర్టు హైదరాబాద్ నుంచి పనిచేస్తోందని హరిబాబు ఆ లేఖలో వివరించారు. హైదరాబాద్ కేంద్రంగా నడుస్తున్న హైకోర్టును విభజించాలని చాలా కాలంగా డిమాండ్ ఉందని ఆయన చెప్పారు. త్వరలోనే ఏపీకి హైకోర్టు వస్తుందన్న ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు. అలాగే, ఏపీ గవర్నర్ కూడా హైదరాబాద్ నుంచే పనిచేస్తున్నారన్నారు. అయితే, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యవహారాలను చూసుకునే పూర్తి స్థాయి గవర్నర్ కావాలని రాష్ట్ర ప్రజలు కోరుకుంటున్నారని హరిబాబు అన్నారు. అందువలన ఏపీకి కొత్త గవర్నర్‌ను నియమించాలని హరిబాబు, రాజ్‌నాథ్‌కు రాసిన ఆ లేఖలో విజ్ఞప్తి చేశారు.





జంగారెడ్డిగూడెం వద్ద శ్రీనివాసపురంలో ఫ్లడ్‌లైట్ల వెలుగులో కోడి పందేలు ★ విశాఖ శివారు రామకృష్ణాపురంలో నిర్వహిస్తున్న కోడి పందేల దృశ్యం

కాయ్ రాజా కాయ్..!

జోరుగా కోడిపందేలు, జూదాలు ◆ మూడు రోజుల్లో చేతులు మారిన కోట్లాది రూపాయలు

ఆంధ్రభూమి బ్యూరో

రాజమహేంద్రవరం/విశాఖపట్నం, జనవరి 16: సంక్రాంతి సరదా మాటున గోదావరి జిల్లాలు మూడు రోజులపాటు కోడి పందేలతో పల్లెల్లో రద్దీగా సాగాయి. ఏటికేడాది కోర్టు తీర్పు కోసం ఎదురుచూడడం, నిర్వాహకులు పందాలు నిర్వహించేందుకు నేతలపై వత్తిడి తేవడం..షరా మామూలుగానే జరిగింది. ఈ ఏడాది కూడా యధారాజా తథాప్రజా అన్నట్లు కోడి పందేలు బరితెగించారు. ఈ మూడు రోజులపాటు సాగిన పందేల జూదం దాదాపు రూ.100 కోట్లు పైమాటేనని అనధికారిక అంచనా. అన్ని దారులూ కోడి పందేలవైపే అన్నట్టుగా కనిపించాయి. ఏ ఈడాది మరింత ఆసక్తికరంగా కోడి పందేలు సాగాయి. జిల్లాలో సఖినేటిపల్లి, మలికిపురం, రాజోలు, ఐ పోలవరం, కాట్రేనికోన, ముమ్మిడివరం, ఆత్రేయపురం, కొత్తపేటతోపాటు మెట్టలోని కోరుకొండ, గోకవరం, మైదాన ప్రాంతంలోని పిఠాపురం, సామర్లకోట, వేట్లపాలెం, హుస్సేన్‌పురం, తిమ్మాపురంలలో జోరుగా కోడి పందేలు సాగాయి. పోలీసులు ప్రేక్షకపాత్ర పోషించారు. మురమళ్లలో దాదాపు రూ.50 కోట్ల మేరకు ఫ్లడ్ లైట్ల వెలుతురులో కోడి పందేలు భారీ స్థాయిలో నిర్వహించారు. పోలీసులు ఈ ప్రాంతం దరిదాపులకు కూడా వెళ్లలేదు. ఒక్క మురమళ్ల ప్రాంతంలోనే కోడి పందాల నిర్వహణకు సంబంధించి పోలీసులకు దాదాపు కోటి రూపాయల వరకూ ముడుపులు ముట్టాయని ఆరోపణలు వెల్లువెత్తాయి. మిగతా జిల్లాలోని అన్ని స్టేషన్లకు కలిపి మరో కోటి రూపాయల వరకూ పోలీసులకు ముట్టినట్టు తెలియవచ్చింది. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఇదే జిల్లాకు చెందిన వారు కావడంతో మరింత రాజకీయ పలుకుబడి మధ్య కోడి పందాలు దర్పంగా సాగాయని తెలుస్తోంది. మురమళ్లలో నిర్వహించిన భారీ కోడి పందేలకు ఒక మోస్తరు నేతల దగ్గర నుంచి ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులు సైతం హాజరయ్యారు. కోడి పందేలకు కళ్లెం వేద్దామని జిల్లా ఎస్పీ, జిల్లా కలెక్టర్ పండుగకు ముందు హెచ్చరికలు జారీచేసినా అవేమీ వాస్తవానికి కనిపించలేదు. మెట్టప్రాంతంలో జరిగిన పందాలకు రూ.50వేల నుంచి రూ.10 లక్షల్లోపు పందాలు కాస్తే, బోడి, బోడిలంక వంటి ప్రాంతాల్లో రూ.10లక్షల నుంచి రూ.20 లక్షల్లోపు, ఐ పోలవరంలో రూ.20 లక్షల నుంచి 30, 40, 50 లక్షల స్థాయిల్లో పందాలు సాగినట్లు తెలుస్తోంది. కొమరగిరి తదితర ప్రాంతాల్లో పొలాలను సైతం పందాల్లో పెట్టారు. కోడి పందేలకు అనుబంధంగా ఆయా బరుల వద్ద మట్కా,జూదం, గుండాట, పేకాట తదితర అనుబంధ జూదాలు సైతం జోరుగా సాగాయి. .

కోర్టులు వద్దన్నా, కలెక్టర్ ఆంక్షలు విధించినా, పోలీసులు ససేమిరా అన్నా, రాజకీయ నాయకుల అండతో విశాఖలో కోడి పందాలు పెద్ద ఎత్తున సాగాయి. పందెంలో కోట్ల రూపాయలు చేతులు మారాయి. విశాఖ నగర శివారు ఆరిలోవ, లక్ష్మీపురం, రామకృష్ణాపురం, ఆనందపురం, సబ్బవరం తదితర ప్రాంతాల్లో కోడి పందాలు జరిగాయి. అధికార పార్టీకి చెందిన ఎమ్మెల్యేల కనుసన్నలలోనే ఈ పందాలు జరగడం గమనార్హం. అయితే, ఈ పందాల్లో పాల్గొనేందుకు అన్ని పార్టీల నుంచి నాయకులు రావడం విశేషం. పందాలు జరిగే ప్రదేశంలో పోలీసుల జాడే లేకపోవడం గమనార్హం.

పర్యాటకులపై తెగబడ్డ నిర్వాహకులు

పాపికొండలలో పైశాచికత్వం ◆ విచ్చలవిడిగా దాడులు ◆ బాధితుల పరుగులు





పర్యాటకులపై దాడి చేస్తున్న పాపికొండల టూర్ నిర్వాహకులు, వారి అనుచరులు



గాయాలు చూపుతున్న ఓ బాధితుడు

భద్రాచలం టౌన్, జనవరి 16: ఉల్లాసంగా.. ఉత్సాహంగా ప్రకృతి ఒడిలో మమేకమై సేదదీరుదామని పాపికొండలకు వచ్చే పర్యాటకులకు రక్షణ కొరవడుతోంది. ప్రసిద్ధి చెందిన ఈ పర్యాటక ప్రాంతం కొందరి కనుసన్నల్లోనే సాగుతుండటంతో ఎవరి ఇష్టారాజ్యం వారిదే అన్నట్లు ఇక్కడ పెత్తనం కొనసాగుతోంది. పర్యాటకుల పట్ల దురుసుగా, అనుచితంగా ప్రవర్తించడం ఒకఎత్తయితే.. ఏకంగా దాడులకు తెగబడటం విస్తుగొలుపుతోంది. ప్రపంచ పర్యాటక చిత్రపటంలో తనదైన ముద్ర వేసుకున్న పాపికొండల విహారయాత్రలో దౌర్జన్యాలు జరగడం పర్యాటకుల్లో అభద్రతా భావాన్ని నింపుతోంది. ఈ నెల 14న ఖమ్మం, హైదరాబాద్‌లకు చెందిన 21 మందితో కూడిన ఒక బృందం పాపికొండల విహారయాత్రకు వచ్చి చేదు అనుభవాన్ని చవిచూసింది. వీరంతా ఆంధ్రప్రదేశ్‌లోని వర రామచంద్రాపురం మండలం పోచారం నుంచి లాంచీ ద్వారా కొల్లూరు హట్స్‌కు చేరుకున్నారు. అదే రాత్రి వారంతా అక్కడే బస చేశారు. అయితే సోమవారం మధ్యాహ్నం భోజన సమయంలో భోజనం విషయంలో అభిప్రాయ భేదాలు తలెత్తాయి. భోజనం సరిగ్గా లేదంటూ వేరే కొందరు నిర్వాహకులను ప్రశ్నించారు.

దీంతో స్వల్ప వివాదం రేగి అది కాస్తా ఘర్షణకు దారితీసింది. వారంతా అక్కడి నుంచి వెళ్లిపోగా ఈ ఘర్షణతో ఎలాంటి సంబంధం లేని ఖమ్మం, హైదరాబాద్ నుంచి వచ్చిన బృందంపై పాపికొండల టూర్ నిర్వాహకులు దాడికి దిగారు. భోజనం సరిగ్గా లేదని చెప్పింది తాముకాదని వారు చెప్పేలోగా కర్రలతో వారిని నిర్వాహకులు చితకబాదినట్లు బాధితులు మంగళవారం భద్రాచలంలో ఏర్పాటు చేసిన విలేఖర్ల సమావేశంలో వెల్లడించారు. తమను కర్రలు, రాడ్లతో కొట్టడమే కాకుండా తమ బృందంలోని మహిళల వద్ద ఉన్న ఆభరణాలు, మగవారి వద్ద ఉన్న నగదును వారు బలవంతంగా తీసుకున్నారని బాధితులు ఆరోపించారు. మహిళలు కాళ్లపై పడి కొట్టవద్దని వేడుకున్నా వారిని సైతం విచక్షణా రహితంగా కొట్టి గాయపర్చారని ఆవేదన వ్యక్తం చేశారు. సంక్రాంతి పండుగ వేళ కుటుంబాలతో సంతోషంగా గడుపుదామని ఇక్కడకు వచ్చామని, తమకు సంబంధం లేని విషయంలో తమపై పాపికొండల టూర్ నిర్వాహకులు, వారి అనుచరులు దాడి చేశారని, ప్రాణాలు కాపాడుకునేందుకు పరుగులు తీయాల్సివచ్చిందని వారన్నారు. మీడియాతో బాధితులు మాట్లాడుతున్న సమయంలో వారి పిల్లలు బిక్కుబిక్కుమంటూ బయట కూర్చున్నారు. ఏమి జరిగిందో చెప్పమని ప్రశ్నిస్తే ఆ భయానక దాడి గురించి చెబుతూ కన్నీరుపెట్టారు.

షరా‘మామూళ్లు’!

నిఘా నిద్దరోతే.. విజయవంతంగా ముగిసిన జూద క్రీడలు

విజయవాడ (క్రైం), జనవరి 16: రాష్ట్రంలో కోడి పందేలు సంప్రదాయం ప్రకారం కాకుండా జూదంగా మారిపోయాయి. సంక్రాంతిలో కోడి పందేలూ భాగమే. అవి లేని పండుగను చూడలేము. కానీ పందేలు జూదంగా మారితే.. వినోదం కాస్తా వ్యసనమైతే.. చట్టం కొరడా ఝుళిపించక మానదు. కోర్టులు సైతం రంగంలోకి దిగి అడ్డుకట్ట వేయాల్సిందే. అయితే న్యాయస్థానాల ఆదేశాలను సైతం లెక్కచేయని ధిక్కార ఘనులు మాత్రం తమ పంతం నెగ్గించుకున్నారు. విచ్చలవిడిగా జూదాలు నిర్వహించడం ద్వారా పలు జిల్లాల్లో కోడి పందేలు, రకరకాల జూదాలు విజయవంతంగా ముగిశాయి.

శ్రీకాకుళం, విజయనగరం మొదలు గోదావరి జిల్లాలు, కృష్ణా, గుంటూరు, విజయవాడ సహా ఈ సంవత్సరం సంక్రాంతి కోడి పందేల జోరు ఆకాశాన్నంటింది. కోడి పందేల ఖరీదు ఈ ఏడాది సుమారు 500కోట్ల రూపాయలకు పైమాటేనని నిర్వాహకులు చెబుతున్నారు. కత్తులు కట్టకుండా పందేలు నిర్వహించుకోవచ్చని సుప్రీం కోర్టు ఇచ్చిన మార్గదర్శకాలను ఆసరా చేసుకున్న నిర్వాహకులు దాని మాటున జోరుగా పందేలు కానిచ్చేశారు. అయితే కోర్టు ఆదేశాలు పాటించారా అంటే అది వట్టిమాటే. ఏం జరిగితే అదే జరుగుతుంది అంటూ బహిరంగంగానే కత్తులు కట్టి మరీ ఆడించేశారు. అందుకు రాజకీయ నేతల అండదండలు లభించాయి. నియంత్రించాల్సిన పోలీసు వ్యవస్థ నిర్వీర్యమైపోయింది. రాష్ట్రస్థాయి పోలీసు ఉన్నతాధికారులే చేతులెత్తేయడంతో ఏ జిల్లాకాజిల్లా యంత్రాంగం గేట్లు బార్లా తెరిచేసింది. ప్రతిఫలంగా పందేలు నిర్వహించిన ప్రతి జిల్లాలోనూ స్టేషన్లవారీగా అందరికీ పెద్దమొత్తాల్లో నజరానాలు అందాయని ఆయా చోట్ల నిర్వాహకులు బహిరంగంగానే కూత పెడుతున్నారు. ఉన్నత న్యాయస్థానాల ఆదేశాలున్నా ఎప్పటిలాగే పోలీసులను నియంత్రించడంలో రాజకీయ నేతలు కృతకృత్యులయ్యారు. పైగా అధికార పక్షానికి చెందిన ప్రజాప్రతినిధుల కనుసన్నలోనే శిబిరాలు నడిచాయి. గ్రామాలు, మండలాలు, నియోజకవర్గాల్లో పెద్దఎత్తున పందిళ్లు వేసి రాత్రుల్లో సైతం యథేచ్ఛగా నడిపేందుకు పగటిని తలపించేలా ఫ్లడ్‌లైట్లు అమర్చి పందేలు సాగించారు. పాలకపక్షం చూసీచూడనట్లు వ్యవహరించాలని సూచించడం వల్లే కోడి జూదం ఇంతలా విజయవంతంగా ముగిసిందనడంలో అతిశయోక్తి లేదనే ఆరోపణలున్నాయి. ఆయా శిబిరాల్లోనే అశ్లీల నృత్యాలు, బెల్టుషాపులు, పలావు సెంటర్లు, పేకాట, లోపలా-బయట, కోతముక్క, మూడుముక్కలాట, గుండాట వంటి ఇతర జూదక్రీడల్లో సైతం కోట్ల రూపాయలు చేతులు మారాయి. ఎక్కడికక్కడ అధికార పార్టీ ఎమ్మెల్యేలు, నేతలే దగ్గరుండి మరీ నిర్వహించినా పట్టించుకునే సాహసం పోలీసులకు లేకుండాపోయింది. కృష్ణా జిల్లా, విజయవాడ పోలీసు కమిషనరేట్ పరిధిలోని శివారు ప్రాంతాలు పెనమలూరు, ఉయ్యూరు, గన్నవరం, కొత్తూరు తాడేపల్లి, గుంటూరు జిల్లాలోని శివారు ప్రాంతాల్లో కోడి పందేల జూదం గోదావరి జిల్లాలకు ఏమాత్రం తీసిపోనట్లు సాగింది. నిఘా విభాగం సైతం నిద్రలోకి జారేసి ‘మామూళ్ల’తో కొట్టిమరీ పందేలు నిర్వహించిన ఘనత రాజకీయ నేతలదే.

శ్రీశైలంలో ఆది దంపతుల కల్యాణం

శ్రీశైలం, జనవరి 16: సంక్రాంతి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మకర సంక్రాంతిని పురస్కరించుకుని సోమవారం శ్రీశైలంలో ఆది దంపతులైన పార్వతీ పరమేశ్వరుల కల్యాణాన్ని వేడుకగా నిర్వహించారు. ఉత్సవమూర్తులను అందంగా అలంకరించి అక్క మహాదేవి అలంకరణ మండలంలోకి తోడ్కొని వచ్చారు. అక్కడ వేదికపై స్వామి, అమ్మవార్లను ఆశీనులను చేయించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మంగళవాయిద్యాలు, పండితుల వేద మంత్రాల నడుమ అమ్మవారు, స్వామివారి కల్యాణం నిర్వహించారు. వేలాదిగా తరలివచ్చిన భక్తులు ఈ సుందర దృశ్యాన్ని చూసి పులకించిపోయారు. అనంతరం నంది వాహనంపై స్వామి, అమ్మవార్లకు గ్రామోత్సవం నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం మల్లన్న, భ్రమరాంబిక అమ్మవార్లకు పుష్ప పల్లకి ఉత్సవం నిర్వహించారు. పుష్పపల్లకిలో స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను ఆశీనులను జేయించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రకరకాల పుష్పాలను ఇందుకు వినియోగించారు. పుష్పపల్లకిలో గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ నారాయణ భరత్‌గుప్తా, అర్చకులు, భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

తిరుమలలో ఘనంగా పార్వేటి ఉత్సవం

తిరుపతి, జనవరి 16: తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామివారికి పార్వేటి ఉత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. స్వామివారికి ప్రాతఃకాలారాధన పూర్తయిన తర్వాత శ్రీ మలయప్ప స్వామివారు వెండి తిరుచ్చిలో, శ్రీ కృష్ణ స్వామివారు మరో తిరుచ్చిలో పార్వేటి మండపానికి చేరుకున్నారు. అనంతరం శ్రీ మలయప్ప స్వామివారు శ్రీ కృష్ణస్వామివారు పార్వేటలో ఉత్సాహంగా పాల్గొన్నారు. శ్రీ మలయప్ప స్వామి వారి తరపున అర్చకులు 3సార్లు బాణం, ఈటెలు వేసి మాదిరి వేటను ప్రదర్శించి, భక్తులకు కనువిందు చేశారు. ఈ ఉత్సవంటో టీటీడీ ఉన్నతాధికారులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

రంకేసిన కోడెగిత్త - పోటీపడ్డ యువత

రామచంద్రాపురం/చంద్రగిరి, జనవరి 16: సంక్రాంతి, కనుమ పండగ సందర్భంగా చిత్తూరు జిల్లాలోని పలు గ్రామాల్లో జల్లికట్టు ఉత్సవం ఉత్సాహంగా జరిగింది. జిల్లాలోని రామచంద్రపురం, చంద్రగిరి, రామకుప్పం తదితర మండలాల్లో యువత ఉత్సాహంగా జరిపారు. మంగళవారం రామచంద్రపురం మండలం బొప్పరాజుపల్లి గ్రామంలో పశువుల పండుగ నిర్వహించారు. కోడెగిత్తలు రంకేసి దూసుకొస్తుండగా యువత పోటీలు పడి పశువులను పట్టడానికి ముందుకెళ్లారు. పశువులను దొడ్లల్లో ఉంచి కాపరులు కొమ్ములను జువ్వి రంగులు వేశారు. చురుకైన పశువులకు చెక్క పలకలు కొమ్ములకు కట్టి సిద్ధం చేశారు. నడివీధి గంగమ్మకు పూజలు నిర్వహించి యువకులు ఒక్కొక్కదొడ్డి నుంచి పశువులను వదులుతూ డప్పులతో బెదిరించారు. బలమైన కోడెగిత్తలకు నూతన వస్త్రాలు, ప్రత్యేక బహుమతులు కట్టి నడివీధిలోకి తరిమారు. వేగంగా వస్తున్న కోడెగిత్తలను, పశువులను పట్టుకోవడానికి యువకులు పోటీలు పడ్డారు.

తల్లిదండ్రులకు నివాళులర్పించిన బాబు

ఆంధ్రభూమి బ్యూరో

తిరుపతి, జనవరి 16: పెద్దల పండుగ పర్వదినాన్ని పురస్కరించుకొని సోమవారం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తన తల్లిదండ్రులైన నారా ఖర్జూరనాయుడు, తల్లి అమ్మణ్ణమ్మల సమాధుల వద్ద పుష్పాంజలి ఘటించి ఘనంగా శ్రద్ధాంజలి ఘటించారు. సంక్రాంతి పర్వదినాలను తన జన్మస్థలమైన నారావారిపల్లెలో గత పది సంవత్సరాలుగా సంబరాలు జరుపుకోవడాన్ని ముఖ్యమంత్రి ఆనవాయితీగా పాటిస్తున్నారు. 13న ఆయన తన కుటుంబ సభ్యులతో కలిసి నారావారిపల్లెకు చేరుకున్న విషయం పాఠకులకు విదితమే. సోమవారం తల్లిదండ్రులకు ఇంట్లో కొత్త వస్త్రాలు పెట్టుకొని పూజలు నిర్వహించారు. అనంతరం ఇంటికి సమీపంలో ఉన్న తల్లి నారా ఖర్జూరనాయుడు, తల్లి అమ్మణ్ణమ్మల సమాధుల వద్దకు తన సతీమణి భువనేశ్వరిదేవి, కుమారుడు నారా లోకేష్, కోడలు బ్రాహ్మణి, మనువడు దేవాంష్, వియ్యంకుడు బాలకృష్ణ దంపతులతో కలిసి వెళ్లి పుష్పాంజలి ఘటించారు.

సంస్కృతి, సాంప్రదాయాలను గౌరవించాలి

చంద్రగిరి, జనవరి 16: మన సంస్కృతి, సాంప్రదాయాలు భగవంతుడు ఇచ్చిన వరమని, వాటిని మన ఆస్తిగా భావించాలని ముఖ్యమంత్రి నారాచంద్రబాబు నాయుడు అన్నారు. సంక్రాంతి సందర్భంగా ఈనెల 13 నుంచి నాలుగు రోజులపాటు తన స్వగ్రామం నారావారి పల్లెలో వేడుకలు జరుపుకుని, మంగళవారం మధ్యాహ్నం టీటీడీ కల్యాణమండపంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో సిఎం మాట్లాడారు. ఈసందర్భంగా చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ జన్మభూమిని అభివృద్ధి పరచి రుణం తీర్చుకోవాలన్నారు. గత 15 సంవత్సరాల క్రితం తన సతీమణి భువనేశ్వరి సంక్రాంతి రోజున స్వగ్రామానికి వెళ్లాలని పట్టుపట్టిందన్నారు. అప్పటి నుంచి సంక్రాంతి సంబరాలను జన్మస్థలంలో జరుపుకుంటున్నానన్నారు. నేడు పర్వదినాలలో స్వగ్రామాలకు వచ్చేవారి సంఖ్య కూడా గణనీయంగా పెరిగిందన్నారు. ఈక్రమంలో తానున్న గ్రామాల్లో రెండు మూడు గదులు కట్టుకుని అవసరమైన సౌకర్యాలు కూడా ఏర్పాటు చేసుకుంటున్నారన్నారు. తద్వారా గ్రామం అభివృద్ధి చెందడమే కాకుండా గ్రామస్థులు కూడా ఆనందంగా పండుగలు కూడా జరుపుకుంటారన్నారు. కష్ట సుఖాలను పాలుపంచుకోవడానికి, జన్మభూమి రుణం తీర్చుకోవడానికి గతంలోకన్నా భిన్నంగా పండుగ వాతావరణంలో ఈనెల 2వ తేదీ నుంచి నేటి వరకు జన్మభూమి-మా ఊరు, భోగి, సంక్రాంతి, కనుమలు జరుపుకునే విధంగా కార్యక్రమాలు రూపొందించి అమలు చేసుకున్నామన్నారు. ఎక్కడైనా అభివృద్ధి జరగాలంటే ప్రజల భాగస్వామ్యం ముఖ్యమన్నారు. స్మార్ట్‌విలేజ్, స్మార్ట్ సిటీ పేరుతో కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు.

జిల్లాకు హంద్రీ-నీవా నీరు

హంద్రీ-నీవా పుట్టపర్తి వద్ద చిన్న సమస్య వల్ల హంద్రీ నీవా ప్రాజెక్టు నిర్మాణంలో ఆలస్యమైందని త్వరలో అధిగమించి మొదటి మదనపల్లికి, తరువాత పుంగనూరు, పలమనేరు, కుప్పంకు తాగునీరు, సాగునీరు అందిస్తుందని సిఎం చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. అదే సమయంలో మదనపల్లి నుంచి శ్రీనివాసపురం తీసుకువచ్చి పీలేరు నియోజక వర్గ పరిధిలోవున్న వాల్మీకి పురం,అక్కడ నుంచి చంద్రగిరి, అక్కడ నుంచి చిత్తూరుకు నీళ్లు తీసుకువెళ్లేవిధంగా డిజైన్ చేశామన్నారు. ఈ ఏడాదికే ఈ కార్యక్రమాన్ని పూర్తి చేస్తామని అన్నారు. అవసరమైన చోట లిఫ్ట్ ఇరిగేషన్‌లు కూడ నిర్మించి అన్ని చెరువులకు నీరును అందిస్తామన్నారు. మరోవైపు గాలేరు-నగరికి సంబంధించిన మల్లెమడుగు, బాలాజీ రిజర్వాయర్‌ను పూర్తి చేసి సోమశిల, స్వర్ణముఖి ద్వారా కూడా నీటిని పిచ్చాటూరు వరకు తీసుకు వస్తామన్నారు ఈక్రమంలో కరువురహిత జిల్లాగా తీర్చిదిద్దుతున్నామని అన్నారు. చిత్తూరు జిల్లా పారిశ్రామికంగా అభివృద్ధి చెందడానికి అవకాశాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. తిరుపతిలో ఒక విమానాశ్రయం ఉందని, నెల్లూరు జిల్లా దగదర్తివద్ద విమానాశ్రయం ఏర్పాటుకు టెండర్లు పిలిచామని, త్వరలో పనులు ప్రారంభం అవుతాయన్నారు. రైల్వే లైన్లు, జాతీయ రహదారులు కూడా జిల్లాకు అనుకూలంగా ఉన్నాయన్నారు. అటు చెన్నయ్, ఇటు బెంగళూరు, మరో వైపు అమరావతికి రోడ్లు ఉన్నాయన్నారు. ఈ నేపథ్యంలో చిత్తూరు-అమరావతి ఎక్స్‌ప్రెస్ వే రోడ్డును వెంకటగిరికి అనుసంధానం చేసి చిత్తూరుకి రోడ్డు ఏర్పాటు చేస్తామన్నారు.

కన్నుల పండువగా ప్రభల ఉత్సవం



అప్పర్ కౌశికను దాటుతున్న జి అగ్రహారం ప్రభ

అంబాజీపేట, జనవరి 16:సంక్రాంతి పర్వదినాల్లో ఏటేటా కనుమరోజు తూర్పుగోదావరి జిల్లా అంబాజీపేట మండలం జగ్గన్నతోటలో నిర్వహించే ప్రభల ఉత్సవం మంగళవారం కన్నుల పండువగా సాగింది. మొసలపల్లి పంచాయతీ పరిధిలోని కొబ్బరితోటలో ఏకాదశరుద్రులు కొలువుదీరి భక్తులను ఆనందపరవశులను చేశారు. సుమారు 400 వందల సంవత్సరాల క్రితం నుండి ఈ ప్రభల ఉత్సవానికి ఏంతో పేరుంది. 11 పరమేశ్వరుని రూపాలు ఒకేచోట కొలువుదీరి దర్శనమివ్వడంతో దేశ, విదేశాల నుంచి భక్తులు వచ్చి స్వామివార్లను దర్శించుకున్నారు. గంగలకుర్రు శ్రీ సర్వమంగళ పార్వతీ సమేత చెన్నమల్లేశ్వరస్వామి ప్రభ, గంగలకుర్రు అగ్రహారం శ్రీ ఉమాపార్వతీ సమేత వీరేశ్వరస్వామి వార్ల ప్రభలు అప్పర్‌కౌశికను దాటడం భక్తులకు కనువిందు చేసాయి. ఎంతో భారమైన ప్రభలు అర్చకునితో సహా భుజాలపై మోసుకుంటూ శివనామస్మరణతో కాలువను దాటారు. ఉత్సవస్థలిలో మొసలపల్లి, జి అగ్రహారం, గంగలకుర్రు ప్రభలతోపాటు పెదపూడి శ్రీ పార్వతీ సమేత మేనకేశ్వరస్వామి, ఇరుసుమండ శ్రీబాలాత్రిపుర సుందరీ సమేత ఆనందరామేశ్వరస్వామి, ఓంకారేశ్వరస్వామి, ముక్కామల రాఘవేశ్వరస్వామి, వక్కలంక శ్రీ అన్నపూర్ణా సమేత విశ్వేశ్వరస్వామి, పుల్లేటికుర్రు అభినవ వ్యాఘ్రేశ్వరస్వామి, పాలగుమ్మి చెన్నమల్లేశ్వరస్వామి, నేదునూరు చెన్నమల్లేశ్వరస్వామి, వ్యాఘ్రేశ్వరం బాలాత్రిపుర సుందరీ సమేత వ్యాఘ్రేశ్వరస్వామి ప్రభలు భక్తులకు దర్శనమిచ్చాయి. తొలుత మొసలపల్లి మధుమానంత భోగేశ్వరస్వామి వారు ఉత్సవ స్థలానికి చేరుకుని మిగిలిన ప్రభలకు స్వాగతం పలికారు. వాకలగరువు కోడిపందాలదిబ్బ వద్ద, చిరతపూడి గ్రామాల్లో ప్రభల తీర్థం ఘనంగా నిర్వహించారు. తొండవరం శ్రీ ఉమా తొండేశ్వరస్వామి, వాకలగరువు శ్రీపార్వతీసమేత సోమేశ్వరస్వామి ప్రభలు సుమారు 47 అడుగులతో రాష్ట్రంలోనే ఎత్తైనవిగా పేరుగాంచాయి. ఉత్సవాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అమలాపురం డిఎస్పీ ఎవిఎల్ ప్రసన్నకుమార్ ఆధ్వర్యంలో 150మంది పోలీసులతో భారీ బందోబస్తు నిర్వహించారు.

మన దేశపు రాజధానిలో నెలకొని ఉన్న 'తీన్ మూర్తి' స్మారక కేంద్రాన్ని 'తీన్‌మూర్తి - హాయిఫా' స్మృతి చిహ్నంగా ప్రకటించడం వందేళ్ల చరిత్రకు అద్భుతమైన పునరావృత్తి.. ఇజ్రాయిల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహూ మనదేశంలో అధికార పర్యటన కోసం ఆదివారం కొత్త ఢిల్లీకి అరుదెంచిన వెంటనే 'తీన్‌మూర్తి'కి వెళ్లి 'హాయిఫా' యుద్ధంలో అమరులైన భారతీయ సైనికులకు అంజలి ఘటించడం యూదుల కృతజ్ఞతా స్వభావానికి అద్దం! నెతన్యాహూ పర్యటన సందర్భంగా మన దేశానికి ఇజ్రాయిల్‌కూ మధ్య తొమ్మిది ఒప్పందాలు కుదిరాయి. వాణిజ్య, వ్యవసాయ, అంతరిక్ష, సాంకేతిక పరిజ్ఞాన, రక్షణ రంగాలలో ఉభయ దేశాల మధ్య 'సహకారం' మరిన్ని 'మారాకులు' తొడిగిందనడానికి ఈ నూతన 'అంగీకారాలు' ప్రతీకలు. దశాబ్దాల పాటు మోడువారిన 'భారత ఇజ్రాయిల్' సంబంధాలు దాదాపు ఇరవై ఐదు ఏళ్లుగా మళ్లీ చిగురులు వేస్తున్నాయి. 1948లో ఇజ్రాయిల్ స్వతంత్ర దేశంగా ఏర్పడినప్పటికీ ఆ దేశంతో మన దేశానికి 1993 వరకు దౌత్య సంబంధాలు నెలకొనకపోవడం ఘోరమైన చారిత్రక వైపరీత్యం. దౌత్య సంబంధాలు నెలకొన్న తరువాత కూడ ఉభయ దేశాల మధ్య 2003 వరకు సంబంధాలు అంతంతమాత్రం కావడం అంతర్జాతీయ వ్యూహాత్మక అపచారం.. 2003లో అప్పటి ఇజ్రాయిల్ ప్రధాని ఏరియల్ షరన్ మన దేశాన్ని దర్శించాడు, అప్పటి మన ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి కూడా ఇజ్రాయిల్‌ను దర్శించడంతో సంబంధాలు ఆకులు కూడ చిగురించాయి. కానీ అది జరగలేదు.. గత జూలైలో మన ప్రధాని నరేంద్ర మోదీ ఇజ్రాయిల్‌కు వెళ్లివచ్చాడు. "మీ రాక కోసం డెబ్బయి ఏళ్లు నిరీక్షించాం.. ఏడు దశాబ్దులపాటు ఎదురు చూశాము.." అని 'టెల్‌అవీవ్' విమానాశ్రయంలో మోదీకి స్వాగతం చెప్పిన నెతన్యాహూ అప్పుడు ప్రకటించడానికి ఇదీ పూర్వ రంగం! భారత ప్రధాని ఇజ్రాయిల్‌ను సందర్శించడం అంతర్జాతీయ దృష్టిని ఆకర్షించిన పరిణామం. ఇజ్రాయిల్‌ను ధ్వంసం చేయడానికి "ప్రపంచ పటం నుంచి ఇజ్రాయిల్‌ను తుడిచిపెట్టడానికి" 1948 నుంచి యత్నిస్తున్న జిహాదీ బీభత్స మూకలకు కలవరం కలిగించిన పరిణామం! భారత ఇజ్రాయిల్ మైత్రి పడిపడిగా విరిసినప్పుడే ఈ 'మూకల'కు నచ్చని వ్యవహారం.. 2016 నవంబర్‌లో ఇజ్రాయిల్ అధ్యక్షుడు రూవన్ రివ్లిన్ మన దేశానికి వచ్చి వెళ్లడం నరేంద్రమోదీ పర్యటనకు పూర్వ రంగం. ఇలా గత కొన్ని నెలలలో ఈ రెండు అతి ప్రాచీన 'జాతుల' మధ్య మళ్లీ స్నేహం పెంపొందుతోంది. నెతన్యాహూ ప్రస్తుత పర్యటన మరో మైత్రీ ప్రతీక. రాయిసినా 'సంభాషణల ప్రక్రియ' మూడవ సదస్సు ప్రారంభ సమావేశంలో మంగళవారం ఆయన చేసిన ప్రసంగం ఉభయ దేశాల మధ్యగల ఈ చారిత్రక సంబంధాలను మరోసారి గుర్తు చేసింది!

మన దేశం అతిపెద్ద ప్రజాస్వామ్యం. ఇజ్రాయిల్ చాలా చిన్న దేశమైనప్పటికీ పరిణత ప్రజాస్వామ్య రాజ్యాంగ ప్రక్రియ అమలు కొనసాగుతోంది! సర్వమత సమభావ వ్యవస్థ ఉభయ జాతులకు సమానం.. 'సర్వమత సమభావ వ్యవస్థ'ను ధ్వంసం చేసి 'ఇస్లాం మత రాజ్యాన్ని' స్థాపించడానికి యత్నిస్తున్న 'జిహాదీ'లు ఏడు దశాబ్దులుగా ఉభయ దేశాలలోను భయంకర హత్యాకాండ సాగిస్తున్నారు. మన దేశంలోకి పాకిస్తాన్ ప్రభుత్వం 'జిహాదీ' దోపిడీదార్లను ఉసిగొల్పుతోంది. ఇజ్రాయిల్‌కి సైతం పొరుగున ఉన్న 'ఇస్లాం మతరాజ్యా'ల వారు జిహాదీలను ఉసిగొల్పుతున్నారు. మన దేశపు పడమటి సరిహద్దు నుంచి ఇజ్రాయిల్ తూర్పు సరిహద్దు వరకు వ్యాపించి ఉన్న దేశాలలోని జిహాదీల లక్ష్యం "అటు ఇజ్రాయిల్‌ను ఇటు మన దేశాన్ని బద్దలు కొట్టడం.." ఈ రాక్షస వంచన ఎప్పటికీ నెరవేరబోదన్నది చరిత్ర నిరూపించిన నిజం! సోమవారం నాడు ఢిల్లీలో కుదిరిన 'రక్షణ' సహకారానికి ఈ బీభత్స ప్రమాదం ప్రధాన ఇతివృత్తం! జిహాదీలు గెలిస్తే 'సర్వమత సమభావం' ధ్వంసమైపోతుంది. 'జిహాదీ'లు ఓడితే ఇస్లాం మతం వారితోసహా అన్ని మతాలవారు హాయిగా జీవించగలరు. చరిత్ర నిరూపించిన ఈ నిజం మోదీ నెతన్యాహూ చర్చల తరువాత ధ్వనించిన ప్రధాని ప్రకటన సారం..

ఇలా కుదిరిన ఒప్పందాలకు పెరుగుతున్న సహకారానికి రెండువేల ఏళ్ల చరిత్ర సాక్షీభూతం. క్రీస్తుకను పూర్వం ఒకటవ శతాబ్ది వరకూ మధ్యధరా సముద్రపు తూర్పుతీరాన విస్తరించి ఉండిన యూదుల దేశాన్ని - హీబ్రూ భాషా సామ్రాజ్యాలను - రోమన్లు ధ్వంసం చేశారు. అలా 'పాలస్తీనా' నుంచి నిర్వాసితులైన యూదులు రెండువేల ఏళ్లపాటు ప్రపంచమంతా చెల్లాచెదురయ్యారు. 'బైజాంటిన్', 'ఒట్టమాన్' వంటి సామ్రాజ్యాలు ఆ తరువాత పాలస్తీనాలో యూదు సంస్కృతిని నామరూపాలు లేకుండా నశింప చేశాయి. యూదులు శరణార్థులుగా శతాబ్దాల పాటు విదేశాలలో తలదాచుకున్నారు. దాదాపు అన్ని దేశాలలోను స్థానికులు ఈ శరణార్థులను చిన్న చూపు చూశారు, వేధించారు. భారతదేశంలో మాత్రమే తమకు స్థానికులతోపాటు సమాన ఆదరణ గౌరవం ఆతిథ్యం ఉపాధి లభించాయని యూదులు పదేపదే చెప్పుకున్నారు. నెతన్యాహూ ఢిల్లీలో మరోసారి చెప్పాడు. 1918లో మొదటి ప్రపంచ యుద్ధం సమయంలో పాలస్తీనాలోని, మధ్యధరా సముద్రతీరంలోని 'హాయిఫా' ఓడరేవు పట్టణాన్ని తురుష్కుల నుంచి 'బ్రిటన్ మిత్ర దేశాల' కూటమి సైన్యం స్వాధీనం చేసుకున్నాయి. ఆ యుద్ధంలో మైసూరు, హైదరాబాద్, జోధ్‌పూర్ 'రాజ్యాల'కు చెందిన భారతీయ సైనికులు వీరోచితంగా పోరాడడంవల్ల మాత్రమే 'హాయిఫా'కు తురుష్కుల నుంచి విముక్తి లభించింది. ఈ 'హాయిఫా' విముక్తి ప్రపంచంలోని యూదులు తిరిగి తమ 'స్వభూమి'కి వెళ్లి స్థిరపడడానికి దోహదం చేసింది! ఇలా స్థిరపడడం 1948లో 'ఇజ్రాయిల్' స్వతంత్ర దేశంగా ఏర్పడడానికి దారితీసిన శుభపరిణామం! రెండువేల ఏళ్లపాటు దేశం లేని యూదుజాతికి ఇలా దేశం లభించింది! అందువల్లనే 'హాయిఫా'ను విముక్తం చేసిన భారతీయ సైనికుల పట్ల, రెండువేల ఏండ్లు తమకు ఆత్మీయత ఆతిథ్యం ఇచ్చిన హైందవ జాతిపట్ల ఇజ్రాయిల్ - యూదు - హీబ్రూ - ప్రజలకు కృతజ్ఞత ఏర్పడి ఉంది..

నెతన్యాహూ ఢిల్లీలో దిగిన వెంటనే 'తీన్‌మూర్తి'ని దర్శించి భారతీయ అమర వీరులకు అంజలి ఘటించడం ఈ కృతజ్ఞతకు చిహ్నం!.. హాయిఫాను విముక్తం చేయగలిగిన భారతీయ సమరవీరులలో అమరులైన నలబయి మందికి తరతరాల స్మృతిచిహ్నం 'తీన్ మూర్తి'! 2008 నవంబర్‌లో పాకిస్తాన్ జిహాదీలు ముంబయిలో జరిపిన భయంకర బీభత్సకాండలో నూట అరవై మంది మరణించారు. రబ్బీ గాబ్రియెల్ హోల్ట్స్‌బర్గ్ అనే యూదు జాతీయుడు, ఆయన భార్య కూడ మరణించారు! ఆ దంపతుల కుమారుడు మోషే హోల్ట్స్‌బర్గ్ మాత్రం బతికి బయటపడ్డాడు. పదకొండేళ్ల మోషే హోల్ట్స్‌బర్గ్‌ను మోదీ గత జూలైలో ఇజ్రాయిల్‌కు వెళ్లినప్పుడు కలుసుకున్నాడు. ఈ చిన్నారి మోషే ఇప్పుడు ముంబయికి రావడం జిహాదీ బీభత్సంపై సర్వమత సమభావానికి మరో విజయం..

ఆంధ్రభూమి
జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసీ
బుధవారం, 17 జనవరి 2018

హయిఫా స్మృతి.. మోషే ద్యుతి..

సంశయాలు.. ధర్మ సందేహాలు

దేశవ్యాప్తంగా సంచలనం రేపిన సుప్రీంకోర్టు వివాదం రెండు రోజుల్లో ముగిసిపోతుందని భావించిన వారి సముచిత భావనకు తాజాపరిణామాలు ముకుతాడు వేశాయి. సర్వోన్నత న్యాయస్థానం ప్రధాన న్యాయమూర్తికి, మరో నలుగురు న్యాయమూర్తులకు మధ్య నెలకొన్న సమస్యలు పరిష్కారమయ్యాయని వెల్లడించిన అటార్నీ జనరల్ కె కె వేణుగోపాల్ తన మాట మార్చారు. సమస్య ఇంకా పరిష్కారమైనట్టు లేదని పేర్కొనడం ద్వారా దాని తీవ్రతను తేటతెల్లం చేశారు.

సుప్రీంకోర్టులో పాలనావ్యవహారాలు గాడి తప్పాయని ఆరోపణలు చేసిన నలుగురు సీనియర్ న్యాయమూర్తులకు, కీలక కేసులను విచారించేందుకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్ మిశ్రా నియమించిన ప్రత్యేక బెంచ్‌లో స్థానం దక్కలేదు. ఈ పరిణామం వివాదాన్ని మరింత తీవ్రతరం చేసేలా ఉందని న్యాయనిపుణులు భావిస్తున్నారు. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్ మిశ్రా నియమించిన ప్రత్యేక బెంచ్‌లో తనతోపాటు జస్టిస్ ఎ కె సిక్రీ, జస్టిస్ ఎ ఎం ఖఆన్ విల్కర్, జస్టిస్ డి వై చంద్రచూడ్, జస్టిస్ అశోక్‌భూషణ్‌లు ఉంటారని పేర్కొన్నారు. ఈ బెంచ్‌లో ఇటీవల ప్రధాన న్యాయమూర్తి తీరుపై ఎలుగెత్తిన జస్టిస్ జాస్తి చలమేశ్వర్, జస్టిస్ రంజన్ గొగోయ్, జస్టిస్ మదన్ బి లోకూర్, జస్టిస్ కురియన్ జోసఫ్‌లకు చోటు దక్కలేదు. రానున్న కాలంలో సుప్రీంకోర్టు విచారించనున్న అత్యంత కీలక కేసులు అన్నింటినీ ఈ ప్రత్యేక బెంచ్ విచారణ జరపనుంది.

దేశ సర్వోన్నత న్యాయస్థానం మరోసారి సంశయాత్మక స్థితిలో పడిపోయింది. ప్రపంచంలోనే అతి పెద్ద ప్రజాస్వామ్య దేశంలో రాజకీయ వ్యవస్థ, కార్యనిర్వాహక వ్యవస్థపై లేని విశ్వాసాన్ని న్యాయవ్యవస్థపై సామాన్యులు పెంచుకున్నారు. తమ పక్షాన నిలిచే ఏకైక సంస్థగా సుప్రీంకోర్టు ప్రజల మన్ననలు పొందింది. ఈ దేశానికి ప్రజాస్వామ్యం పనికిరాదని, రాచరిక వ్యవస్థే దీనిని గాడిలో పెడుతుందనే భావనలు వ్యక్తమవుతున్న ప్రతిసారీ సుప్రీంకోర్టు జోక్యం చేసుకుని మిగిలిన అన్ని వ్యవస్థలనూ గాడిలోపెట్టి సర్వోన్నత వ్యవస్థగా తమ సత్తాను చూపిస్తూనే ఉంది. ఎంతటి పెద్ద కేసుల్లోనైనా వెరవక ధైర్యంగా తీర్పులను వెలువరిస్తూ ప్రపంచంలోనే భారత సుప్రీంకోర్టు తనదైన ముద్ర వేసుకుంది. అలాంటి న్యాయపాలిక నేడు సవాళ్లను ఎదుర్కోవల్సి వచ్చింది. ప్రస్తుతం అంతర్గతంగా ఉన్న అవ్యవస్థ మలిగిపోయి, ప్రధాన న్యాయమూర్తికి ఉన్న అత్యున్నత నిర్ణయాధికార స్థానంలో పారదర్శకత, జవాబుదారీతనం నెలకొనాలనేది మిగిలిన సీనియర్ న్యాయమూర్తుల వాంఛ అనేది నిర్వివాదాంశం. ప్రజలు పెట్టుకున్న నమ్మకం మరింత సడలిపోకముందే చక్కటి సంస్కరణలతో సుప్రీంకోర్టు తన నీతి, నిజాయితీని నిరూపించుకోవల్సిన తరుణం ఆసన్నమైంది.



బ్రిటిష్ పాలన కాలంలోనే ఇండియన్ హైకోర్ట్సు యాక్ట్-1861 అమలులోకి రావడంతో 1862 జూలై 2న కలకత్తా హైకోర్టు ఆవిర్భవించింది. అదే ఏడాది ఆగస్టు 14న ముంబై హైకోర్టు, 1862 ఆగస్టు 15న మద్రాస్ హైకోర్టు ఆవిర్భవించాయి. 1935 గవర్నమెంట్ ఆఫ్ ఇండియా యాక్ట్ అమలులోకి వచ్చిన తర్వాత మిగిలిన హైకోర్టులకు భారతీయ స్వరూపం వచ్చింది. కలకత్తా, బొంబాయి, మద్రాస్ హైకోర్టుల్లో కాలానుగుణంగా అమలులోకి వచ్చిన ఆచారాలు, సంప్రదాయాల నేపథ్యంతోనే సుప్రీంకోర్టు ఆవిర్భవించింది. సుప్రీంకోర్టు ఏర్పాటు, న్యాయమూర్తుల వేతనాలు, నియామకాలు ఇలా అన్ని విషయాలను స్పష్టంగా, ఎటువంటి సందేహాలకు అవకాశం ఇవ్వకుండా నియమనిబంధనలు, అధికారాలను రాజ్యాంగం చాలా స్పష్టంగా నిర్వచించింది. దీని ప్రకారం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికి విశేష అధికారాలు దక్కాయి. ప్రధానంగా రోస్టర్ నిర్ణయించే అధికారం, లావాదేవీలు జరిపేందుకు కోర్టుల సంఖ్య, కోర్టులను నడిపేందుకు అవసరమైన విధివిధానాలు రూపకల్పన, ధర్మాసనాలు ఏర్పాటు, వ్యాజ్యాలను సభ్యులకు కేటాయించడం కూడా ప్రధాన న్యాయమూర్తి విధిగానే కొనసాగుతోంది. ప్రధాన న్యాయమూర్తికి ప్రస్తుతం అమలులో ఉన్న అన్ని అంశాలకు సంబంధించి లిఖితపూర్వక అదనపుఅధికారాలు లేవని, కోర్టులావాదేవీలు సక్రమంగా అమలు జరిగేందుకు ఉద్దేశించిన సంప్రదాయాలు మాత్రమేనని, మిగిలిన న్యాయమూర్తుల కంటే ప్రధాన న్యాయమూర్తిని అధికుడిగా గుర్తించడానికి లేదనేది తాజాగా నలుగురు న్యాయమూర్తుల వాదన. ప్రధాన న్యాయమూర్తి సమస్థాయిలో ఉన్నవారిలో ప్రథముడిగా ఉంటారే తప్ప అధికుడు మాత్రం కాదనేది వారి ఉవాచ. బహుళ సభ్యులున్న చట్టబద్ధ వ్యవస్థలో ఒక ప్రత్యేక వ్యాజ్యం కోసం ఏర్పాటైన ధర్మాసనం మీద తమకు తాము ఆధిపత్యం తెచ్చుకోకూడదని, ధర్మాసనం కూర్పులోగాని, సంఖ్య నిర్ధారణ విషయంలో రోస్టర్ ప్రకారం జరిగిన నిర్ణయంపై ప్రధాన న్యాయమూర్తికి ఎలాంటి ఆధిపత్యం ఉండదని మిగిలిన న్యాయమూర్తుల అభిప్రాయం. చాలామార్లు ఉల్లంఘనలు జరిగినా, వ్యవస్థను ఇబ్బందికి గురిచేయరాదని తాము పూర్తివివరాలను బహిరంగంగా ఇవ్వడం లేదని న్యాయమూర్తులు తమను తాము సర్దిచెప్పుకున్నారు.

ఎన్‌జేఏసీ కేసుగా ప్రాచుర్యం పొందిన సుప్రీంకోర్టు అడ్వకేట్స్ ఆన్ రికార్డ్సు అసోసియేషన్ అండ్ ఏఎన్ఆర్ వర్సస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసులో సుప్రీంకోర్టులోని ఐదుగురు జడ్జీల ధర్మాసనం జాతీయ న్యాయ నియామకాల కమిషన్‌ను కొట్టివేసింది. న్యాయమూర్తుల నియామకాలు కొలీజియం పద్ధతిలో జరగాలని చెప్పింది. ఈవిధానంలో సుప్రీంకోర్టులోని ఐదుగురు సీనియర్ న్యాయమూర్తులు కొలీజియంగా ఏర్పడి ఉన్నత న్యాయస్థానాల్లో న్యాయమూర్తుల నియామకాలు చేపడతారని ఆ సందర్భంగా పేర్కొంది. కేంద్రప్రభుత్వంతో, సంబంధిత రాష్ట్ర ప్రభుత్వాలతో కొలీజియం సంప్రదింపులు మెమోరాండం ఆఫ్ ప్రొసీజర్ -ఎంపిపి రూపొందించే ప్రక్రియ తుది తీర్పు తర్వాత సవరించాల్సి వచ్చింది. దీంతో కేంద్రప్రభుత్వానికి - సుప్రీంకోర్టుకు అగాధం ఏర్పడిందనే చెప్పాలి. ఎంపీపీ సాకుగా చేసుకుని న్యాయమూర్తుల నియామకాలను కేంద్రప్రభుత్వం ఎంతకూ ఖరారు చేయడం లేదని మాజీ ప్రధాన న్యాయమూర్తి టిఎస్ ఠాకూర్ కన్నీరు పెట్టుకున్నారు. గత ఏడాది మార్చిలో జస్టిస్ జెఎస్ కేల్కర్ ప్రధాన న్యాయమూర్తిగా ఉన్న సమయంలో ఎంపీపీని ఖరారు చేశారు. 2017 మే నెలలో కలకత్తా హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సిఎస్ కర్ణన్‌కు కోర్టు ధిక్కార ఆరోపణల మీద ఏడుగురు న్యాయమూర్తుల సుప్రీంకోర్టు ధర్మాసనం శిక్ష విధించింది. ఈ ధర్మాసనంలో సభ్యుడిగా ఉన్న జస్టిస్ చలమేశ్వర్ విడిగా రాసిన తీర్పులో ఉన్నత న్యాయమూర్తుల నియామకం, న్యాయమూర్తులపై క్రమశిక్షణా చర్యలు తీసుకునే విధానాలను సమీక్షించాలని అభిప్రాయపడ్డారు. ఈ నేపథ్యంలోనే ఆర్ పీ లూథ్రా వర్సస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసుకు ప్రాధాన్యం ఏర్పడింది. సవరించిన ఎంపీపీ పాటించకుండా ఉన్నత న్యాయస్థానాలకు న్యాయమూర్తుల నియామకాలు ఎలా చేపడతారని న్యాయవాది ఆర్ పీ లూథ్రా సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ పిటీషన్ గత ఏడాది అక్టోబర్ 27న ఆదర్శకుమార్ గోయల్, ఉదయ్ లలిత్‌లతో కూడిన ఇద్దరు న్యాయమూర్తుల బెంచ్ విచారించి కేంద్రప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. అంతేగాక, తప్పు చేసిన న్యాయమూర్తులపై చర్యలు తీసుకునే విషయంలో విధి విధానాలను ఖరారు చేయాలని కూడా సూచించింది. అంతేగాక అప్పట్లో అమలులో ఉన్న ఎంపీపీ ప్రకారం న్యాయమూర్తుల నియామకాలు జరగాలని స్పష్టం చేసింది. ఆ తర్వాత నవంబర్ 14న ఈ కేసు చేపడతామని ధర్మాసనం పేర్కొన్నా, నవంబర్ 8న ఈ కేసు విచారణను మరో ముగ్గురు న్యాయమూర్తుల బెంచ్‌కు బదిలీ చేస్తూ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి నిర్ణయం తీసుకున్నారు. ఈ నూతన బెంచ్ అంతకుముందు ఇద్దరు న్యాయమూర్తులు ఇచ్చిన ఆదేశాలను పక్కన పెట్టింది. ఈ అంశాన్ని కూడా జస్టిస్ చలమేశ్వర్ ప్రస్తావించారు. ఇదే రీతిన గత కొన్ని నెలలుగా సుప్రీంలో వ్యవహారాలు తప్పటడుగులు పడుతున్నాయని సీనియర్ న్యాయమూర్తులు సామాజిక మాధ్యమాల ద్వారా ఆవేదన వ్యక్తం చేశారు. ప్రధాన న్యాయమూర్తితో పరిస్థితులను గాడిలోపెట్టేందుకు అనేక ప్రయత్నాలు చేసిన తర్వాతనే వారంతా బహిరంగ ప్రకటనకు దిగారనేది విస్మరించలేం. న్యాయమూర్తుల నియామకానికి సంబంధించి కొలీజియం సమావేశంలో జరిగే చర్చలు ఏవీ నమోదు కాకపోవడంపై 2016 సెప్టెంబర్‌లోనే జస్టిస్ చలమేశ్వర్ ప్రధాన న్యాయమూర్తి దృష్టికి తీసుకువచ్చారు. అభిప్రాయాలు నమోదు కానపుడు కొలీజియంకు హాజరుకావడంలో అర్థం లేదన్నది ఆయన వాదన. అలాగే చాలా కీలక కేసులను జూనియర్లకు అప్పగించడం కూడా రోస్టర్‌ను ఉల్లంఘించడమేనని న్యాయమూర్తుల ఆవేదన. 1993లో అప్పటి సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రామస్వామిపై అవినీతి ఆరోపణలు వచ్చాయి. ఆయనపై లోక్‌సభలో అభిశంసన తీర్మానం కూడా ప్రవేశపెట్టారు. కానీ మూడింట రెండొంతుల మెజార్టీ రాకపోవడంతో ఆ తీర్మానం వీగిపోయింది. 2011లో కలకత్తా హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సౌమిత్ర సేన్ ఆర్థిక అవకతవకలకు పాల్పడినట్టు రాజ్యసభ గుర్తించింది. ఆయనను తొలగించేందుకు ప్రవేశపెట్టిన అభిశంసన తీర్మానాన్ని కూడా ఆమోదించింది. అయితే ఆ తీర్మానాన్ని లోక్‌సభలో ప్రవేశపెట్టడానికి ముందే రాజీనామా చేశారు. కొలీజియంతోపాటు సుప్రీంకోర్టు, హైకోర్టు జడ్జీలపై పరువునష్టం వ్యాఖ్యలు చేసినందుకు కలకత్తా హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కర్ణన్‌కు 2016లో ఆరు నెలల జైలు శిక్ష విధించారు. 2015లో వ్యక్తిగత ఆస్తులను వెల్లడించడానికి హైకోర్టుల్లోనూ, సుప్రీంకోర్టులోనూ న్యాయమూర్తులు జంకుతున్నపుడు కర్నాటక హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శైలేంద్రకుమార్ అప్పటి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బాలకృష్ణన్‌ను విమర్శించారు. 2012లో కర్నాటక హైకోర్టు సిట్టింగ్ జడ్జి జ్ఞాన సుధా మిశ్రా ప్రకటించిన ఆస్తుల్లో తన పెళ్లికాని కుమార్తెలకు అప్పుగా చూపించడం పెద్ద వివాదమే రేపింది. 2012లోనే కర్నాటక హైకోర్టులో విడాకుల కోసం ఓ మహిళ దాఖలు చేసిన పిటీషన్‌ను విచారించిన జస్టిస్ భక్తవత్సల గృహహింస ప్రతి ఇంటిలోనూ ఉంటుందని పేర్కొనడంతో అదో పెద్దవివాదంగా మారింది. గత ఏడాది ఒక కేసులో సుప్రీంకోర్టుపై వ్యాఖ్యలపై వ్యక్తిగతంగా హాజరై వివరణ ఇవ్వాలని అత్యున్నత న్యాయస్థానం మాజీ న్యాయమూర్తి మార్కండేయ కట్జూను ఆదేశించింది. 2015లో హార్దిక్ పటేల్ అరెస్టు కేసును విచారించిన హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జేబీ పార్డీవాలా రిజర్వేషన్లపై వివాదాస్పద వ్యాఖ్యలు చేయడంతో ఆయనకు వ్యతిరేకంగా 58 మంది రాజ్యసభ ఎంపిలు అభిశంసన నోటీసు ఇచ్చారు. సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సదాశివం, న్యాయమూర్తి జస్టిస్ ఎ కె గంగూలిలు తమ వద్ద శిక్షణ పొందుతున్న న్యాయవిద్యార్థినులపై లైంగిక వేధింపులకు పాల్పడ్డారనే ఆరోపణలు వచ్చాయి. మరి కొంచెం వెనక్కు వెళ్తే రాజీవ్ గాంధీ హత్య కేసు(1998) జస్టిస్ కె టి థామస్ కోర్టుకు బదలాయించారు. బోఫోర్సు కేసు (1999) జస్టిస్ ఎం బి షా కోర్టుకు మళ్లించారు. బెస్ట్ బేకరీ కేసు (2004), ఎంపిలు, ఎమ్మెల్యేల అనర్హత కేసు (2005) , షాహాబుద్దీన్ కేసు (2007), రాంజత్మలానీ ఆస్తుల కేసు (2009), స్పెక్ట్రమ్ కేసు (2010), బాబ్రీ కేసులో ఎల్ కె అద్వానీపై ఆరోపణలను కొట్టివేసిన కేసు (2011), ఆధార్ కేసు (2012), బొగ్గు కుంభకోణం కేసు (2012), ఐటి చట్టం 66ఎ చెల్లుబాటు కేసు (2012), బిసిసిఐ కేసు (2013) దారి తప్పాయనేది అందరి వాదన. ఇలా తప్పుకుంటూ పోతే న్యాయమూర్తులు సహజ న్యాయసూత్రాలకు అతీతం కాదనేది ఎన్నడో తేటతెల్లమైంది. సుప్రీంకోర్టు అస్థిత్వాన్ని కాపాడుకోలేకపోతే దేశంలో ప్రజాస్వామ్య మనుగడకు ముప్పు తప్పదు.

-బి.వి.ప్రసాద్

తిమోతిది తిరోగమన ఆలోచన...

జనవరి 3న నేను రాసిన వ్యాసానికి స్పందనగా జాన్ తిమోతి జనవరి 13న ''సాఫ్ట్‌వేర్ కాదు.. సమానత్వం ముఖ్యం'' అని రాసిన సమాచారం చదివాను. ఎవరి అభిప్రాయాలు వారికుంటాయి. అయితే ఆ అభిప్రాయాలు, ఆలోచనలు ఏ మేరకు ప్రాసంగికమైనవన్నదే ప్రధానం. సమకాలీన సమాజానికి ఉపయుక్తంకాని అభిప్రాయాలు, ఆలోచనలకు 'కరెన్సీ' ఉండదు. కానీ ఉంటుందని ఊహించుకునేవారి అభిమతానికి ఎవరెందుకు అడ్డు చెబుతారు? కాలమేవారి శంకలకు సమాధానం చెబుతుంది!

''భూ పంపిణీ సక్రమంగా సాగితే మావోయిస్టులు తుపాకీలు వదిలి జనజీవన స్రవంతిలోకి వచ్చే అవకాశం ఉంది.'' అని జాన్ తిమోతి అన్నారు. అదొక ఊహ మాత్రమే! వాస్తవం మాత్రం కాదు. మావోయిస్టులు పోరాడుతున్నది రాజ్యాధికారం కోసం తప్ప, భూమికోసం, భూపంపిణీ కోసం, గిట్టుబాటు ధరలు రైతులకు దక్కాలన్న డిమాండ్ కోసం కాదు. ఈ ప్రాథమిక అవగాహన ఉన్నట్టయితే అనేక అస్పష్టమైన అంశాలపై స్పష్టత ఏర్పడుతుంది. ఈ కీలకమైన అంశాన్ని విస్మరించడం కారణంగా చాలామంది, అయోమయానికి గురవుతున్నారు. మావోయిస్టులు చెబుతున్న 'నూతన ప్రజాస్వామిక విప్లవం' వర్తమానంలో సాధ్యమా?.. అన్నదానిపైనే దృష్టి నిలిపితే మరెన్నో అనుమానాలు మంచులా విచ్చుకుపోతాయి.

వర్తమానం డిజిటల్ మయం. కృత్రిమ మేథతో సమస్త రంగాలు ప్రభావితమవుతున్నాయి. చివరకు వ్యవసాయం కూడా. రానున్న రోజుల్లో ఈ సాంకేతిక పరిజ్ఞానం మరింత విస్తృతం కానున్నది. ఈ పరిజ్ఞానం వెనుక కనిపించే 'సాఫ్ట్‌వేర్', సాయుధ పోరుకాదు. మరలాంటప్పుడు ఏది ముఖ్యమో ఎవరికి వారే నిశ్చయించుకోవాలి. ఇంటి దగ్గర ఉండి రైతు పొలం వద్ద నీళ్ల పంపు మోటారు 'ఆఫ్' చేస్తున్నాడు. దీనివెనుక సాంకేతికత ఉందిగాని, సాయుధ పోరాట భావనలు లేవు. మరమనుషులు (రోబోలు) వ్యవసాయం చేస్తున్న విషయం గమనించాలి. ఇప్పటికే పెద్దఎత్తున యంత్రాలు వ్యవసాయ రంగంలోకి వచ్చాయి. మానవశ్రమ ఉత్పత్తి రంగంలో గణనీయంగా తగ్గుతోంది. రాబోయే రోజుల్లో దీని విశ్వరూపం కనిపించనున్నది. ఈ నేపథ్యంలో మావోయిస్టులు చెబుతున్న సాయుధపోరు రైతులకు ఉపకరిస్తుందనుకోవడం సమంజసమేనా?.. అని ఎవరికి వారే ప్రశ్నించుకుని సమాధానం చెప్పుకోవాలి.

పశ్చిమ బెంగాల్‌లోని నక్సల్‌బరి ప్రాంతపు రైతులు - కూలీలు వారి వారసులు అంతే దోపిడీకి గురవుతున్నారు. జోతేదారులు (భూస్వాములు) గతంలో మాదిరిగానే దోపిడీ చేస్తున్నారని విశ్లేషించుకోవడం వాస్తవాల్ని చూసేందుకు నిరాకరించడమే అవుతుంది. నక్సల్‌బరి తిరుగుబాటు అనంతరం రెండు-మూడు కొత్త తరాలొచ్చాయి. వారి ఆలోచనలు, అభిప్రాయాలు, ఆకాంక్షలు పట్టించుకోకుండా వారి పూర్వీకులు మాదిరే వీరూ జీవిస్తున్నారని భావించడం సబబు కాదు. కానీ అవే పడికట్టు పదాలతో ప్రపంచాన్ని చూసేందుకు ఇష్టపడితే నష్టపోయేది, కష్టపడేది ప్రజలే! శ్రామికవర్గమే! కాలంతోపాటు వస్తున్న మార్పులను అందుకునేలా చూసేవాడే నిజమైన విప్లవకారుడవుతాడు తప్ప అర్ధ శతాబ్దం క్రితం నాటి భావజాలం, అభిప్రాయాలు, ఆలోచనలు వ్యాప్తి చేసేవారుకాదు!

గ్రామాల్లోనూ 'డిజిటల్ లిటరసీ' భారీఎత్తున పెరుగుతున్న తరుణంలో, ఇంటర్నెట్ ఇంటింటికీ చేరుతున్న కాలంలో, స్మార్ట్‌ఫోన్ ప్రపంచాన్ని కుగ్రామంగా మార్చిన సందర్భంలో, రైతులు - కూలీలు డిజిటల్ చెల్లింపులు జరుపుతున్న వేళ, అనేక 'యాప్'లు ద్వారా సమాచారం అందుకుంటూ ప్రయోజనం పొందుతున్న క్షణాన 'సాఫ్ట్‌వేర్' కీలకంగాకపోతే సాయుధపోరు కీలకం ఎలా అవుతుంది?

జాన్ తిమోతిగాని మరొకరు గాని సమానత్వం అన్న మాట తెలిసి వాడుతారో, తెలియక వాడుతారో గానీ సమానత్వం అన్న పదం మానవాళికి అన్వయమవదు. సాధికారత అనే పదం సమంజసమైనది. మన కుటుంబంలో, కార్యాలయంలో, నివసించే ప్రాంతంలో, మరోచోట ఎక్కడైనా సమానత్వం ఇప్పుడుగాని, గతంలో ఉన్నదా? లేదు! భవిష్యత్‌లోనూ సమానత్వం కనిపించదు. మానవుడి డిఎన్ఏలో అది లేదు. అలాంటప్పుడు మావోయిస్టులు... నక్సలైట్లు, సమానత్వం కోసం పోరాడుతున్నారని చెప్పడం, సమానత్వం సాధ్యమని చెప్పడం మభ్యపెట్టడమే అవుతుంది తప్ప మేల్కొల్పడం అవదు. గతంలో కూరుకుపోయినంత కాలం భవిష్యత్‌ను దర్శించలేం! అణగారిన వర్గాలను ఉన్నత స్థితిలో చూడాలంటే ఆధునిక జ్ఞానం, సాంకేతిక పరిజ్ఞానం, దాని అవగాహన వారికి అందాలి. అందుకనేలా ప్రోత్సహించాలి. అటువైపు నడిచేలా ఉత్తేజ పరచాలి! అంతేగాని తిట్లు, శాపనార్థాలు పెట్టడం వల్ల ఒరిగేది ఏమీ ఉండదు.

కృత్రిమ మేధ, మెషిన్ లెర్నింగ్, బిగ్‌డేటా విశ్లేషణ, క్లౌడ్ కంప్యూటింగ్, ఆటోమేషన్.. యాప్స్, సరికొత్త యాప్స్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్.. వీటిని ఎంతోకొంత జీర్ణం చేసుకుంటేనే బడుగులకు భవిష్యత్. భూస్వామ్యం, దోపిడీ, సామ్రాజ్యవాదం.. లాంటి పదాలకు కాలం చెల్లుతోంది. కాలం చెల్లే పదజాలంతో మమేకమవడం ముఖ్యమా? భవిష్యత్ దృశ్యాన్ని చూపుతున్న సాఫ్ట్‌వేర్ ముఖ్యమా?.. అన్నది జాన్ తిమోతి నిర్ణయించుకోవలసిందే!

-వుప్పల నరసింహం.. 9985781799

చరిత్ర అబద్ధం చెప్పదు!

మన వైయుక్తిక ప్రయోజనాల దృష్ట్యా, అజ్ఞానం దృష్ట్యా చరిత్రను వక్రీకరించవచ్చు. కాని వాస్తవాలు, తేదీలు, సంఘటనలు మారవు. నేతాజీ సుభాష్‌చంద్రబోస్ 1939 తర్వాత ఫార్వర్డ్‌బ్లాక్ అనే పార్టీని ఎందుకు స్థాపించవలసి వచ్చింది? ఆతను కాంగ్రెస్ పార్టీకి అధ్యక్షునిగా పోటీ చేస్తే మహాత్మాగాంధీ స్వయంగా భోగరాజు పట్టాభి సీతారామయ్యను పోటీకి నిలబెట్టాడు. బోసుబాబు గెలిచి పట్టాభి ఓడిపోతే 'ఇది వ్యక్తిగతంగా నా ఓటమి' అని గాంధీజీ ప్రకటించాడు. ''పొమ్మన లేక పొగపెట్టారు'' అని ఒక నానుడి ఉంది. ''నా జీవితంలో నెహ్రూ పెట్టినన్ని బాధలు మరెవరూ పెట్టలేదు'' అని స్వయంగా సుభాష్ బాబు ప్రకటించి పార్టీ వదిలి బయటకు వచ్చాడు. ఇదీ చరిత్ర. సుభాష్‌బాబును, భగత్‌సింగ్‌ను ఉగ్రవాదులు అన్నాడు గాంధీజీ. కనీసం భగత్‌సింగ్‌ను ఉరి నుండి కాపాడడానికి కూడా ప్రయత్నించ లేదు. 1945 తర్వాత భారత దేశ చరిత్రలో సుభాష్ బాబు మరణం ఒక మిస్టరీగా మారింది. ఆయన ఒక విమాన ప్రమాదంలో మరణించాడు అని కథలల్లారు. 1947 నుండి 2014 వరకు నెహ్రూ కుటుంబం ఏకఛత్రాధిపత్యంగా భారతదేశాన్ని నిరంకుశంగా పరిపాలించింది. సుభాష్ బాబు పేరుమీద ఒక్క ప్రభుత్వ రంగ సంస్థకు కూడా పెరు పెట్టలేదు. జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్శిటీ, జవహర్ బాలభవన్, ఇందరాగాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ రాజీవ్ రహదారి- ఇలా భారతదేశ చరిత్ర నడిచింది. త్యాగధనులైన సర్దార్ వల్లభ్‌భాయి పటేల్, నేతాజీ సుభాష్ చంద్రబోస్, గోపాలకృష్ణ గోఖలే, లాల్ బాల్ పాల్, టంగుటూరి ప్రకాశం పంతులు, దుగ్గిరాల గోపాలకృష్ణయ్య, చక్రవర్తుల రాజగోపాలాచారి...ఏమైనారు ఈ మహాపురుషులు? ఊరూపేరు లేకుండా మట్టిలో కలిసిపోయారు. un sung and unwept అన్నట్టు అనాదృతంగా విస్మరింపబడ్డారు. ఇవ్వాళ గుజరాత్‌లో సర్దార్ వల్లభ్‌భాయి పటేల్ కాదు హార్దిక్ పటేల్ మహానాయకుడు. ''పటేల్‌కు భారతరత్న రాకుండా నెహ్రూ కుటుంబం చేసిందికదా'' అని ఒక టీవీ షోలో ఒకరు ప్రశ్నిస్తే 'రాకపోతే ఏమిటిట?'' అని గత అక్టోబర్ 31న ఈ పిల్లవాడు ప్రవచించాడు. వీళ్లా మన నాయకులు? భారతదేశంలో ఐదువందలకు పైగా ఉన్న స్వదేశీ సంస్థానాలను రద్దు చేసి భారతీయ సమైక్యతకు దోహదం చేసినవాడు సర్దార్ వల్లభ్‌భాయి పటేల్. 1952 తరువాత మళ్లీ భాషాప్రయుక్త రాష్ట్రాల పేరుతో ముక్కలు చేసినవాడు జవహర్‌లాల్ నెహ్రూ. భారత జాతికి ఎవరు ప్రాతినిధ్యం వహించే నాయకుడో మీరే నిర్ణయించండి.

నేతాజీ సుభాష్‌చంద్రబోసును ఉగ్రవాది అన్నారు. హిట్లరు బూట్లు నాకే కుక్క అన్నారు. సావర్కార్‌ను మతతత్వవాది అన్నారు. లాల్ బహదూర్ శాస్త్రిని యుద్ధోన్మాది అన్నారు. ఇదంతా దేనికోసం? నెహ్రూ కుటుంబ అనువంశిక పాలనను స్థిరీకరించడం కోసం. ఇవ్వాళ అమితాబ్ బచ్చన్‌లు జయసుధలు రాజకీయ అరంగేట్రం చేసి ప్రజలచేత ఆరాధింపబడుతున్నారు. రజనీకాంత్ కమలహాసన్ చేసిన త్యాగాలేమిటి? రాజకీయ పరిజ్ఞానం ఎంత? న్యూస్‌పేపర్ చదవడానికి కూడా ఇష్టపడనివారు దేశ నాయకులు. తెలంగాణలో ఆడబిడ్డలను బట్టలు విప్పించి బతుకమ్మలు ఆడించినవాడు కాశిం రజ్వీ. మా నిజాము తరతరాల బూజు అన్నాడు మహాకవి దాశరథి కృష్ణమాచార్య. కాని ఇవాళ ఏమయింది? 'మా నిజాం చాలా మంచోడు' అంటున్నారు పాలకులు. మంచోడు అయితే అప్పటి స్వాతంత్ర్య పోరాటం 1947-48లో స్వామి రామానంద తీర్థ - ఎందుకు చేసినట్లు?? ఆనాటి దీన్‌దార్, అంజుమన్ ఇత్తెహాదుల్ మజ్లీస్ - ఉగ్రవాద మత సంస్థలకు వారసులైనవారికి 2017లో మళ్లీ మాన్యత ఎలా వచ్చింది??

భారతదేశంలో నేడు 130 కోట్లమంది ప్రజలున్నారు. వీరిలో ఒక్కడైనా ప్రశ్నించాడా, సికిందరాబాదులో సోనియా ఇటాలియాకు గుడి కట్టడం ఏమిటి? - అని!! ఆనాటి విక్టోరియా రాణి వలె ఈనాడు సిగ్నోరా గాంధీ భారత్‌ను దోచుకొని సంపదలను



తాజ్‌మహల్ లోపలి దృశ్యం

తరలించడానికి వచ్చింది. ఆమెను నాయకురాలిగా అంగీకరించిన వారు ఇంకా చాలామంది ఉన్నారు. మనీష్ తివారీలు, ఆనందశర్మలు, సందీప్ దీక్షిత్‌లు ఉన్నారు. వీరంతా బ్రాహ్మణ సామాజిక వర్గానికి చెందినవారు! 2019 నాటికి బ్రహ్మపుత్ర మీద చైనా నిర్మిస్తున్న డ్యాం పూర్తి అవుతుంది. ఆ తరువాత భారత ఈశాన్య రాష్ట్రాలకు ఒక్క చుక్క నీరు అందదు. ఒకవేళ యుద్ధం వస్తే చైనా వారు డ్యాం గేటుల ఎత్తివేస్తే చాలు ఈశాన్య భారతంలోని బ్రహ్మపుత్ర ప్రాంత పరీవాహక ప్రాంతాలు నీటిలో మునిగిపోతాయి. ఈ వ్యూహం ఇవ్వాళ అందరికీ తెలుసు. ఐనాసరే రాహుల్‌గాంధీ రహస్యంగా వెళ్లి చైనా రాయబారితో మొన్న ఏమి మాట్లాడి వచ్చాడు. ఆ విషయాలపై నరేంద్రమోదీ ఎందుకు విచారణ జరిపించలేదు.

స్వాతంత్ర్యం వచ్చిన తరువాత మన పాఠ్య గ్రంథాలు మార్చబడతాయని ఆశించినవారికి నిరాశ ఎదురయింది. బ్రిటీషువారు రూపొందించిన చరిత్రను కాస్త మెరుగుపెట్టి ఎర్రరంగు అద్ది మళ్లీ అబద్ధాలు వార్చి వడ్డించారు. టిప్పుసుల్తాను గొప్పవాడు, అక్బరు మతసామరస్యం కలవాడు, ఔరంగజేబు కాశీవిశ్వేశ్వరునికి దానాలు చేశాడు, చిత్తోడ్ రాణి పద్మిని అల్లాఉద్దీన్ ఖిల్జీని ప్రేమించింది... ఇవా మన చరిత్రలు? 'షాజహాను తాజ్‌మహల్‌ను నిర్మించెను' ఇంతకన్నా భయంకరమైన అబద్ధం మరొకటి ఉందా? షాజహాను పుట్టడానికి మూడు వందల సంవత్సరాలకు మునుపే అక్కడ ఒక దేవాలయం ఉంది అని అమెరికాలోని న్యూయార్క్ విశ్వవిద్యాలయంలో విపుల పరిశోధన చేసిన ప్రొఫెసర్ మార్విన్ ముల్లర్ తన కార్బన్ సెర్చి భూపరీక్షల ద్వారా నిర్ధారించాడు. ముంతాజ్ బేగం పేరు అంజుమయ్‌బాను బేగం. ఆమె మనం ఊహించుకున్నంత అందగత్తె కూడా కాదు. షాజహాన్ జీవిత చరిత్రను రచించిన ఇనాయత్ ఖాన్ తాజమహల్ షాజహాను కట్టించెను - అని ఒక్క ముక్క కూడా వ్రాయలేదు. తాజమహల్, రాజపుత్రులు నిర్మించిన తేజమహాలయ అని చరిత్రలో ఉంది. సంగీత్‌సోమ్ అనే యూపీ నాయకుడు ఇటీవల తాజమహల్ నిర్మాణం అంశాన్ని తెరమీదకి తీసుకుని వచ్చాడు. దానితో గొడవ మొదలయింది. ప్రకాశ్‌రాజ్ అనే సినీనటుడు మాట్లాడుతూ 'తాజ్‌మహల్ కూల్చివేయబడకముందే మా పిల్లలకు తాజ్ అందాలు చూపించి వస్తాను' అంటూ వ్యంగ్యాస్త్రాలు విసిరాడు. ఈయనకు నటన తెలుసు - కానీ చరిత్ర తెలియదు. భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన డెబ్బయి ఏళ్ల తరువాత కూడా రొమిల్లా థాపర్, విపిన్‌చంద్ర, రాహుల్ సాంకృత్యాయన్‌ల చరిత్రలు పిల్లలు చదువుకోవడం జాతి చేసుకున్న మహాపాపం. తెలుగులో కోట వెంకటాచలం, మల్లంపల్లి సోమశేఖర శర్మ, మారేమండ రామారావు వంటి తొలితరం చరిత్రకారులున్నారు పుచ్చా పరబ్రహ్మశాస్త్రి వంటి మలితరం వారున్నారు. ఆదిరాజు వీరభద్రరావు, కొమర్రాజు లక్ష్మణరావు పేరు నేడు తెలంగాణ ప్రజలలో ఎందరికి తెలుసు? మహామహులు చాలామంది ఉండగా పుర్రచేతి కుర్ర రచయితల పాత్రలు పాఠ్యాంశాలుగా ఉంచడం ఏమిటి?

ఆర్యులు విదేశముల నుండి వచ్చిరి - టిప్పు సుల్తాను గొప్ప వాడు అంటూ గిద్వానీ అనే పెద్దమనిషి రెండు పుస్తకాలు వ్రాశాడు. అందులో టిప్పు సుల్తాను కథ టెలీ సీరియల్‌గా కూడా వచ్చింది. బతికి ఉన్నప్పుడు టిప్పు కన్న తండ్రికి తిండి పెట్టనివాడు, తండ్రి చచ్చాక ఘనంగా శ్రాద్ధ కర్మలు చేశాడని ఓ సామెత. పీవీ నరసింహను బ్రతికి ఉన్నన్నినాళ్లు అవమానించారు. పోయిన రోజున ఆయన దహన సంస్కారాలు కూడా సరిగ్గా జరపకుండా సోనియాగాంధీ చేసింది. ఇప్పుడు పి.వి.కి భారతరత్న ఇవ్వాలి అంటూ పల్లవి అందుకున్నారు. మొగల్ -ఎ- అజామ్, అనార్కలి, చిత్తోడ్ పద్మావతి వంటి చిత్రాల్లో చరిత్ర వక్రీకరిస్తే మనం అభ్యంతరం చెప్పలేదు. 2017లో సర్దార్ పటేల్ జయంతి ఉత్సవాలు చేస్తుంటే దీనిని ఎలక్షన్ స్టంట్ అన్నారు.

కోశాంబి సూడో సెక్యులరిస్టులకు పరమ ప్రాణాధికుడు. ఆయన వేదాలకు వ్యాఖ్యానం చేయడానికి సిద్ధపడ్డాడు. ఋగ్వేదంలో ఇంద్రుని పేరు ప్రధానంగా వస్తుంది. శివుడు విష్ణువు రుద్రుడు సూర్యుడు... ఇలా ఆయా అర్థాలలో చెప్పబడింది. ఇంద్ర - వృత్ర యుద్ధం - తేజస్సుకు, తమస్సుకు సూర్యుడు - మేఘమునకు - మధ్య జరిగిన సంవాదం - దీనిని కోశాంభి ఇంద్రుడు అంటే ఆర్యుడు వృత్తుడు అంటే ద్రావిడుడు - వీరిద్దరూ నీటి పంపకాల కోసం తాటిచెట్లతో యుద్ధం చేసుకున్నారు - అని వ్రాశాడు. మధ్యలో ఈ తాటిచెట్లు ఎందుకు వచ్చాయి? ఇలాంటి మిడిమిడి జ్ఞానం కలవారి చేతిలో మన పాఠ్య గ్రంథాలు పడిపోవడం దుర్మార్గం. నిన్నే ఒక సెక్యులరిస్టు దర్శకుడు, నిర్మాత సంజయ్‌లీలా బన్సాలీని సమర్థిస్తూ అసలు పద్మావతి)(మేవాడ్ రాణి) కథ కల్పితం (ఫిక్షన్) అన్నాడు. ఇదీ సంగతి!!

-ప్రొ.ముదిగొండ శివప్రసాద్


శంకుస్థాపనలతోనే సరి!

కాంగ్రెస్‌పై ప్రధాని మోదీ విసుర్లు ● పథకాలపై పేరుతో పేదలకు అన్యాయం

పఛాపాద్రా (రాజస్థాన్), జనవరి 16: పథకాల పేరుతో కాంగ్రెస్ పార్టీ పేద ప్రజలను మోసం చేసిందని ప్రధాని నరేంద్రమోదీ మంగళవారం ఇక్కడ తీవ్రంగా విమర్శించారు. పథకాలంటూ శంకుస్థాపనలు, శిలాఫలకాలకే వారి కార్యక్రమాలుండేవని వాస్తవానికి పేదలకు వొనగూరింది ఏమీ లేదని ఆయన ధ్వజమెత్తారు. రూ. 43,129 కోట్ల రూపాయలతో చేపట్టిన బార్మేర్ రిఫైనరీ ప్రాజెక్టు పనులను మోదీ ప్రారంభించారు. ప్రజల సంక్షేమం కాంగ్రెస్‌కు పట్టేది కాదని ప్రధాని ఆరోపించారు. కాంగ్రెస్, బీజేపీ పనితీరును బేరీజువేసుకోవాలని ప్రజలకు ఆయన పిలుపునిచ్చారు. 'మేం అధికారంలోకి వచ్చాకే అభివృద్ధి జరుగుతోంది' అని ఆయన అన్నారు. రిఫైనరీ కూడా తమ ఘనతేనని ఆయన చెప్పారు. 'ఇక్కడే కాదు. దేశమంతా ఇదే తంతు నడిచింది. శంకుస్థాపనలు చేయడం.. ఆనక వదిలేయడం' అని కాంగ్రెస్‌పై నిప్పులు చెరిగారు. రాజకీయ ప్రయోజనాల కోసం హడావుడిగా రైల్వే లైన్లు ప్రకటించడం తరువాత వదలేయడం వారి నైజమని విమర్శించారు. ఒక విధంగా ప్రకటనలతోనే ప్రజలను మోసం చేసేవారని అన్నారు. 2014 ఎన్నికల ముందు రక్షణశాఖ ఉద్యోగుల కోసం ఒన్ మేన్- ఒన్ పెన్షన్ (ఓఆర్‌ఓపీ) ప్రకటించారని మోదీ గుర్తుచేశారు. రాజకీయంగా లబ్ధి పొందడానికే మధ్యంతర బడ్జెట్‌లో 500 కోట్లు ప్రకటించారని ఆయన విమర్శించారు. 'బార్మేర్ రిఫైనరీ, ఓఆర్‌ఓపీ కూడా ఎక్కడా పేపర్లపై లేదు. ఇది కాంగ్రెస్ పనితీరు' అని ప్రధాని ఎద్దేవా చేశారు. క్షేత్రస్థాయిలో ఎక్కడా అధ్యయనం చేయకుండా ప్రచారం కోసం పథకాలు ప్రకటించడం కాంగ్రెస్‌కు అలవాటని మోదీ ధ్వజమెత్తారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చాక 12000 కోట్లతో ఓఆర్‌ఓపీని అమలుచేసిందని ఆయన గుర్తుచేశారు. తొలివిడతగా ఇప్పటికే 10,700కోట్ల రూపాయలు విడుదల చేసినట్టు ఆయన పేర్కొన్నారు. మిగిలిన మొత్తం త్వరలోనే రక్షణశాఖ ఉద్యోగులకు అందుతుందని ఆయన వెల్లడించారు. గరీబీ హటావో అన్నది కాంగ్రెస్ ఓ నినాదంగానే చూసిందని ప్రధాని విమర్శించారు. బీజేపీ ప్రభుత్వం నిరుపేదలకు ఎల్‌పీజీ కనెక్షన్లు ఇవ్వడంతోపాటు పేద మహిళలు ఉచితంగా విద్యుత్ కనెక్షన్ ఇచ్చినట్టు ఆయన వెల్లడించారు. దేశంలో ఇప్పటికీ నాలుగు కోట్ల ఇళ్లకు విద్యుత్ సదుపాయమే లేదని ఆయన అన్నారు. కాగా సోనియాగాంధీ 2013 సెప్టెంబర్ 22న రిఫైనరీకి శంకుస్థాపన చేస్తే ప్రధాని మోదీ తిరిగి శంకుస్థాపన చేశారని కాంగ్రెస్ ఎదురుదాడికి దిగింది. అయితే బీజేపీ తన చర్యను సమర్థించుకుంది. 2013 ఎన్నికల్లో ప్రయోజనం కోసమే హడావుడిగా శంకుస్థాపన చేశారని కేంద్ర ఇంధన మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, ముఖ్యమంత్రి వసుంధర రాజే అన్నారు. అప్పటికి భూసేకరణ అలాగే పర్యావరణ అనుమతులు ఏవీ లేవని వారు చెప్పారు. మంగళవారం నాటి కార్యక్రమంపై కాంగ్రెస్ విమర్శలు చేస్తోంది. అల్వార్, అజ్మీర్ లోక్‌సభ, మంగళ్‌గఢ్ అసెంబ్లీ సీట్లకు ఈనెల 29న ఉప ఎన్నికలు జరగనుండగా దీన్ని చేపట్టారని కాంగ్రెస్ ఆరోపిస్తోంది.



బార్మేర్‌లో మంగళవారం జరిగిన బహిరంగ సభలో ప్రసంగిస్తున్న ప్రధాని నరేంద్ర మోదీ



అందాల కనువిందు చేసే తాజ్ యువ ప్రేమ జంటలకే కాదు... దేశాధినేతలకూ దర్శనీయ స్థలమే. భారత్‌ను సందర్శించే ఏ దేశాధినేతలైనా తాజ్‌ను సందర్శించకుండా ఉండరంటే అతిశయోక్తి కాదేమో. భారత పర్యటనలో ఉన్న ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు కూడా ఇందుకు మినహాయింపు కాదు. తన సతీమణి సారాతో కలిసి మంగళవారం తాజ్‌ను సందర్శించి ఇలా ముచ్చట తీర్చుకున్నారు.

మెడికల్ సీట్లు మరిన్ని పెరగాలి

● రాష్ట్రపతి కోవింద్ ఉద్ఘాటన
● ప్రజలందరికీ వైద్యం అందాలి
● ఎయిమ్స్ స్నాతకోత్సవంలో విజ్ఞప్తి

న్యూఢిల్లీ, జనవరి 16: దేశంలో అర్హులైన విద్యార్థులకు వైద్యవిద్యను అందుబాటులోకి తేవాలని రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ స్పష్టం చేశారు. మెడికల్ సీట్ల కొరతను ప్రభుత్వం తీవ్రంగా పరిగణించాల్సిన అవసరం ఉందని మంగళవారం ఇక్కడ ఉద్ఘాటించారు. ఆల్ ఇండియా ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్) 45వ స్నాతకోత్సవంలో రాష్ట్రపతి ప్రసంగించారు. సీట్ల పెంపునకు సంబంధించి ఎదురవుతున్న అడ్డంకులను వివిధ మార్గాల ద్వారా అధిగమించాలని ఆయన సూచించారు. ప్రజలకు వైద్యాన్ని చేరువ చేయడానికి చర్యలు తీసుకోవాలని ఆయన అన్నారు. వైద్యుల కొరతను తీర్చాల్సి ఉందని ఆయన పేర్కొన్నారు. 'దేశ ప్రజలకు అవసరమైన వైద్యం అందాలి. దీని కోసం ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి' అని రాష్ట్రపతి పిలుపునిచ్చారు. మెడికల్ సీట్లు మరింత పెంచడం ద్వారా మరింత మంది డాక్టర్లు అందుబాటులోకి వస్తారని తద్వారా సమాజానికి మెరుగైన వైద్యం దొరుకుతుందని కోవింద్ స్పష్టం చేశారు. 'దేశంలో ప్రభుత్వ, ప్రైవేటు మెడికల్ కళాశాల్లో 67,000 అండర్ గ్రాడ్యుయేట్ సీట్లు ఉన్నాయి. పీజీలో 31,000 సీట్లు ప్రస్తుతం అందుబాటులో ఉన్నాయి. అయినా సరిపోవు. అర్హతగల విద్యార్థులకు మరిన్ని మెడికల్ సీట్లు లభించాలి. వాటిని అందుబాటలోకి తీసుకురావాలి' అని ఆయన అన్నారు. 1.3 బిలియన్ జనాభాకు ఈ సీట్లు ఎంత మాత్రం సరిపోవని రాష్ట్రపతి చెప్పారు. వైద్యవిద్యపై ప్రభుత్వం దృష్టి సారించాలని ఆయన స్పష్టం చేశారు. ఏటా మరింత ఎక్కువ మంది కొత్త డాక్టర్లు కళాశాల నుంచి బయటకు వస్తే సమాజం అవసరాలు తీరతాయని ఆయన తెలిపారు. అంతే కాకుండా వైద్యవిద్య కోసం విదేశాలకు వెళ్లే విద్యార్థుల సంఖ్య తగ్గుతుందని ఆయన అన్నారు. దేశంలోనే సరిపడా మెడికల్ సీట్లు ఉంటే విదేశాలకు వెళ్లరని ఆయన ఉద్ఘాటించారు. 'తక్షణం ఈ విధానం మారాలి. దేశంలోని కాలేజీల్లోనే మెడికల్ సీట్ల సంఖ్య పెరగాలి. అలాగే విద్యార్థులకు వైద్య విద్యను అందుబాటులోకి తేవాలి' అని రాష్ట్రపతి విజ్ఞప్తి చేశారు. ఎయిమ్స్‌పై రాష్ట్రపతి కోవింద్ ప్రశంసలు కురిపించారు. ఎయిమ్స్ ఫ్యాకల్టీ అంకితభావం, మెరుగైన వైద్యంతో దూసుకుపోతోందని ఆయన అన్నారు. ఫ్యాకల్టీ, వైద్యులు, మెడికోలు, కోర్సులు వైద్య రంగానికే కాదు యావత్‌జాతికి గర్వకారణంగా రాష్ట్రపతి పేర్కొన్నారు.

ఎయిమ్స్‌లోని ప్రతి సభ్యుడినీ తాను మనస్ఫూర్తిగా అభినందిస్తున్నట్టు కోవింద్ ప్రకటించారు. పేద, ధనిక తేడాలేకుండా అందరికీ నాణ్యమైన వైద్యం అందాలని రాష్ట్రపతి ఆకాంక్షించారు. దురదృష్టవశాత్తూ పేద ప్రజలకు మెరుగైన వైద్యం అందని ద్రాక్షగా మిగిలిపోయిందని ఆయన ఆవేదన చెందారు. 'మీరు అందించే వైద్యం రోగి, వారి కుటుంబ సభ్యుల్లో విశ్వాసం కలిగించాలి. వారు మళ్లీ మీ దగ్గరకు వచ్చేలా ఉండాలి. రోగి పట్ల మీరు చూపే ఆప్యాయత, సేవలకు వెలకట్టలేం. దాన్ని గుర్తెరగాలి' అని వైద్యులను ఉద్దేశించి కోవింద్ స్పష్టం చేశారు.

మీకు సంబంధం ఏమిటీ?

బోఫోర్స్ పిటిషనర్‌కు సుప్రీం ప్రశ్న

న్యూఢిల్లీ, జనవరి 16: బోఫోర్స్‌లో 64 కోట్ల రూపాయల చెల్లింపుల ఘటనకు సంబంధించి బీజేపీ నేత అజయ్ అగర్వాల్ దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీం కోర్టు తీవ్రమైన వ్యాఖ్యలు చేసింది. ఈ కేసుతో మీకు సంబంధం ఏమిటని ప్రధాన న్యాయమూర్తి దీపక్ మిశ్రా సారథ్యంలోని ధర్మాసనం ప్రశ్నించింది. 2005 మే 31న ఈ కేసులో ఢిల్లీ హైకోర్టు తీర్పును వెలువరించిన విషయాన్ని గుర్తుచేసిన బెంచ్ దీనిపై సీబీఐ సవాల్ చేయలేదని పేర్కొంది. 'ఈ కేసుతో మీకేంటి సంబంధం. మీకున్న అర్హత ఏమిటి?' అని ధర్మాసనం ప్రశ్నించింది. వచ్చేవాయిదా రోజున మీ వాదన వినిపించాలంటూ జస్టిస్ డివై చంద్రచూడ్, జస్టిస్ ఎఎం ఖన్వీకర్‌తో కూడిన బెంచ్ ఆదేశించింది. ఫిబ్రవరి 2కు విచారణ వాయిదా వేశారు. బోఫోర్స్ చెల్లింపులకు సంబంధించి ఆరోపణలు ఎదుర్కొన్న హిందుజా సోదరులు, శ్రీచంద్, గోపీచంద్, ప్రకాశ్ చంద్‌లను నిర్దోషులుగా ఢిల్లీ హైకోర్టు తీర్పును ఇచ్చింది. 2005 మే 31న జస్టిస్ ఆర్ఎస్ సోఢీ ఈ తీర్పును ఇచ్చారు. ఈ కేసును సీబీఐ విచారించింది. ఇలా ఉండగా హైకోర్టు తీర్పును బీజేపీ నాయకుడు అజయ్ అగర్వాల్ సుప్రీం కోర్టులో సవాల్ చేశాడు. అజయ్ ఎవరంటే.. 2014 లోక్‌సభ ఎన్నికల్లో రాయ్‌బరేలీ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అధినేత్రి సోనియాగాంధీపై పోటీ చేసిన వ్యక్తి. రాజీవ్‌గాంధీ ప్రధానిగా ఉండగా బోఫోర్స్ కుంభకోణం వెలుగుచూసింది. ఆయుధాల కొనుగోలుకు సంబంధించి భారత్- స్వీడన్ కంపెనీ మధ్య 1,437 కోట్ల రూపాయల ఒప్పందం కుదిరింది. 1987 ఏప్రిల్ 16న భారత్‌లోని రాజకీయ నాయకులకు ముడుపులు ముట్టినట్టు స్వీడిష్ రేడియో ప్రకటించింది. పలువురు రక్షణశాఖ అధికారులకు ముడుపులు అందాయని సంచలన ప్రకటన చేసింది. 1990 జనవరి 22న సీబీఐ ఎఫ్ఐఆర్‌ను నమోదు చేసింది. బోఫోర్స్ కంపెనీ ఎండీ మార్టిన్ ఆర్డ్‌బో, మధ్యవర్తి విన్ చద్దా, హిందుజా సోదరులపై ఐపీసీలోని వివిధ సెక్షన్ల కింద కేసులు నమోదయ్యాయి.

పత్రాలన్నీ అందజేయండి

● జస్టిస్ లోయ కేసులో సుప్రీం
● మహారాష్ట్ర సర్కార్‌కు ఆదేశం

న్యూఢిల్లీ, జనవరి 16: సీబీఐ ప్రత్యేక న్యాయమూర్తి బిహెచ్ లోయ మృతికి సంబంధించి అన్ని పత్రాలు పిటిషనర్లకు అందజేయాలని మహారాష్ట్ర ప్రభుత్వాన్ని సుప్రీం కోర్టు ఆదేశించింది. జస్టిస్ లోయ మృతిపై అనేక అనుమానాలున్నందున స్వతంత్ర దర్యాప్తు సంస్థతో విచారణ జరిపించాలని పిటిషన్లు దాఖలైన సంగతి తెలిసిందే. లోయ పోస్టుమార్టం నివేదికతో పాటు పలు డాక్యుమెంట్లు సీల్డ్ కవర్‌లో ఉంచి కోర్టుకు అందజేయాల్సిందిగా జస్టిస్ అరుణ్ మిశ్రా, జస్టిస్ ఎంఎం శంతనగౌడ్‌తో కూడిన ధర్మాసనం ఆదేశించింది. దేశంలో సంచలనం సృష్టించిన సోహ్రాబుద్దీన్ ఎన్‌కౌంటర్ కేసును జస్టిస్ లోయ సారథ్యంలోని బెంచ్ విచారించేది. అయితే నాగ్‌పూర్‌లోని స్నేహితుని ఇంట్లో శుభకార్యానికి హాజరైన లోయ గుండెపోటుతో మృతి చెందారు. 2014 డిసెంబర్ 1న ఈ ఘటన చోటుచేసుకుంది. సోహ్రాబుద్దీన్ ఎన్‌కౌంటర్ కేసులో బీజేపీ అధినేత అమిత్‌షాపై ఆరోపణలు వచ్చాయి. తరువాత ఆయనను నిర్దోషిగా కోర్టు ప్రకటించింది.

అయితే సీబీఐ న్యాయమూర్తి లోయ ఆకస్మిక మృతిపై అనుమానాలు వ్యక్తం చేస్తూ సుప్రీంలో పిటిషన్ వేశారు. లోయ మృతి కేసులో కీలక డాక్యుమెంట్లను మహారాష్ట్ర ప్రభుత్వం గోప్యంగా ఉంచుతోందని పిటిషనర్లు ఆరోపించారు. అయితే బయటకు వెల్లడిచేయకూడని పత్రాలు కాబట్టే బహిరంగ పరచడం లేదా పిటిషనర్లకు ఇవ్వడం జరగలేదని మహారాష్ట్ర ప్రభుత్వం తరఫున సీనియర్ అడ్వొకేట్ హరీశ్ సాల్వే సుప్రీంకు తెలిపారు. లోయ మృతి వెనక దాగిన అంశాలపై వాదించేందుకు ధ్రువీకరణ పత్రాలు తప్పనిసరని పిటిషనర్ల తరఫు న్యాయవాది స్పష్టం చేశారు. జస్టిస్ లోయ మృతిపై స్వతంత్ర సంస్థపై దర్యాప్తు జరపాలంటూ రెండు పిల్‌లు సుప్రీం కోర్టులో దాఖలయ్యాయి.

మంగళవారం రెండు పిటిషన్లను విచారించిన ధర్మాసనం తదుపరి విచారణ వచ్చేవారానికి వాయిదా వేసింది. అయితే ఏ తేదీన విచారించేదీ స్పష్టంగా పేర్కొనలేదు. కాగా దివంగత న్యాయమూర్తికి సంబంధించిన అన్ని పత్రాలనూ పిటిషనర్ల తరఫున్యాయవాదికి అందజేస్తామని, అయితే బయటకు వెల్లడిచేయబోమని హరీశ్ సాల్వే తెలిపారు. వారం రోజుల్లో లోయకు సంబంధించిన అన్ని పత్రాలు పిటిషనర్లకు అందజేయాలని సుప్రీం కోర్టు ఆదేశించింది. పిటిషనర్, కాంగ్రెస్ నేత తెహసీన్ పూనావాలా తరఫున అడ్వొకేట్ వీరేందర్ కుమార్ శర్మ మాట్లాడుతూ అత్యంత సున్నితమైన లోయ మృతికేసులో వాస్తవాలు ప్రజలకు తెలియాలని అన్నారు. పూనావాలాతోపాటు జర్నలిస్టు బీ.ఆర్. లోనే సుప్రీం కోర్టులో పిల్‌లు దాఖలు చేశారు.

ఇండ్ల స్థలాల కేసు మార్చి 13కు వాయిదా

ఆంధ్రభూమి ప్రతినిధి

న్యూఢిల్లీ, జనవరి 16: ప్రజాప్రతినిధులు, సివిల్ సర్వీస్ అధికారులు, జర్నలిస్టుల ఇండ్ల స్థలాల కేటాయింపుల కేసు తదుపరి విచారణ మార్చి 13కి వాయిదా పడింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రజాప్రతినిధులకు, సివిల్ సర్వీస్ అధికారులుకు, జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలను కేటాయిస్తూ అప్పట్లో నిర్ణయం తీసుకుంది. దీనిని సవాల్ చేస్తూ కొంతమంది హైకోర్టు, అనంతరం సుప్రీం కోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. మంగళవారం జస్టిస్ జాస్తి చలమేశ్వర్ నేతృత్వంలోని ధర్మాసనం ముందు విచారణకు రావాల్సి ఉండగా, ఈ కేసు కన్నా ముందు మరి కొన్ని కేసులు పూర్తిస్థాయిలో విచారణ కొనసాగడంతో విచారణకు రాలేదు. అయితే ఇండ్ల స్థలాలకు కేసుకు సంబంధించిన న్యాయవాదులు తదుపరి విచారణను మార్చి నెలకు వాయిదా వేయాలని ప్రత్యేకంగా ధర్మాసనానికి విజ్ఞప్తి చేశారు. దీంతో ధర్మాసనం తదుపరి విచారణను మార్చి 13కి వాయిదా వేసింది.



కాంగ్రెస్ అధ్యక్షుడి హోదాలో తొలిసారిగా సొంత నియోజకవర్గమైన అమేథీ పర్యటనకు విచ్చేసిన రాహుల్‌కు నిరసనల సెగ తగిలింది. రాహుల్ రోడ్‌షోను బీజేపీ కార్యకర్తలు అడ్డుకోవడంతో వేరే మార్గంలో గౌరీగంజ్‌కు నడుచుకుంటూ వెళ్తున్న దృశ్యం.

రాహుల్‌కు నిరసనల సెగ

● అడ్డుకునేందుకు యత్నించిన బీజేపీ కార్యకర్తలు
● పర్యటన మార్గాన్ని మళ్లించిన పోలీసులు

అమేథీ, జనవరి 16: ఉత్తరప్రదేశ్‌లో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయాలన్న విస్తృత లక్ష్యంతో కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ చేపట్టిన రెండురోజుల అమేథీ యాత్ర రెండోరోజు నిరసనల మయంగా సాగింది. దీని కారణంగా రాహుల్ తన పర్యటన మార్గాన్ని మార్చుకోక తప్పని పరిస్థితులు తలెత్తాయి. పార్టీ అధ్యక్ష పదవిని చేపట్టిన తర్వాత తొలిసారిగా యుపిలో అడుగుపెట్టారు. ఆయన సొంత నియోజకవర్గమైన అమేథీలో బిజెపి మద్దతుదారులు తీవ్ర స్థాయిలో నిరసనలతో పర్యటనను అడ్డుకునే ప్రయత్నం చేశారు. ముఖ్యంగా గౌరీగంజ్ ప్రాంతంలో కాంగ్రెస్, బిజెపి మద్దతుదారుల మధ్య తీవ్ర స్థాయిలో ఘర్షణలు చెలరేగాయి. దాంతో పోలీసులు జోక్యం చేసుకుని రాహుల్ పర్యటన మార్గాన్ని మార్చారు.

రాహుల్ పర్యటన మొదటిరోజు ఎలాంటి అవరోధాలు లేకపోయినా రెండోరోజు మాత్రం ఘర్షణల కారణంగా గందరగోళమయంగా సాగింది. ఎప్పుడైతే గౌరీగంజ్ ఘర్షణల తీవ్రత పెరిగిందో రాహుల్‌గాంధీ పర్యటన మార్గాన్ని మార్చారు. ముందు అనుకున్న ప్రకారం ఆయన ముసాఫిర్ ఖానా నుంచి గౌరీగంజ్ చేరుకోవాల్సి ఉంది. అయితే మార్గమధ్యలో బిజెపి నేతలు బైఠాయించారు. 'ఈ మార్గంలో రాహుల్‌గాంధీ వెళ్లడానికి మేము ఎంతమాత్రం ఒప్పుకోం' అని తెగేసి చెప్పారు.

దాంతో ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయని, అందుకే రాహుల్ పర్యటన మార్గాన్ని మార్చామని అదనపు ఎస్‌పి బి.సి.దుబే తెలిపారు. జామో రోడ్డు మార్గం ద్వారా రాహుల్ గాంధీ గౌరీగంజ్‌కు చేరుకున్నారు. ఇరువైపులా కాంగ్రెస్ కార్యకర్తలు ఆయనకు స్వాగతం పలికారు. గౌరీగంజ్ - ముసాఫిర్‌ఖానా మార్గంలో మిస్సింగ్ ఎంపీ అంటూ అనేక చోట్ల ప్లకార్డులు ప్రదర్శించారు. రాహుల్‌గాంధీ తన నియోజకవర్గ ప్రజల వైద్య, ఇతర అవసరాలను విస్మరిస్తున్నారని కేవలం ప్రారంభం కాని ప్రాజెక్టులకు శంకుస్థాపనలు చేస్తున్నారని ఆందోళనకారులు నిరసన వ్యక్తం చేశారు. రాహుల్ రాయ్‌బరేలీ వెళ్లినప్పుడు కొందరు బిజెపి నేతలు అడ్డుకునే ప్రయత్నం చేశారు. దీని కారణంగా తన తండ్రి రాజీవ్ గాంధీ విగ్రహానికి ఆయన పూలమాల వేయలేకపోయారు. తొలి రోజు కూడా కాంగ్రెస్, బిజెపి కార్యకర్తల మధ్య ఘర్షణలు జరగడంతో పోలీసులు జోక్యం చేసుకోవాల్సి వచ్చింది.

వారాంతానికి కొలిక్కి?

● పరిష్కారం దిశగా సుప్రీం వివాదం
● సిజెను కలుసుకున్న న్యాయమూర్తులు

న్యూఢిల్లీ, జనవరి 16: సుప్రీంకోర్టు వ్యవహారాల నిర్వహణలో తలెత్తిన వివాదాలకు తెరదించే ప్రయత్నాలు ముమ్మరమయ్యాయి. ప్రధాన న్యాయమూర్తి దీపక్ మిశ్రాతో తలెత్తిన విభేదాలను నివృత్తి చేసుకునేందుకు నలుగురు సీనియర్ న్యాయమూర్తులు మంగళవారం ఆయనతో సమావేశమయ్యారు. న్యాయమూర్తులు జె.చలమేశ్వర్, రంజన్ గగోయ్, ఎం.బి.లోకూర్, కురియన్ జోసెఫ్‌లు చీఫ్ జస్టిస్‌తో దాదాపు పావుగంట పాటు తమ విధులను చేపట్టడానికి ముందే సమావేశమయ్యారు. ఈ సమావేశంలో ఇతర న్యాయమూర్తులు కూడా పాల్గొన్నట్లు తెలుస్తోంది. అనంతరం చీఫ్ జస్టిస్ నలుగురు న్యాయమూర్తులు తమ తమ విధులను చేపట్టేందుకు ఉపక్రమించారని అభిజ్ఞ వర్గాల భోగట్టా. సుప్రీం వివాదం పరిష్కార మార్గంలో పురోగమిస్తోందన్న ఆశాభావాన్ని న్యాయ వర్గాలు వ్యక్తం చేసినప్పటికీ ఈ సంక్షోభం ఇంకా సమసినట్లు కనిపించడం లేదు. ఈ అంశంపై మంగళవారం మాట్లాడిన అటార్నీ జనరల్ కె.కె.వేణుగోపాల్ 'వివాదం ఇంకా పరిష్కారం కాలేదు. రెండు మూడు రోజుల్లో వ్యవహారం ఒక కొలిక్కి వస్తుందని ఆశిస్తున్నాం' అని అన్నారు. ఈ వారంలోగా సమస్య పరిష్కారం కాగలదన్న నమ్మకాన్ని సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వికాస్ సింగ్ ధీమా వ్యక్తం చేశారు.

**సిబిఐ దర్యాప్తును అడ్డుకున్న సిజె
న్యాయవాది ప్రశాంత్ భూషణ్ ఫిర్యాదు**

వైద్యకాలేజీ కుంభకోణం కేసులో హైకోర్టు సిట్టింగ్ న్యాయమూర్తిపై ఎఫ్ఐఆర్ దాఖలు కాకుండా సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి దీపక్ మిశ్రా అడ్డుకున్నారని ఆరోపిస్తూ సీనియర్ న్యాయవాది ప్రశాంత్ భూషణ్ మంగళవారం ఫిర్యాదు చేశారు. ప్రశాంత్ భూషణ్ సారథ్యంలోని జ్యుడీషియల్ అకౌంటబులిటీ, రిఫార్మ్స్ అనే సంస్థ తరఫున ఈ పిటిషన్ దాఖలైంది. ఈ కుంభకోణం వ్యవహారంలో ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటుచేయాలని డిమాండ్ చేసింది. ఐదుగురు సీనియర్ న్యాయమూర్తుల ముందు సిజెపై ఫిర్యాదు నమోదైంది. మెడికల్ కుంభకోణంపై సిబిఐ దర్యాప్తుకు సుప్రీం ప్రధాన న్యాయమూర్తి అనుమతి ఇవ్వలేదని ప్రశాంత్ భూషణ్ అన్నారు.

ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయరా?

● మణిపూర్ బూటకపు ఎన్‌కౌంటర్ల కేసులో సుప్రీం తీవ్ర ఆగ్రహం
● నెలాఖరు కల్లా 30 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయాలని ఆదేశం

న్యూఢిల్లీ, జనవరి 16: మణిపూర్‌లో బూటకపు ఎన్‌కౌంటర్ల కేసుల విచారణలో కొనసాగుతున్న జాప్యంపై సర్వోన్నత న్యాయస్థానం తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తం చేసింది. హింసను అణిచివేత పేరుతో సైన్యం, అస్సాం రైఫిల్స్, రాష్ట్ర పోలీసులపై దాఖలైన ఎఫ్ఐఆర్‌ల పురోగతిని ప్రశ్నించిన సుప్రీం కోర్టు సీబీఐ, సిట్‌లపై మండిపడింది. గతంలో కోర్టు ఆదేశించినా ఎఫ్ఐఆర్‌లు నమోదుచేయకపోవడాన్ని జస్టిస్ మదన్ బీ లోకూర్, జస్టిస్ యుయు లలిత్‌తో కూడిన ధర్మాసనం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. ఈ నెలాఖరునాటికి మరో 30 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయాలని బెంచ్ ఆదేశించింది. ఇప్పటి వరకూ 12 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసినట్టు సిట్ కోర్టు దృష్టికి తీసుకొచ్చింది. ఫిబ్రవరి 28 నాటికి బూటకపు ఎన్‌కౌంటర్ల కేసులో విచారణ పూర్తిచేయాలని న్యాయమూర్తులు స్పష్టం చేశారు. ఇప్పటివరకూ నమోదైన 12 కేసుల్లో విచారణ పూర్తిచేసి తుది నివేదిక సంబంధిత కోర్టుకు అందజేయాలని బెంచ్ ఆదేశించింది. సిట్ దర్యాప్తు తీరుతెన్నులను బెంచ్ ప్రశ్నించింది. గత ఏడాది జూలై 14న ఆదేశించినా ఎఫ్ఐఆర్‌ల నమోదులో ఎందుకింత జాప్యం జరుగుతోందని సుప్రీం నిలదీసింది. అన్ని కేసుల్లోనూ విచారణ ముగించి సీబీఐ డైరెక్టర్ ఆమోదం కోసం పంపాలని ధర్మాసనం సూచించింది. అలాగే దర్యాప్తుపై ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సీబీఐను కోర్టు ఆదేశించింది. కేసు తదుపరి విచారణ మార్చి 12కు వాయిదా పడింది. మణిపూర్‌లో జరిగిన బూటకపు ఎన్‌కౌంటర్ల విషయాన్ని సిట్ తీవ్రంగా పరిగణించడంలేదంటూ గత విచారణ సందర్భంలో ధర్మాసనం ఆగ్రహం వ్యక్తం చేసింది. బూటకపుఎన్‌కౌంటర్లపై విచారణకు ఐదుగులు సీబీఐ అధికారులతో ఓ ప్రత్యేక దర్యాపుబృందాన్ని (సిట్)ను సుప్రీం కోర్టు ఏర్పాటు చేసింది. 1,528 ఎన్‌కౌంటర్లపై సమగ్ర దర్యాప్తు జరపాలంటూ దాఖలైన పిల్‌పై ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయాలని సుప్రీం ఆదేశించింది. 81 కేసుల్లో ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసి విచారించాలని స్పష్టం చేసింది.



గణతంత్ర దినోత్సవ వేడుకల పరేడ్ కోసం మంగళవారం ఢిల్లీలో రిహార్సల్స్ చేస్తున్న బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్, నావికాదళ జవాన్లు. మోటార్ సైకిల్‌లో సాహస విన్యాసం కోసం రిహార్సల్ చేస్తున్న బిఎస్ఎఫ్ మహిళా దళం.



కీలక సూచీల పతనం

'మేధోసంపత్తి' మెరుగుపడొచ్చు

- అంతర్జాతీయ ఐపీ సూచీలో భారత్ ర్యాంక్‌పై జీఐపీసీ ఉపాధ్యక్షుడు పాట్రిక్ అంచనా

న్యూఢిల్లీ, జనవరి 16: భారత ప్రభుత్వం దేశ మేథోసంపత్తి సామర్థ్యాన్ని పెంచడానికి జాతీయ ఐపీఆర్ విధానాన్ని ప్రవేశపెట్టడంతో అంతర్జాతీయ మేధాసంపత్తి (ఇంటలెక్చువల్ ప్రాపర్టీ- ఐపీ) సూచీలో భారత్ ర్యాంక్ మెరుగుపడొచ్చని గ్లోబల్ ఇన్నొవేషన్ పాలసీ సెంటర్ (జీఐపీసీ)లోని ఒక ఉన్నతాధికారి పేర్కొన్నారు. మేథోసంపత్తి సూచీలో నిరుడు భారత్ చివరి స్థానానికి సమీపంలో నిలిచింది. ప్రపంచ వ్యాప్తంగా 45 దేశాలతో కూడిన ఈ సూచీలో భారత్ 43వ స్థానంలో నిలిచింది. అమెరికా చాంబర్ ఆఫ్ కామర్స్‌కు చెందిన గ్లోబల్ ఇన్నొవేషన్ పాలసీ సెంటర్ రూపొందించిన ఆరవ ఎడిషన్ నివేదిక ఈ సంవత్సరం ఫిబ్రవరి 8న విడుదల అవుతుంది. ఈ సంవత్సరం అంతర్జాతీయ మేథోసంపత్తి సూచీలో 40 అంశాల ఆధారంగా 50 దేశాల పనితీరును పరిశీలిస్తారు. ఇతర బ్రిక్స్ దేశాలు- బ్రెజిల్, రష్యా, చైనా, దక్షిణాఫ్రికా సహా ఇతర దేశాలతో పోలిస్తే భారత మేథోసంపత్తి వ్యవస్థ బలహీనంగా ఉందని జీఐపీసీ భావిస్తోంది. ఫార్మా వంటి హై-రిస్క్ కలిగిన రంగాలలో పరిశోధన, అభివృద్ధిలో పెట్టుబడులను ఆకర్షించడానికి న్యాయపరమైన నిశ్చయం అవసరమని అభిప్రాయపడుతోంది. 'మా సూచీలో భారత్ పనితీరు.. గ్లోబల్ ఇన్నొవేషన్ ఇండెక్స్‌లో, ప్రపంచ బ్యాంకు డూయింగ్ బిజినెస్ నివేదికలో సరళిని పోలి ఉంది. ఈ రెండింటిలో భారత్ క్రమంగా పైకి ఎగబాకింది. అలాగే, మా సూచీలోనూ భారత్ తన ర్యాంకును మెరుగు పరచుకుంటుంది. కొత్త ఐపీఆర్ విధానంలో భాగంగా చర్యలు తీసుకున్న ఇక్కడి విధాన నిర్ణేతలకు ఇది శుభవార్త అవుతుందని నేను అనుకుంటున్నాను' అని జీఐపీసీ ఇంటర్నేషనల్ వైస్ ప్రెసిడెంట్ పాట్రిక్ కిల్‌బ్రైడ్ ఒక వార్తాసంస్థ ప్రతినిధితో మాట్లాడుతూ అన్నారు. దేశీయ పారిశ్రామికవేత్తలు మేధాసంపత్తి హక్కులను తమకు అనుకూలంగా మార్చుకోవడానికి వివిధ దేశాలు చేస్తున్న కృషిని పరిశీలించేందుకు వ్యవస్థీకృత సామర్థ్యంపై ఈ సంవత్సరం ఒక కొత్త కేటగిరి ప్రవేశపెట్టినట్టు ఆయన చెప్పారు. ఈ కొత్త అంశంలో భారత్ మెరుగైన పనితీరును కనబరుస్తుందనే అంచనాతో ఉన్నట్టు ఆయన పేర్కొన్నారు.



భారత్ ఐపీఆర్ విధానం గురించి మాట్లాడుతూ, పేటెంట్ తారమారయ్యే లేదా పేటెంట్‌పై అనిశ్చితి నెలకొనేలా చట్టాలు లేదా వ్యవస్థ ఉంటే హైరిస్క్, అధిక వ్యయంతో కూడిన పరిశోధన, అభివృద్ధి (ఆర్అండ్‌డీ)లోకి దీర్ఘకాలంలో పెట్టుబడులు పెట్టడం ఇండస్ట్రీకి కష్టమవుతుందని కిల్‌బ్రైడ్ అన్నారు. భారత్‌కు తన సాంకేతిక పరిజ్ఞాన రంగం, విజ్ఞానవంతమైన ఆర్థిక వ్యవస్థలో ఉన్న బలమైన అంశాలను సానుకూలంగా మలచుకునే సామర్థ్యం ఉందని ఆయన అన్నారు.

- 72 పాయింట్లు తగ్గిన సెన్సెక్స్
- 41 పాయింట్లు పడిపోయిన నిఫ్టీ
- గరిష్ఠ స్థాయిల వద్ద లాభాల స్వీకరణ
- నిరుత్సాహపరిచిన భారీ వాణిజ్య లోటు

వరుసగా మూడు సెషన్లు లాభాలు ఆర్జించిన నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్‌ఎస్‌ఈ) నిఫ్టీ కూడా మంగళవారం పతనమయింది. అయితే ఈ సూచీ కీలకమయిన 10,700 మార్కుపైన ముగియగలిగింది. క్రితం ముగింపుతో పోలిస్తే 41 పాయింట్లు (0.38 శాతం) పడిపోయిన నిఫ్టీ 10,700.45 పాయింట్ల వద్ద స్థిరపడింది.

ముంబయి, జనవరి 16: వరుసగా మూడు సెషన్లు గరిష్ఠ స్థాయి రికార్డులు సృష్టించిన దేశీయ స్టాక్ మార్కెట్ కీలక సూచీలు మంగళవారం మదుపరులు లాభాల స్వీకరణకు పూనుకోవడంతో పాటు స్థూలార్థిక గణాంకాలు బలహీనంగా ఉండటంతో పడిపోయాయి. సోమవారం మార్కెట్ పనివేళలు ముగిసిన తరువాత విడుదలయిన స్థూలార్థిక గణాంకాలు భారీగా పెరిగిన దేశ వాణిజ్య లోటును వెల్లడించాయి. దేశ దిగుమతులు, ఎగుమతుల మధ్య వ్యత్యాసం డిసెంబర్ నెలలో 14.88 బిలియన్ డాలర్లకు పెరిగింది. 2016 డిసెంబర్ నెలతో పోలిస్తే దేశ వాణిజ్య లోటు 41 శాతం పెరిగింది. ముడి చమురు, బంగారం దిగుమతుల వ్యయం పెరగడమే వాణిజ్య లోటు పెరగడానికి ప్రధాన కారణమయింది. బొంబాయి స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్‌ఈ) సెన్సెక్స్ మంగళవారం ఉదయం 34,877.71 పాయింట్ల అధిక స్థాయి వద్ద ప్రారంభమయింది. కార్పొరేట్ కంపెనీల మూడో త్రైమాసిక ఫలితాలు ప్రోత్సాహకరంగా ఉండటంతో ఉదయం సెషన్‌లో మదుపరులు ఎడతెరిపి లేకుండా కొనుగోళ్లకు పూనుకోవడం వల్ల సెన్సెక్స్ పైకి ఎగబాకుతూ ఇంట్రా-డేలో 34,936.03 పాయింట్ల గరిష్ఠ స్థాయిని తాకింది. అయితే రికార్డు స్థాయిల వద్ద మదుపరులు లాభాల స్వీకరణకు పూనుకోవడం వల్ల ఇంట్రా-డే లో 34,735.55 పాయింట్ల కనిష్ఠ స్థాయికి పడిపోయింది. చివరలో కొంచెం పుంజుకొని క్రితం ముగింపుతో పోలిస్తే 72.46 పాయింట్లు (0.21 శాతం) నష్టపోయి, 34,771.05 పాయింట్ల వద్ద ముగిసింది. సెన్సెక్స్ క్రితం మూడు సెషన్లలో కలిపి 410.44 పాయింట్లు పెరిగి, సరికొత్త జీవనకాల గరిష్ఠ స్థాయి 34,843.51 పాయింట్ల వద్ద సోమవారం ముగిసింది.

వరుసగా మూడు సెషన్లు లాభాలు ఆర్జించిన నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్‌ఎస్‌ఈ) నిఫ్టీ కూడా మంగళవారం పతనమయింది. అయితే ఈ సూచీ కీలకమయిన 10,700 మార్కుపైన ముగియగలిగింది. క్రితం ముగింపుతో పోలిస్తే 41 పాయింట్లు (0.38 శాతం) పడిపోయిన నిఫ్టీ 10,700.45 పాయింట్ల వద్ద స్థిరపడింది. రియల్టీ, మెటల్, ప్రభుత్వ రంగ బ్యాంకులు, ఇంధన, ఇన్‌ఫ్రా, ఎఫ్‌ఎంసీజీ, ఆటో రంగాల షేర్లలో మదుపరులు అమ్మకాలకు పూనుకోవడంతో ఈ సూచీ పడిపోయింది. అయితే ఇన్ఫర్మేషన్ టెక్నాలజి (ఐటీ) రంగ షేర్ల ధరలు పెరగడం మంగళవారం నిఫ్టీ పతనాన్ని కొంత వరకు అడ్డుకోగలిగింది.

నిఫ్టీ మంగళవారం 10,761.50 పాయింట్ల అధిక స్థాయి వద్ద ప్రారంభమయి, 10,762.35 పాయింట్ల గరిష్ఠ స్థాయి, 10,687.85 పాయింట్ల కనిష్ఠ స్థాయి మధ్య కదలాడింది.

విదేశీ మార్కెట్ల విషయానికొస్తే, కార్పొరేట్ కంపెనీల ఫలితాల కోసం మదుపరులు వేచిచూస్తుండటం వల్ల అనేక యూరోపియన్ స్టాక్ మార్కెట్లలో కీలక సూచీలు గరిష్ఠ స్థాయిల వద్ద ముగిశాయి. ఆరంభంలో నష్టపోయిన ఆసియన్ స్టాక్ మార్కెట్ సూచీలు తరువాత పుంజుకున్నాయి. రంగాల వారీగా చూస్తే, ఐటీ మాత్రమే లాభపడింది. ఐటీ సూచీ 3.65 శాతం పెరిగింది. స్థిరాస్తి రంగం 3.38 శాతం పడిపోయింది. తరువాత స్థానాల్లో ప్రభుత్వ రంగ బ్యాంకులు 2.81 శాతం, మెటల్ 2.84 శాతం, ఎనర్జీ 2.12 శాతం, ఆటో 1.25 శాతం, ఎఫ్‌ఎంసీజీ 1.09 శాతం, ఇన్‌ఫ్రా 1.06 శాతం, మీడియా 0.68 శాతం, ఫైనాన్స్ సర్వీస్ 0.45 శాతం చొప్పున నష్టపోయాయి. మంగళవారం సెషన్‌లో ప్రధానంగా లాభపడిన కంపెనీలలో విప్రో, హెచ్‌సీఎల్ టెక్నాలజి, టీసీఎస్, ఇన్ఫోసిస్, టెక్ మహీంద్రా, జీ, డాక్టర్ రెడ్డీస్, ఐసీఐసీఐ బ్యాంక్, హెచ్‌యూఎల్, అదాని పోర్ట్స్ ఉన్నాయి. నష్టపోయిన వాటిలో కోల్ ఇండియా, హెచ్‌పీసీఎల్, బజాజ్ ఫైనాన్స్, రిల్, వేదాంత, అరబిందో ఫార్మా, టాటా స్టీల్, ఇండియాబుల్స్ హౌసింగ్ ఫైనాన్స్ ఉన్నాయి. ఎన్‌ఎస్‌ఈలో 340 కంపెనీల షేర్ల ధరలు పెరగగా, 1,491 కంపెనీల షేర్ల ధరలు పడిపోయాయి. 40 కంపెనీల షేర్ల ధరల్లో ఎలాంటి మార్పు లేదు.



TOP GAINERS	%	TOP LOSERS	%
Wipro	4.88	Coal India	-4.57
Infosys	3.93	Reliance	-2.54
TCS	3.77	Tata Motors	-2.30
ICICI Bank	1.43	Tata Steel	-2.16
Dr Reddys	1.38	ITC	-2.06

PTI GRAPHICS



TOP GAINERS	%	TOP LOSERS	%
Wipro	5.38	Coal India	-4.67
HCL Tech	4.40	Tata Power	-4.39
Infosys	3.86	HPCL	-3.67
TCS	3.81	Bajaj Finance	2.92
Tech Mahi	2.56	Reliance	-2.76



విజేతలకు సర్టిఫికెట్లు అందిస్తున్న స్టీల్ ప్లాంట్ సీఎండీ మధుసూదన్

నాణ్యమైన ఉక్కు తయారీకి పెద్ద పీట

స్టీల్ ప్లాంట్ సీఎండీ మధుసూదన్

ఆంధ్రభూమి బ్యూరో

విశాఖపట్నం, జనవరి 16: నాణ్యమైన ఉక్కు ఉత్పత్తికి విశాఖ స్టీల్ ప్లాంట్ పెద్ద పీట వేస్తోందని, ఈ నేపథ్యంలో కార్మికులంతా ఉక్కు ఉత్పత్తి విషయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని విశాఖ స్టీల్ ప్లాంట్ సీఎండీ మధుసూదన్ అన్నారు. స్టీల్ ప్లాంట్‌లో ప్రతి సంవత్సరం మాదిరి ఈ ఏడాది కూడా అత్యుత్తమ వ్యాపార పటిమను కనబరచిన శాఖలకు గుర్తింపుగా చైర్మన్స్ ట్రోఫీ ఫర్ ఎక్సలెన్స్ అవార్డును ప్రకటించారు. ఈ సంవత్సరం ఈ పోటీల్లో విజేతలుగా నిలిచిన శాఖాధిపతులకు సీఎండీ మధుసూదన్, డైరక్టర్లు మంగళవారం సర్టిఫికెట్లను అందచేశారు. ఈ సందర్భంగా మధుసూదన్ మాట్లాడతూ స్టీల్ ప్లాంట్ కొత్త ఉత్పత్తులైన బొరోన్, సిహెచ్‌క్యూ స్టీల్‌కు మార్కెట్‌లో మంచి డిమాండ్ వచ్చిందని అన్నారు. అలాగే, విశాఖ స్టీల్ ప్లాంట్ కొత్త సాంకేతిక పరిజ్ఞానంతో పునరుత్పత్తుల్లో విజయం సాధించిందని అన్నారు. ఈ కార్యక్రమంలో డైరక్టర్లు పీసీ మహాపాత్ర, పీ రాయ్‌చతుర్థి, కేసీ దాస్, వీవీ వేణుగోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

రసాయనిక గుజ్జు దిగుమతులపై 10 శాతం కస్టమ్స్ సుంకం విధించాలి

కేంద్రాన్ని కోరిన అసోచామ్

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 16: విదేశాల నుంచి దిగుమతి చేసుకునే హార్డ్‌వుడ్ కెమికల్ పల్ప్ (రసాయనిక గుజ్జు)పై పదిశాతం కస్టమ్స్ సుంకం విధించాలని, దీని వల్ల దేశయ పరిశ్రమలు నిలదొక్కుకుంటాయని, వచ్చే బడ్జెట్‌లో తమ వినతిని పరిగణనలోకి తీసుకోవాలని అసోచామ్ అనే వాణిజ్య సంస్థ కేంద్రాన్ని కోరింది.కెమి థర్మో మెకానికల్ పల్ప్‌పై కూడా సుంకం విధించాలని అసోచామ్ సెక్రటరీ జనరల్ డిఎస్ రావత్ కోరారు. దేశంలో గ్రామీణ ప్రాంతాల్లో పెద్ద ఎత్తున కలపను ఇచ్చే మొక్కలను పెంచాలని కోరారు. దీని వల్ల ఉద్యోగావకాశాలు పెరుగుతాయని, పైగా దేశీయంగా గుజ్జు తయారీకి మొక్కల పెంపకం ఉపకరిస్తుందన్నారు. దేశంలో పేపర్ పరిశ్రమ టెక్నాలజీ అప్‌గ్రేడ్ చేసేందుకు అవసరమైన క్యాపిటల్ గూడ్స్ దిగుమతి చేసుకోవాలన్నారు. దీని వల్ల పర్యావరణ పరిరక్షణ వీలవుతుందన్నారు. మన దేశంలోకి సాలీనా రూ.4600 కోట్ల విలువైన 1.25 మిలియన మెట్రిక్ టన్నుల కాగితం గుజ్జును దిగుమతి చేసుకుంటున్నామన్నారు. 2012 మే నెలలో ఈ గుజ్జు దిగుమతిపై కస్టమ్స్ సుంకాన్ని తొలగించిందన్నారు. దీని వల్ల కస్టమ్స్ శాఖకు రూ.245 కోట్ల ఆదాయం తగ్గిందన్నారు. కాగా రైతుల ద్వారా సాలీనా 31.8 మిలియన్ పనిదినాలు కల్పించి 157 మిలియన్ల కలప చెట్లను పెంచాలన్నారు. కాగితం పరిశ్రమకు అవసరమైన గుజ్జు దేశీయంగా తయారు చేసేందుకు వీలవుతుందన్నారు. సాఫ్ట్‌వుడ్ గుజ్జుపై కూడా కస్టమ్స్ సుంకాన్ని మినిహాయించాలన్నారు.

ఐటి సాఫ్ట్‌వేర్ కన్సల్టింగ్ సంస్థ బోద్ ట్రీ మగధ యూనివర్సిటీ నుంచి రూ.43 కోట్లు, ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ ఫారెస్ట్రీ రీసెర్చి ఎడ్యుకేషన్ సంస్థ నుంచి రూ.8.39కోట్ల ఆర్డర్‌ను సాధించినట్లు బోద్ ట్రీ సంస్థ ఎండి ఎల్ఎన్ రామకృష్ణ తెలిపారు. డిజిటల్ యూనివర్శిటీగా తీర్చిదిద్దేందుకు తాము అవసరమైనసేవలు అందిస్తామన్నారు. అడ్మిషన్లు, పరీక్షలు, ధృవపత్రాలు, ఇతర విభాగాలను డిజిటలైజేషన్ చేస్తతమన్నారు. అలాగే బెంగళూరుకు చెందిన శాప్ సొల్యూషన్స్ కంపెనీ గాప్ బ్రిడ్జితో కూడా ఒప్పందం కుదుర్చుకున్నట్లు ఆయన చెప్పారు. గత 18 నెలల్లో రూ.200 కోట్ల విలువ చేసే కాంట్రాక్టును సాధించినట్లు ఆయన చెప్పారు.

సిగరెట్ల స్మగ్లింగ్ అరికట్టాలి: కేంద్రాన్ని కోరిన ఫైఫా

పొగాకుపంటపై ఆధారపడిన లక్షలాది మంది రైతుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని విదేశీ సిగరెట్ల స్మగ్లింగ్‌ను అరికట్టాలని అఖిల భారత రైతు సంఘాల సమాఖ్య (ఫైఫా) కేంద్రాన్ని కోరింది. ఫైఫా సమాఖ్య ప్రధాన కార్యదర్శి మురళి బాబు మాట్లాడుతూ ఆంధ్రా, తెలంగాణ, కర్నాటక, గుజరాత్‌లో పొగాకు రైతులు ఉన్నారన్నారు. సిగరెట్ల పరిశ్రమలో స్మగ్లింగ్ సిగరెట్ల వాటా 25 శాతం ఉందన్నారు. దీని వల్ల కేంద్రానికి సాలీనా రూ.13వేల కోట్ల నష్టం వాటిల్లుతోందన్నారు.వ్యవస్థీకృత నేరగాళ్లు సిగరెట్ల స్మగ్లింగ్‌కు పాల్పడుతున్నారన్నారు. పొగాకు రైతులపై ఆంక్షలు విధించి వేధించడం మానుకోవాలన్నారు. దేశీయంగా వర్జీనియా పొగాకు రైతుల ఆదాయం రూ.3300 కోట్ల మేర తగ్గిందన్నారు. మనదేశంలోనే పొగాకుపై ఆధారపడి జీవించేరైతులు ఎక్కువన్నారు.

పరిశ్రమలవైపు సేద్యం పట్టభద్రులు

- ప్రోత్సహిస్తున్న వ్యవసాయ విశ్వవిద్యాలయం
- ఢిల్లీ సంస్థతో జరిగిన చర్చలు

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 16: వ్యవసాయ పట్టభద్రులు వ్యవసాయ ఆధారిత పరిశ్రమల ఏర్పాటులో ఆసక్తి కలిగించేందుకు వీలుగా అగ్రి ఇంకుబేషన్ సెంటర్ ఏర్పాటు చేసేందుకు తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం కసరత్తు చేస్తోంది. విద్యార్థుల్లో వ్యవసాయ ఆధారిత పరిశ్రమలపై ఆసక్తి కలిగించేందుకు హైదరాబాద్‌లోని వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆవరణలో మంగళవారం ఉన్నతస్థాయి సమావేశం జరిగింది. న్యూఢిల్లీకి చెందిన ఇండిగ్రాం ల్యాబ్స్ ఫౌండేషన్, ఇండియన్ సొసైటీ ఆఫ్ అగ్రిబిజినెస్ ప్రొఫెషనల్స్ సంస్థ ప్రతినిధులతో విశ్వవిద్యాలయం వైస్-ఛాన్సలర్ డాక్టర్ ప్రవీణ్‌రావు తన కార్యాలయంలో మంగళవారం చర్చలు జరిపారు. వ్యవసాయ పట్టభద్రుల్లో పరిశ్రమల ఏర్పాటుకు ఆసక్తి రేకెత్తించేందుకు ప్రయత్నించాలని నిర్ణయించారు. ఇందు కోసం వ్యవసాయ విశ్వవిద్యాలయంలో అగ్రి ఎంటర్‌ప్రూనర్‌షిప్ సెల్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ బాధ్యతను అంతర్జాతీయ వ్యవహారాల డైరెక్టర్ డాక్టర్ జీవన్‌రావుకు వైస్-ఛాన్సలర్ అప్పగించారు. ఈ చర్చల్లో యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఎస్. సుధీర్‌కుమార్‌తో పాటు యూనివర్సిటీ ఉన్నతాధికారుల డాక్టర్ టి. ప్రదీప్, డాక్టర్ డి. రాజిరెడ్డి, డాక్టర్ కె.ఎస్. డాంగి, డాక్టర్ సదాశివరావు, డాక్టర్ కెవిఎస్ మీనాకుమారి, డాక్టర్ లక్ష్మణ్, డాక్టర్ కె. జీవన్‌రావు, గోపాల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రైల్వే స్టేషన్లు, రైళ్లలో.. నాణ్యమైన ఆహారం సరఫరా చేయాలి

లేదంటే కఠిన చర్యలు ● దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ వినోద్ కుమార్ యాదవ్

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 16: దక్షిణ మధ్య రైల్వేస్టేషన్లు, ప్లాట్‌ఫారాలు, రైళ్లలో ఆహార నాణ్యత విషయంలో రాజీలేదని, ఈ విషయంలో అశ్రద్ధ, నిర్లక్ష్యం చేస్తే సంబంధిత ఏజన్సీలపై చర్యలు తీసుకుంటామని, అధికారులు కూడా అప్రమత్తంగా ఉండి పర్యవేక్షించాలని జనరల్ మేనేజర్ వినోద్‌కుమార్ యాదవ్ అన్నారు. మంగళవారం ఇక్కడ ఆయన కేటరింగ్ ఏజన్సీలు, స్టాల్స్, రైళ్లలో సరఫరా చేసే ఆహార విధానాలను సమీక్షించారు. ఇంజనీరింగ్, ఆపరేటింగ్ శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. రైల్వే భద్రతకు సంబంధించి, వివిధ పెండింగ్ ప్రాజెక్టుల నిర్మాణాలపై ఎప్పటికప్పుడు నివేదికలు ఇవ్వాలని కోరారు. ట్రాక్ మెయింటెనెన్స్ పనులను సమీక్షించారు. ఈ కార్యక్రమంలో అదనపు జనరల్ మేనేజర్ జాన్ థామస్, చీఫ్ సేఫ్టీ ఆఫీసర్ డికె సింగ్, ప్రిన్సి చీఫ్ ఆపరేషన్స్ మేనేజర్ ఎన్ మదు సూధన రావు తదితరులు పాల్గొన్నారు.

ఐటీ సిరి.. మంగళగిరి!

- ★ నేడు 16 ఐటీ కంపెనీల ప్రారంభోత్సవం
- ★ అమెరికా, బ్రిటన్ కంపెనీలే ఎక్కువ
- ★ తక్షణం 600 మందికి ఉద్యోగాలు
- ★ మరో 20 కంపెనీలు సిద్ధం
- ★ ఐటీ మంత్రిగా లోకేష్ సక్సెస్

ఆంధ్రభూమి ప్రత్యేక ప్రతినిధి

అమరావతి, జనవరి 16: గుంటూరు జిల్లాలోని మంగళగిరి ఇక ఐటీ సిరి కానుంది. ఇప్పటివరకూ రాజధాని నగరంలో సరైన ఐటీ కంపెనీలు లేవన్న నిరాశకు ఇక తెరపడనుంది. ప్రస్తుతం గొల్లపూడి, గన్నవరం, విజయవాడ పటమట ఆటోనగర్‌కు చిన్నచిన్న ఐటీ కంపెనీలే తరలివచ్చాయి. దానివల్ల భారీ సంఖ్యలో ఉద్యోగావకాశాలు రాకపోయినా వందల మందికయినా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు దక్కాయి. అయితే రాజధానిలో భారీ స్థాయిలో, ఒకేచోట ఐటీ కంపెనీలు లేవన్న బెంగ మాత్రం బుధవారంతో తీరనుంది. విజయవాడకు అనుసంధానంగా ఉన్న మంగళగిరి ఏపీ ఎన్ఆర్‌టీ టెక్ పార్కులో 13 కంపెనీలు, అక్కడే ఉన్న పైకేర్ ఐటీ పార్కులో మరో 3 కంపెనీలను ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ బుధవారం ప్రారంభించనున్నారు. వీటిలో రెండు మినహా మిగిలినవన్నీ బ్రిటన్, అమెరికాకు చెందిన కంపెనీలే కావడం విశేషం. విమర్శల నడుమ రాష్ట్ర కేబినెట్‌లో చేరిన లోకేష్ ఐటీ శాఖ మంత్రిగా సక్సెస్ అయ్యారు. రాష్ట్రానికి కొత్త ఐటీ కంపెనీలను తీసుకొచ్చి తన పనితీరుతో విమర్శల నోళ్లు మూయించారు. వందరోజుల వరకూ తాను మీడియాతో మాట్లాడనని, రాష్ట్రానికి కొన్ని ఐటీ కంపెనీలను తీసుకొచ్చిన తర్వాతనే మీడియా ముందుకు వస్తానని పదవీ బాధ్యతలు స్వీకరించిన తొలిరోజు ఇచ్చిన మాటను లోకేష్ నెరవేర్చుకున్నారు. తన విదేశీ పర్యటనల్లో కుదుర్చుకున్న ఒప్పందాలను కార్యాచరణలోకి తీసుకొచ్చేందుకు ప్రత్యేక యంత్రాంగాన్ని సమకూర్చుకుని, దాన్ని ఏపీ ఎన్ఆర్‌టీ సంస్థతో సమన్వయపర్చినన ఫలితంగా సంక్రాంతి రోజు తిరుపతిలో, అంతకుముందు విశాఖ, అప్పుడే విజయవాడలో కొన్ని ఐటీ కంపెనీలను రప్పించిన లోకేష్.. ఇప్పుడు విజయవాడకు ఆనుకుని ఉన్న మంగళగిరిలో ఒకే రోజు 16 ఐటీ కంపెనీలను ప్రారంభించనున్నారు. బుధవారం లోకేష్ చేతులమీదుగా ప్రారంభం కానున్న 16 ఐటీ కంపెనీల వల్ల తక్షణం 600 మంది ఐటీ నిపుణులకు ఉద్యోగాలు లభించనున్నాయి. అవి పూర్తిస్థాయిలో పని మొదలుపెట్టిన తర్వాత ఆ సంఖ్య 1800లకు పెరగనుంది. కాగా మరికొద్ది రోజుల్లో ఇక్కడే మరో 20 కంపెనీలు రానున్నాయి. సిగ్నం డిజిటల్ నెట్‌వర్క్, స్క్రిప్ట్ బీస్, స్వరా సాఫ్ట్, సన్‌స్పోట్‌పిక్సీ, సువిజ్, డీఎఫ్ఐ స్విస్, ఎక్సెల్లార్, మెక్‌మైక్లినిక్, బీవీజీ ఇండియా కంపెనీలు ప్రారంభం కానుండగా, ఇందులో మూడు స్టార్టప్ కంపెనీలున్నాయి. వీటిలో మెక్‌మైక్లినిక్, ఎక్సెల్లార్, బీవీజీ కంపెనీలు పైకేర్ ఐటీ పార్కులో ఏర్పాటవుతున్నాయి.




రివర్స్‌బుల్ టర్బైన్స్‌తో విద్యుత్ ఉత్పత్తి!

- సాగర్ పవర్ హౌస్‌లో ట్రయల్ రన్!
- తొలిసారిగా జెన్‌కో ప్రయత్నం

ఆంధ్రభూమి బ్యూరో


నల్లగొండ, జనవరి 16: నాగార్జున సాగర్ ప్రాజెక్టు పవర్ హౌస్ ద్వారా కృష్ణా డెల్టాకు విడుదలైన నీటిని తిరిగి విద్యుత్ ఉత్పత్తికి వినియోగించుకునేలా తొలిసారిగా పవర్ హౌస్ రివర్సబుల్ టర్బైన్స్‌ను నడిపించే ప్రయత్నాన్ని జెనోకో ఆరంభించింది. సాగర్ ప్రాజెక్టు దిగువన సాగర్ టెయిల్ పాండ్ నిర్మాణంతో టెయిల్ పాండ్ రిజర్వాయర్ మాదిరిగా మారి టెయిల్ పాండ్ ద్వారా పవర్‌హౌస్‌కు అందుబాటులోకి వచ్చిన బ్యాక్ వాటర్‌ను సద్వినియోగం చేసుకునేందుకు తొలిసారిగా రివర్స్‌బుల్ టర్బన్స్ నడిపించాలని జెన్‌కో తలపెట్టింది. రివర్స్‌బుల్ టర్బైన్స్ నిర్వహణ ప్రక్రియను పరిశీలించి ఈ పద్ధతిలో విద్యుత్ ఉత్పత్తి కొనసాగించాలా? వద్దా? అన్న అంశం పరిశీలించేందుకు నేడు జెన్‌కో సీఎండి ప్రభాకర్‌రావు సాగర్ పవర్‌హౌస్‌ను సందర్శించనున్నట్లు జెన్‌కో అధికారులు తెలిపారు. సీఎండీ పరిశీలించాకే రివర్స్‌బుల్ టర్బైన్స్ నడిపించడంపై తదుపరి నిర్ణయం ఉంటుందని వారు తెలిపారు. సాధారణ జల విద్యుత్ ఉత్పత్తి వ్యయంతో పోల్చితే రివర్స్‌బుల్ టర్బైన్స్ జల విద్యుత్ ఉత్పత్తి ప్రక్రియకు ఖర్చు అధికంగా ఉంటుందని జెన్‌కో అధికారులు చెబుతున్నారు. రివర్స్‌బుల్ టర్బైన్స్ ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేయాలని జెన్‌కో తలపిస్తే.. పవర్ హౌస్ చరిత్రలో ఇదే తొలిసారి అవుతుంది.



సాగర్ టెయిల్ పాండ్ ప్రాజెక్టు బ్యాక్ వాటర్

పోయి నీటి నిల్వ పెరిగి బ్యాక్‌వాటర్ కాస్తా సాగర్ ప్రాజెక్టు పవర్ హౌస్‌ను తాకుతుంది.

ఈ నీటితో రివర్స్‌బుల్ టర్బైన్స్‌ను నడిపించి విద్యుత్ ఉత్పత్తి చేయాలని జెన్‌కో యంత్రాంగం ప్రయత్నిస్తు ట్రయల్ రన్ నిర్వహిస్తుంది. పవర్ హౌస్‌లో ఎనిమిది యూనిట్ల ద్వారా 815 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి లక్ష్యంగా ఉంది. పవర్‌హౌస్ నిర్మాణ సమయంలో 1972లో ఒక యూనిట్ బీహెచ్ఈఎల్ సాంకేతిక పరిజ్ఞానంతో ఏర్పాటుచేయగా దీనికి రివర్స్‌బుల్ టర్బైన్స్‌ను పద్ధతి లేదు. అప్పట్లో జపాన్ నుండి తెప్పించి అమర్చిన మిగతా ఏడు యూనిట్లలో సైతం రివర్స్‌బుల్ టర్బైన్స్ సిస్టమ్స్ ఉన్నాయి. వీటిని ఇప్పటిదాకా ఎప్పుడు వినియోగించనప్పటికి సాగర్



సాగర్ టెయిల్ పాండ్ ప్రాజెక్టు బ్యాక్ వాటర్ సాగర్ ప్రాజెక్టు పవర్‌హౌస్‌ను తాకిన దృశ్యం



అనంతపురం పోలీసులు అరెస్టు చేసిన మట్కాబీటర్లు

మట్కాపై అనంత పోలీసుల ఉక్కుపాదం

ముంబయి, హుబ్లీ కంపెనీల నెట్‌వర్క్‌ల గుట్టురట్టు

ఆంధ్రభూమి బ్యూరో

అనంతపురం, జనవరి 16: ఫోన్లు, ఇతర మాధ్యమాల ద్వారా అమాయకులకు వలవేసి మట్కాజూదం ఆడిస్తున్న నిర్వాహకులు, బీటర్లపై అనంతపురం జిల్లా పోలీసులు ఉక్కుపాదం మోపారు. ముంబాయి, హుబ్లీ కంపెనీల నెట్‌వర్క్‌ల ద్వారా హవాలా తరహాలో నిర్వహిస్తున్న మట్కా గుట్టును రట్టు చేశారు. మంగళవారం నిందితులను జిల్లా ఎస్పీ జీవీజీ.అశోక్‌కుమార్ మీడియా ఎదుట హాజరు పర్చి వివరాలు వెల్లడించారు. మంగళవారం నగరంలో వివిధ ప్రాంతాల్లో నలుగురు నిర్వాహకులతో పాటు 11 మంది బీటర్స్‌ను అరెస్టు చేసి వారి నుంచి రూ.30 లక్షల నగదు, 15 సెల్‌ఫోన్లు, కంప్యూటర్, ల్యాప్‌టాప్, ప్రింటర్, మట్కాచీటీలు, మోటార్ సైకిళ్లు స్వాధీనం చేసుకున్నారు. కర్ణాటకలోని హుబ్లీ, మహారాష్ట్రలోని ముంబాయికి హవాలా పద్ధతిలో మట్కా నిర్వాహకులు డబ్బులు అందజేస్తూ లబ్ధిపొందేవారని విచారణలో తేలింది. నిందితుల్ని అరెస్టు చేసిన పోలీసు బృందాన్ని ఎస్పీ జీవీజీ.అశోక్‌కుమార్ ప్రశంసించారు.

పెళ్లికి నిరాకరించిన యువతి

ఆసుపత్రి ఎదుట యువకుడి ఆత్మహత్య

సోంపేట, జనవరి 16: శ్రీకాకుళం జిల్లా సోంపేట సామాజిక ఆసుపత్రి ఎదుట మంగళవారం ఒక యువకుడు ఆత్మహత్య చేసుకోవడం కలకలం సృష్టించింది. పోలీసుల కథనం మేరకు హైదరాబాద్‌కు చెందిన పి.శ్రీకర్ (30) అనే యువకుడు సోంపేట దగ్గుచెరువువీధికి చెందిన యువతిని గత 10 నెలలుగా ప్రేమిస్తున్నాడు. గత రెండు నెలలుగా పెళ్లి విషయమై ఈ ఇద్దరి మధ్య వివాదం నెలకొన్న నేపథ్యంలో వైజాగ్‌లో ఉంటున్న ప్రేమికురాలు సంక్రాంతి కోసం సోంపేట వచ్చింది. ఈ విషయం తెలుసుకున్న శ్రీకర్ సోంపేటకు వచ్చి తనను పెళ్లి చేసుకోమని కోరాడని, అయితే ఆ యువతి నిరాకరించగా, బ్లేడుతో శరీరంపై గాయపరుచుకున్నాడు. తీవ్ర గాయాలపాలైన యువకుడిని స్థానికులు సోంపేట సామాజిక ఆసుపత్రికి తీసుకెళ్లగా తాను ప్రేమించిన యువతి పెళ్లికి నిరాకరిస్తోందని, తాను బతకడం వృథా అంటూ వెంట తెచ్చుకున్న కిరోసిన్ పోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. తీవ్ర గాయాలపాలైన ఈ యువకుడిని ఒడిశాలోని బరంపురం ఆసుపత్రికి పోలీసులు తరలించారు.

గోదావరిలో మునిగి ఇద్దరు యువకుల మృతి

ఐ పోలవరం, జనవరి 16: సంక్రాంతి పండగకు సరదాగా గడుపుతూ అమ్మమ్మ ఇంటికి వచ్చి తూర్పుగోదావరి జిల్లా ఐ పోలవరం మండలం పశువుల్లంక - సలాదివారిపాలెం గోదావరిలో సోమవారం సాయంత్రం స్నానానికి దిగిన ముగ్గురు యువకులు ప్రవాహ వేగానికి కొట్టుకుపోయి ఇద్దరు మృతి చెందగా, ఒక యువకుడిని స్థానిక మత్స్యకారులు కాపాడారు. దీనికి సంబంధించి ఐ పోలవరం పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సోమవారం సాయంత్రం సలాదివారిపాలెం వైపు గోదావరి పాయలో స్నానానికి దిగారు. అయితే ప్రవాహం వేగానికి వారు కొట్టుకు పోతుండగా స్థానికంగా ఉన్న మత్స్యకారులు వారిని కాపాడేందుకు చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయి. ఈ ప్రమాదంలో టి కొత్తపల్లికి చెందిన రేవు కల్యాణ్ (20), విశాఖపట్నానికి చెందిన పోతుల శ్యాం (14) మృతి చెందగా పోతుల అనిల్‌ను స్థానిక మత్స్యకారులు కాపాడారు. మంగళవారం ఉదయం శ్యామ్, కల్యాణ్‌ల మృతదేహాలు గోదావరిలో లభ్యమయ్యాయి. మృతదేహాలకు పశువుల్లంక గోదావరి ఒడ్డునే ముమ్మిడివరం ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులచే పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ ఘటనపై ఐ పోలవరం ఎస్సై టి క్రాంతికుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నాగావళిలో కుటుంబం గల్లంతు!

పార్వతీపురం (రూరల్), జనవరి 16: పార్వతీపురం తూర్పు వీధిలో విషాదం చోటు చేసుకుంది. ఆ వీధికి చెందిన ఓ కుటుంబం రాయగడలోని మజ్జి గౌరమ్మ పూజ కోసం వెళ్లి సమీపంలోని నాగావళి నదిలో దిగిన కుటుంబంలోని నలుగురు గల్లంతు కాగా, అందులో ఒకరు మృతి చెందారు. మరొకరు గల్లంతయ్యారు.మరొకరి పరిస్థితి విషమంగా ఉండగా, స్థానికులు ఒకర్ని కాపాడారు. దీనికి సంబంధించి స్థానికులు అందించిన వివరాల ప్రకారం పార్వతీపురం పట్టణంలోని రాయగడ రోడ్డులోని తూరుపువీధికి చెందిన జమిరెడ్డి దుర్గాప్రసాద్, అతని భార్య శాంతి (27), ఏడేళ్ల కుమారు ఇందు, ఏడేళ్ల కొడుకు అఖిల్‌ను తీసుకొని సమీపంలోని ఒడిశాలోని రాయగడ అత్తారింటికి పండగ సందర్భంగా వెళ్లారు. మజ్జి గౌరమ్మ దర్శనం చేసుకొని, గుడికి సమీపంలో ఉన్న నాగావళి నదిలో దిగారు. స్థానికులు ఇద్దర్ని కాపాడగా, దుర్గాప్రసాద్ భార్య శాంతి(27) మృతి చెందింది. కుమారుడు అఖిల్ గల్లంతయ్యాడు.

అద్దె వాహనాలదే జోరు!

నిబంధనలకు తిలోదకాలు.. బినామీలదే పైచెయ్యి

ఆంధ్రభూమి బ్యూరో

విజయవాడ, జనవరి 16: ప్రజల అవసరాలు తక్షణం తీర్చేందుకు అధికారులు అందరికీ అందుబాటులో ఉండాలన్న సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం మండల, డివిజన్, జిల్లాస్థాయి అధికారులందరికీ వాహన సౌకర్యం కల్పిస్తుంది. అయితే కాలక్రమేణా ఆ విధానం అడ్డదారులు తొక్కుతోంది. ప్రజాధనం సాలీనా దాదాపు వంద కోట్ల రూపాయలకు పైగానే దుబారా అవుతోంది. రాష్ట్ర విభజన తరువాత ప్రభుత్వ ఆర్థిక పరిస్థితి సంక్లిష్టంగా ఉన్నప్పటికీ ఈ వాహనాల వినియోగంపై మాత్రం కనీస దృష్టి సారిస్తున్న దాఖలాలు కనిపించడం లేదు. ప్రస్తుతం రాష్ట్రంలో జిల్లాకు కనీసం 200 చొప్పున మొత్తం 2600 అద్దె కార్లు పూర్తిగా రోడ్డుపై కన్పించకపోయినా రికార్డుల్లో సాక్షాత్కరిస్తున్నాయి. ఆర్థిక శాఖ నుంచి అనుమతి లేకపోయినా వివిధ శాఖల్లో అధికారులు అద్దె కార్ల పేరిట అన్నివిధాలుగా ఎంజాయ్ చేస్తున్నారనే విమర్శలు రేగుతున్నాయి. అద్దె వాహనాల వినియోగం కోసం ప్రస్తుతం మండల స్థాయిలో రూ. 35వేలు, జిల్లాస్థాయిలో రూ. 45వేలు, రాష్ట్రస్థాయిలో రూ. 65వేలు చొప్పున ప్రభుత్వం ఖర్చు చేస్తోంది. వాస్తవానికి అద్దె కార్ల వినియోగంలో అనేకానేక నిబంధనలున్నాయి. విధిగా లాగ్‌బుక్ నిర్వహించాలి. ఏరోజుకారోజు మీటర్ రీడింగ్ నమోదు చేయాలి. సాయంత్రానికల్లా అందులో డ్రైవర్, సంబంధిత అధికారి సంతకం ఉండాలి. అన్నింటికీ మించి 'జీపీఎస్' విధానం ఉండాలి. సంబంధిత అధికారి ఆ కారులో ఎక్కడ ఏమేర ఎన్ని కి.మీ.లు తిరుగుతున్నదీ సంబంధిత శాఖ ఉన్నతాధికారి జీపీఎస్ ద్వారా ఎప్పటికప్పుడు గుర్తిస్తుండాలి. అయితే అత్యధిక అద్దె కార్లలో జీపీఎస్ విధానం అమల్లో లేదు. అద్దె కారుకు విధిగా ఎల్లో నెంబర్ బోర్డు ఉండాలి. ఆ కారు ప్రభుత్వం గుర్తించిన ఏజెన్సీకి చెందినదై ఉండాలి. అయితే పలు జిల్లాల్లో అధికారులే తమ సొంత కార్లను బినామీల పేరుతో నడుపుకుంటూ నెలనెలా టంఛన్‌గా సంబంధిత సొమ్మును డ్రా చేసుకుంటున్నారు. సొంత కారు కావటంతో జాగ్రత్తగా చూసుకుంటున్నారు. అదే అద్దె కారయితే ఆ అధికారి ద్విచక్ర వాహనంపై కార్యాలయానికి వచ్చి వెళుతూ వాహనాన్ని నిబంధనలకు విరుద్ధంగా కుటుంబ అవసరాల కోసం వినియోగిస్తున్నారు. ఏ మార్కెట్లో చూసినా, ఏ విద్యాసంస్థ వద్ద చూసినా ప్రభుత్వ అద్దె వాహనాలు దర్శనమిస్తుంటాయి. పొరబాటున ఇతర ప్రాంతాలకు తనిఖీకి వెళితే ఆ ప్రాంత అధికారులే ఫుల్ ట్యాంక్ చేసి అధికారితో పాటు డ్రైవర్ అవసరాలన్నీ తీరుస్తుండటం బహిరంగ రహస్యమే. నిబంధనల ప్రకారం ట్రెజరీ నుంచే కారు యజమాని ఖాతాలో నెలనెలా సొమ్ము జమకావాల్సి ఉంటే ఎక్కడా అలా జరగటం లేదు. సంబంధిత అధికారుల్లో అత్యధికులు తమ కమీషన్లు తీసుకుని ఆపై చెల్లింపులు జరుపుతున్నారనే విమర్శలున్నాయి. లేదా ముందుగా ఖాళీ చెక్కులు తీసుకుని వారి పేరిట చెక్‌లు జారీ చేస్తున్నారనే ఆరోపణలూ వినిపిస్తున్నాయి. కొందరు అధికారులు ప్రభుత్వ వాహనాలను కుంటిసాకులతో పక్కన పెట్టించి ప్రభుత్వ డ్రైవర్లను తమ సొంత వాహనాలపై వినియోగించుకుంటూ అద్దె వాహనాలు వినియోగించుకుంటున్నట్లుగా దొంగ బిల్లులు చెల్లిస్తున్నారనే విమర్శలు కూడా లేకపోలేదు. దీనిపై ప్రభుత్వ వాహనాల డ్రైవర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డీఎస్ కొండయ్య 'ఆంధ్రభూమి' ప్రతినిధితో మాట్లాడుతూ కనీసం ఔట్‌సోర్సింగ్‌లో అయినా డ్రైవర్లను తీసుకుని ప్రభుత్వ వాహనాలన్నింటినీ రోడ్డెక్కించాలని తాము ఏనాటి నుంచో కోరుతున్నామని అన్నారు. ఏడెనిమిదేళ్లుగా కొత్త వాహనాల కొనుగోళ్లు నిలిచాయని, అధికారులకు అవకాశం ఉన్నప్పటికీ అద్దె వాహనాలపైనే మోజు చూపుతున్నారని, అందులో తమ సొంత వాహనాలనే వినియోగించుకుంటున్నారని అన్నారు.



హఠాత్తుగా పుట్టుకొస్తున్న ప్రేమ

కొఠియా వివాదాస్పద గ్రామాలపై ఆంధ్ర, ఒడిశా అభివృద్ధి వల ◆ మాంగనీస్, బంగారం గనులున్నాయన్న ప్రచారం

ఆంధ్రభూమి బ్యూరో

విజయనగరం, జనవరి 16: ఆంధ్రా-ఒడిశా వివాదాస్పద గ్రామాలుగా పేర్కొన్న 21 గ్రామాల్లో ఇప్పుడు ఇరు రాష్ట్రాలు అభివృద్ధి కోసం పోటీ పడుతున్నాయి. నిన్న, మొన్నటి వరకు కేవలం ఎన్నికల సమయంలోనే అక్కడి ప్రజలు గుర్తుకొచ్చేవారు. ఎన్నికలు ముగిసిన తరువాత ఆ గ్రామాలవైపు కన్నెత్తి చూడని అధికారులు నేడు ఆ గ్రామాల్లో ప్రజలకు కుశల ప్రశ్నలు అడిగి వారి సమస్యలు తీరుస్తామని భరోసా ఇస్తున్నారు. ఆంధ్రా-ఒడిశా రాష్ట్రాల విభజన జరిగినపుడు ఆ ప్రాంతం ఉన్నట్టు ఏ రాష్ట్రం గుర్తించలేదు. దీంతో అక్కడి ప్రజలు ఇటు ఆంధ్ర, అటు ఒడిశాకు చెందకుండా మిగిలిపోయారు. ఆ తరువాత ఆయా గ్రామాలు తమ పరిధిలోకి వస్తాయని ఆంధ్ర, ఒడిశా ప్రభుత్వాలు పట్టుబట్టాయి. దీంతో ఇరు రాష్ట్రాలు సుప్రీంకోర్టును ఆశ్రయించాయి. గత నాలుగు దశాబ్దాలుగా సుప్రీంకోర్టులో ఈ వివాదం నలుగుతోంది. నేటికీ ఈ వివాదం కొలిక్కి రాలేదు. ఆంధ్ర ప్రభుత్వం ఎగువసెంబి వరకు సీసీ రోడ్డును నిర్మించింది. కొన్నేళ్లపాటు కొఠియాలో పోలీసు అవుట్‌పోస్టు కూడా నిర్వహించింది. వాస్తవానికి సాలూరు మండల పరిధిలో ఈ వివాదాస్పద గ్రామాలు ఉన్నాయి. కొండ ప్రాంతాలు కావడంతో ఇరు రాష్ట్రాలు వీటిని పెద్దగా పట్టించుకోలేదు. కాగా, ఇటీవల వివాదాస్పద గ్రామాలైన కొఠియా, గంజాయిభద్ర, కురిడిపొద్ర, సుంచి ప్రాంతాల్లో బంగారం గనులు ఉన్నాయన్న ప్రచారం జరుగుతోంది. దీంతో ఒడిశా ప్రభుత్వం కూడా ఆయా ప్రాంతాల్లో అభివృద్ధి పనులు వేగవంతం చేసింది. ఇటీవల విజయనగరం జిల్లా కలెక్టర్ వివేక్ యాదవ్ ఐదో విడత జన్మభూమి-మావూరు సందర్భంగా ఆయా గ్రామాలను సందర్శించి అక్కడ అభివృద్ధి పనులు చేపడతామని స్పష్టం చేశారు. దీనికి ఒడిశా ప్రభుత్వం అభ్యంతరం వ్యక్తం చేస్తోంది. తాజాగా కొరాపుట్ గత కలెక్టర్ గదాధర్ పరిడా, మాజీ ఎంపీ జయరాం పంగి, పలువురు న్యాయవాదులు ఆ ప్రాంతాన్ని పరిశీలించి ఒడిశా ప్రాంతానికే ఈ గ్రామాలు చెందుతాయని చెబుతున్నారు. ఏది ఏమైనప్పటికీ కొఠియా వివాదాస్పద గ్రామాల్లో మాంగనీస్‌తోపాటు బంగారం గనులు ఉన్నాయన్న ప్రచారంతో ఇరు రాష్ట్రాలు ఈ ప్రాంతంపై పట్టుబడుతున్నాయి.

ఆర్థిక లోటుపై ప్రకటన చేయండి

పీఏసీ చైర్మన్ బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి డిమాండ్

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 16: ఆంధ్ర రాష్ట్రంలో రెవెన్యూ లోటుపై స్పష్టమైన ప్రకటన చేయాలని పిఏసి చైర్మన్, వైకాపా ఎమ్మెల్యే బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి ముఖ్యమంత్రి చంద్రబాబును డిమాండ్ చేశారు. రాష్ట్ర రెవెన్యూ లోటు రూ.16 వేల కోట్లు ఉందని చంద్రబాబు అంటున్నారని, కాగ్ మాత్రం రూ. 24వేల కోట్ల లోటు ఉందంటోందన్నారు. కేంద్రమేమో రూ.4వేల కోట్ల లోటు ఉందని, తమ వాటా కింద లోటును భర్తీ చేసేందుకు రూ.139 కోట్లు ఇస్తే సరిపోతుందని చెబుతున్నారన్నారు. రెవెన్యూలోటుపై గందరగోళ ప్రకటనలకు స్వస్తి చెప్పాలన్నారు. మంగళవారం ఇక్కడ విలేఖర్లతో మాట్లాడుతూ, రాష్ట్ర విభజన నాటికి రాష్ట్రం రుణం రూ. 90 వేల కోట్ల ఉంటే, చంద్రబాబు ముఖ్యమంత్రి అయిన తర్వాత రూ.1.20 లక్షల కోట్లకు రుణం పెరిగిందన్నారు. తలసరి అప్పును కూడా పెంచారన్నారు. విచ్చలవిడిగా ఖర్చులు, దుబారాలు చేయడం వల్ల ఆర్థిక వ్యవస్థ కుంటుపడే స్థితికి వచ్చిందన్నారు. ఏపి భవన్ ఉండగా, తాజ్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు దిగడమేంటన్నారు. రాష్ట్రంలో అసెంబ్లీ సీట్లను పెంచాలని వత్తిడి చేయడం మినహా కేంద్రం నుంచి రాజధాని నిర్మాణానికి చంద్రబాబు ఏమీ తీసుకురాలేదన్నారు. రాజధాని నిర్మాణ వ్యయం రూ.58 వేల కోట్లకు పెరిగిందన్నారు. గత నాలుగున్నరేళ్లలో ముఖ్యమంత్రిగా చంద్రబాబు సాధించిందేమీ లేదన్నారు.



రాజశేఖర్ రెడ్డి విగ్రహం ఎదుట కొత్తబట్టలు పెడుతున్న జగన్మోహన్ రెడ్డి, చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, ఆర్‌కే రోజా తదితరులు

రాజన్నకు బట్టలు పెట్టి నివాళులు అర్పించిన జగన్

చంద్రగిరి, జనవరి 16: ప్రజాసంకల్ప యాత్రలో భాగంగా చిత్తూరు జిల్లాలో పాదయాత్రలో ఉన్న వైకాపా అధ్యక్షుడు జగన్ సంక్రాంతి సందర్భంగా తన తండ్రి జ్ఞాపకార్థం పెద్దలకు బట్టలు సమర్పించారు. జిల్లాలోని రామచంద్రాపురం మండలం పారకాల్వ గ్రామ సరిహద్దులో ఏర్పాటుచేసిన విడిదిలో రాజశేఖర్ రెడ్డి విగ్రహాన్ని వేదిక పైన ఉంచారు. మకర సంక్రాంతి పర్వదినాన అభిమానులతో కలిసి జగన్మోహన్ రెడ్డి తన తండ్రి రాజశేఖర్‌రెడ్డికి కొత్త బట్టలు పెట్టి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా విడిది ప్రాంగణాన్ని రంగురంగుల పూలతో అలంకరించారు. రంగు రంగుల రంగవల్లులతో తీర్చిదిద్దారు. గంగిరెద్దుల ఆటవారు గంగిరెద్దులతో విన్యాసాలు చేయించారు. మహిళలు గొబ్బెమ్మలు తట్టి గ్రామాలలోని పాత తరాలను ముందుకు తెచ్చారు. గ్రామాలలోని పూరి గుడిసెల నమూనాలను ఏర్పాటు చేసి గ్రామీణ వాతావరణం కల్పించారు.

1వ పేజీ తరువాయి

జూదాల జాతర

విజయమనే చెప్పుకోవాలి. ఇక ప్రముఖుల హాజరుకు కొదవలేదు. ఎంపీ జెసి దివాకర్‌రెడ్డి, సినీనటులు సుబ్బరాజు, శ్రవణ్ రాఘవ తదితరులు ఈసారి పోటీలను వీక్షించేందుకు తరలివచ్చారు. పశ్చిమగోదావరి జిల్లాలోని ఏప్రాంతం చూసినా పందెగాళ్ల నోట 'ఆదుర్స్' అన్న మాట నినాదంగా మారింది. ఈసారి కూడా జిల్లా పందాల స్వర్గంగా, జూదాల స్వర్గధామంగా మారిపోయింది. పోలీసు ప్రకటనలన్నీ మరోసారి తూచ్‌గా మారిపోగా ఈసారి కూడా పందెగాళ్లదే రాజ్యంగా మారింది. పందెం కోడి ముందు లాఠీ పవర్ వీగిపోయింది. జిల్లా జూదాలకు స్వర్గధామంగా మారిపోతోందనడానికి ఈ ఏడాది కోడిపందేలు, పేకాట పందేలను చూస్తే అర్థమవుతుంది. జిల్లాలో సంప్రదాయం పేరుతో నిర్వహించే కోడిపందేలు వ్యవస్థీకృతంగా మారిపోతున్నాయన్న వాదనకు ఈసారి పందాలు అద్దంపడుతున్నాయి. గంటల వ్యవధిలో పందాలకు ఏర్పాట్లు చేసేసి వందల సంఖ్యలో పందెగాళ్లను రప్పించేసి అదే సమయంలో పేకాట, గుండాట, కోతాట ఇలా రకరకాల జూదాలకు వేదికలు ఏర్పాటుచేసి ఒక్కసారిగా జిల్లా మొత్తం సోమవారం ఉదయానికి జూదగోదావరిగా మార్చేశారు. అడ్డూ అదుపు లేకుండా ఆడటం అంటే ఎక్కడో దూరంగా పొలాల మధ్యలో బరులు ఏర్పాటుచేసుకోవటం కాకుండా రహదారి పక్కనే, ప్రధాన సెంటర్లకు దగ్గరలోనే ఇటువంటి బరులు ఏర్పాటుచేసుకోవటం, వాటికి మించి పేకాట శిబిరాలను జోరుగా నిర్వహించటం జరిగిపోయింది. ఏ దశలోనూ పందెగాళ్లు బరుల వద్దకు వచ్చేందుకు కొంచెం కూడా కష్టపడకుండా అన్నిచోట్ల అందుబాటులోనే వీటిని ఏర్పాటుచేశారు. పోలీసు భయం లేకపోవటంతో మరింత సుఖంగా, మరింత అనాయాసంగా ఈ పందాల జాతర సాగిపోయింది. మెట్ట, డెల్టా అన్న తేడా లేకుండా పల్లెపల్లెన ఈసారి పందాల బరులు ఏర్పడటం విశేషం. అదే జోరు మంగళవారం రాత్రి వరకు సాగిపోయింది. ఈమధ్యలో ఎక్కడా పోలీసు ప్రస్తావనగాని, ఖాకీల జాడ గాని లేకపోవటం ఈసారి విచిత్రంగానే కనిపించింది. గతానికి భిన్నంగా అంతా అపేస్తామని ముందు ఉత్తరకుమార ప్రగల్భాలు పలికినా చివరకు ఆ మూడురోజులు గతానికి భిన్నంగానే అడ్డూ అదుపు లేకుండా అడ్డంగా ఆడేసుకునేందుకు జిల్లాను పందెగాళ్లకు వదిలేశారు. ఒకరకంగా చెప్పాలంటే ఈ మూడురోజుల్లోనూ తొలిరోజు కొంత మందకొడిగా ప్రారంభమైనా మిగిలిన రెండురోజులు మాత్రం పూర్తిగా పందెగాళ్లదే రాజ్యమైపోయింది. కత్తులు కట్టేదిలేదని, సంప్రదాయ పందాలంటూ నాయకుల నోట మాటలు విన్పించినా ఆ పరిస్థితి ఒక్క బరిలో కూడా లేదంటే ఆతిశయోక్తి కాదు. మరోవిధంగా చూస్తే ఎక్కడికక్కడ సాగిన కోడిపందేలు 'పర్యాటకుల'ను కూడా భారీగానే అలరించాయని చెప్పుకోవాలి. ఎక్కడెక్కడి సొమ్మో ఇక్కడి కోడిపందాల బరుల్లో హారతికర్పూరం అయిపోయింది. ఈ మొత్తం ప్రాథమిక అంచనాల ప్రకారమే వందల కోట్ల రూపాయల్లో ఉంటుందని చెబుతున్నారు. పందాలకు మించి ఆ వేదికను ఆధారం చేసుకుని వెలిసిన పేకాట శిబిరాలు మాత్రం పూర్తిస్థాయిలో కళకళలాడిపోయాయి. కొన్ని బరుల వద్ద కోడిపందేల దగ్గర కన్నా పేకాట శిబిరాల వద్ద అధికసంఖ్యలో జూదగాళ్లు చేరారంటే అతిశయోక్తి కాదు. వీటితోపాటు గుండాట, కోతాట కూడా జనాన్ని పూర్తిస్థాయిలో అలరించాయి. ఈమూడింటిలోనే పందేలకు మించి సొమ్ము చేతులు మారిందని భావిస్తున్నారు. ఏడాదికాలం సంపాదించినంతా పోగొట్టుకున్నవారు కొందరైతే, మూడురోజుల్లో లక్షాధికారులు అయినవారు మరికొంతమంది. ఇక వీటితోపాటు యధాప్రకారం ఉండాల్సిన బిర్యానీ పాయింట్లు, బెల్టుషాపులకు కొదవే లేకుండా పోయింది. మొత్తంగా చూస్తే ఈసారి ఆ మూడురోజులు జరుగుతాయా, జరగవా అన్న అనుమానాలను సృష్టించిన ఆ పరిస్థితులు ఒక్కసారిగా మాయమైపోయి జూదాలకు స్వర్గధామంగా జిల్లా మారిపోయిందనే చెప్పుకోవాలి. ఇదేవిధంగా ఈసారి కూడా పలు పెద్ద పందాలు జరిగిన ప్రాంతాల్లో మహిళల హడావిడి అధికంగానే ఉంది. పురుషులతో సమాన హక్కులు కావాలంటూ పోరాడే మహిళలు పందెం బరుల్లో మాత్రం కొన్నిచోట్ల ఆ హక్కును సాధించుకున్నట్లే కనిపిస్తోంది. ఇక పందాలను పూర్తిస్థాయిలో వ్యతిరేకించే మహిళా సంఘాలకు జిల్లాలో కొదవలేకపోగా పందాలు ఆడే మహిళల విషయంలోనూ అదే పరిస్థితి ఎదురుకావటం విచిత్రం. కొంతమంది మహిళలు లక్ష రూపాయలను ఒక్కో పందెంపై సునాయాసంగా కాస్తూ గెల్చినా, ఓడినా అదే చిరునవ్వుతో మరో పందెం వైపు వెళ్లిపోవటం అలవాటు అయిన పందెగాళ్లను కూడా ఆశ్చర్యపరిచింది. వేర్వేరు ప్రాంతాల నుంచి వచ్చిన చాలామంది కేవలం తమ జూదాల సరదాను పూర్తిస్థాయిలో నెరవేర్చుకునేందుకే జిల్లాను వినియోగించుకున్నట్లు కన్పించింది. దీంతో అందరూ ఈ పోటీలో విజేతలుగానే నిలిచారు. అటు పందెగాళ్లు, ఇటు రాజకీయనాయకులు కూడా తాము అనుకున్నది సాధించి విజయపతాకను ఎగురువేయగలిగారు. అయితే పందెం బరులు మాత్రం నెత్తురోడుతున్న కోళ్లతోను, తెగిపడ్డ రూల్స్‌తోను తడిసిపోయాయి.

వరాల బడ్జెట్?

పన్ను పరిమితిని పెంచటం, స్లాబ్ రేటును తగ్గించటంతోపాటు అరుణ్ జైట్లీ ఇతర రంగాల్లో కూడా పలు రాయితీలు, తాయిలాలు ప్రకటించే అవకాశాలున్నాయని అంటున్నారు. పది లక్షలు అంతకంటే ఎక్కువ ఆదాయం ఉన్నవారి పన్ను స్లాబ్ తగ్గించటం కంటే పన్నుస్లాబుల్లో మార్పులు చేయాలని బీజేపీ అధినాయకత్వం కోరుతున్నట్లు తెలిసింది. ఆ విధంగా ఆదాయం పన్ను స్లాబుల్లో మార్పులు చేయటం సాధ్యం కాదు కాబట్టే ఆదాయం పన్ను పరిమితిని పెంచటంతోపాటు ఆఖరు స్లాబ్‌ను 30 నుండి ఇరవై ఐదు శాతానికి తగ్గించే ప్రతిపాదనను పరిశీలిస్తున్నారని అంటున్నారు. ప్రజలపై పడుతున్న పన్నుల భారాన్ని హేతుబద్ధం చేయటంతోపాటు మౌలిక సదుపాయాల రంగానికి అవసరమైన నిధుల సమీకరణ జరిగేలా పన్నుల విధానం ఉండాలని మోదీ ప్రభుత్వం ఆలోచిస్తున్నట్లు తెలిసింది. ద్రవ్యోల్బణం మూలంగా మధ్యతరగతి ప్రజలపై భారం రోజురోజుకూ పెరుగుతోంది, ఈ భారాన్ని కొంతైనా తగ్గించాలనే లక్ష్యంతోనే ప్రభుత్వం ఆదాయం పన్ను రాయితీలపై దృష్టి సారించిందనే మాట వినిపిస్తోంది. పన్ను భారం తగ్గటంవలన ప్రజల వద్ద నగదు పెరిగితే దీనివలన కొనుగోళ్లు పెరిగి వ్యాపారం పుంజుకుంటుందని ప్రభుత్వం భావిస్తోంది. వ్యాపారం, సేవారంగం పెరగటం వలన ఆర్థిక కార్యకలాపాలు పుంజుకుంటాయి, ఇది ఆర్థికాభివృద్ధికి దారి తీస్తుందన్నది ప్రభుత్వం వాదన. బ్యాంకుల ఎఫ్‌డీలు (ఫిక్స్‌డ్ డిపాజిట్)లకు పన్ను రాయితీ ఇచ్చే ప్రతిపాదన కూడా ప్రభుత్వ పరిశీలనలో ఉన్నట్లు తెలిసింది. పొదుపును ప్రోత్సహించేందుకు ప్రభుత్వం మ్యూచువల్ ఫండ్స్‌కు పన్ను మినహాయింపు ఇవ్వనున్నట్లు తెలిసిందే. మ్యూచువల్ ఫండ్స్‌కు ఇచ్చినట్లే ఎఫ్‌డీలకు కూడా పన్ను మినహాయింపు ఇవ్వటంద్వారా పొదుపును ప్రోత్సహిస్తే బ్యాంకుల్లో నగదు నిల్వలు బాగా పెరుగుతాయని కేంద్ర ఆర్థిక శాఖ భావిస్తోంది. బ్యాంకుల్లోకి వచ్చే నగదును రుణాల రూపంలో ఇవ్వటంద్వారా ఆర్థిక కార్యక్రమాలను బాగా పెంచవచ్చునన్నది ప్రభుత్వం ఆలోచన. కొన్ని ఎంపిక చేసిన సెక్యూరిటీలపై ఎస్‌టీసీజీ (షార్ట్ టర్మ్ క్యాపిటల్ గెయిన్) హోల్డింగ్ కాలాన్ని ఒక ఏడాది నుండి మూడేళ్లకు పెంచే ప్రతిపాదన కూడా ప్రభుత్వం పరిశీలనలో ఉంది.

మాట్లాడుకుందాం!

ఏపీని కోరారని గుర్తు చేశారు. ఆర్‌డిఎస్ పూర్తయితే కర్నాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రాంతాల్లోని భూములకు సాగు నీరు లభిస్తుంది. అయితే ఈ పథకం పూర్తి చేసేందుకు కొన్ని సమస్యలు తలెత్తుతున్నాయని, వీటిని పరిష్కరించుకునేందుకు చర్చించుకుందామంటూ ఏపి నీటిపారుదల మంత్రిని హరీష్‌రావు కోరారు. తాను 2017 ఆగస్టు 8 న ఇదే అంశంపై లేఖరాశానంటూ హరీష్‌రావు తన లేఖలో ఏపి మంత్రి ఉమామహేశ్వరరావుకు గుర్తు చేశారు. చీఫ్ ఇంజనీర్ల స్థాయిలో చర్చలు జరిగాయని, అయితే అవి సత్ఫలితాలు ఇవ్వలేదని హరీష్ తెలిపారు. ఈ పరిస్థితిలోనే ముగ్గురం (మూడు రాష్ట్రాల నీటిపారుదల మంత్రులు) కూచుని మాట్లాడుకుందా మంటూ హరీష్‌రావు తన లేఖలో స్పష్టం చేశారు.

గోపూజలో ఉప రాష్ట్రపతి దంపతులు

వెంకటాచలం, జనవరి 16 : భారతీయ సంస్కృతి, సంప్రదాయాల్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు సూచించారు. నెల్లూరు జిల్లా వెంకటాచలం మండలం చవటపాళెం పంచాయతీ సరస్వతి నగర్ వద్ద ఉన్న అక్షర విద్యాలయ పాఠశాలలో సోమవారం సంక్రాంతి పర్వదినం సందర్భంగా గోపూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు, ఆయన సతీమణి ఉషమ్మ, కుమార్తె దీపావెంకట్, కుమారుడు హర్షవర్ధన్‌నాయుడు, ఇతర కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు మాట్లాడుతూ ప్రపంచ దేశాల్లో భారతీయ సంస్కృతి సంప్రదాయాలకు ప్రత్యేకమైన గుర్తింపు ఉందన్నారు. కొందరు భారతీయులు మన సంస్కృతి, సంప్రదాయాలను మరిచి పరదేశ సంస్కృతి సంప్రదాయాలకు బానిసలవుతున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. మాతృదేశాన్ని, మాతృభాషను, కన్న తల్లి, సొంత గ్రామాన్ని మరవవద్దని సూచించారు. ముగిసిన వెంకయ్యనాయుడు పర్యటన

ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు జిల్లా పర్యటన విజయవంతంగా ముగిసింది. సంక్రాంతి సంబరాల్లో పాల్గొనేందుకు ఈ నెల 11న సాయంత్రం వెంకటాచలం వచ్చిన ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు మంగళవారం ఉదయం వరకు స్వర్ణభారత్ ట్రస్ట్‌లోనే ఉన్నారు. తన పర్యటనలో భాగంగా ఈ నెల 12న అక్షర విద్యాలయం, స్వర్ణభారత్ ట్రస్టులో జరిగిన సంక్రాంతి సంబరాల్లో ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడుతో కలిసి తమిళనాడు గవర్నర్ భన్వర్‌లాల్ పురోహిత్ తదితరులు ఉన్నారు. 13న స్వర్ణభారత్ ట్రస్టులో ట్రస్టు ఆధ్వర్యంలో చెన్నై గ్లోబల్ ఆసుపత్రి సహకారంతో నిర్వహించిన ఉచిత వైద్యశిబిరాన్ని వెంకయ్యనాయుడు ప్రారంభించి మాట్లాడారు. అదే రోజు బంధువులు, ఆత్మీయులు, తమ స్వగ్రామానికి చెందిన ప్రజలు, గ్రామస్థులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. అనంతరం వెంకయ్యనాయుడును పలువురు ప్రముఖులు, స్నేహితులు, జిల్లా వాసులు, స్వగ్రామానికి చెందినవారు, అధికారులు ప్రత్యేకంగా సన్మానించారు.



కృష్ణా జిల్లా కలెక్టర్‌పై లోకాయుక్త నిర్ణయం సబబే

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 16: కృష్ణా జిల్లా కలెక్టర్ 2016 జనవరి 1వ తేదీ నూతన సంవత్సర వేడుకల సందర్భంగా రూ.20 లక్షల సొమ్మును ఖర్చుపెట్టినందుకు ఫిర్యాదును నమోదు చేయాలన్న పిటిషన్‌ను ఏపి లోకాయుక్త తిరస్కరించడం సబబేనని హైకోర్టు తీర్పు ఇచ్చింది. ఏవి రమణ అనే సామాజిక కార్యకర్త దాఖలు చేసిన పిటిషన్‌ను హైకోర్టు ధర్మాసనం కొట్టివేసింది. ఈ తీర్పును జస్టిస్ సి ప్రవీణ్ కుమార్, జస్టిస్ ఎన్ బాలయోగితో కూడిన ధర్మాసనం వెలువరించింది. పిటిషనర్ చెప్పిన దాని ప్రకారం కృష్ణా జిల్లా కలెక్టర్ 2016 డిసెంబర్ 27వ తేదన రాష్ట్రప్రభుత్వానికి కొత్త సంవత్సర వేడుకల నిర్వహణకు నిధులు కావాలని అడిగితే, ప్రభుత్వం రూ.20 లక్షలను విడుదల చేసిందని, ఈ నిధులతో వేడుకలను విజయవాడ హరిత బెర్మ్ పార్క్ హోటల్ లోనిర్వహించారన్నారు. ఇది ప్రజాధనం దుర్వినియోగం చేసినట్లేనని, ఈ విషయమై కృష్ణా జిల్లా కలెక్టర్‌పై కేసు నమోదు చేయాలని పిటిషనర్ లోకాయుక్తకు ఫిర్యాదు చేశారు. లోకాయుక్త పరిధిలోని అంశాలను ప్రస్తావించి చర్యలు తీసుకోవాలన్న పిటిషనర్ వాదనతో ఏకీభవించని లోకాయుక్త ఈ పిటిషన్‌ను తిరస్కరించింది. లోకాయుక్త ఉత్తర్వుల్లో తాము జోక్యం చేసుకోవాల్సిన అవసరం లేదని పేర్కొంది.

ఆక్వా రాజధానిలో విదేశీ శాస్త్రవేత్తల బృందం పర్యటన

ఆంధ్రభూమి బ్యూరో

భీమవరం, జనవరి 16: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ఆక్వా రంగాన్ని భయపెడుతున్న వివిధ రకాల భయంకరమైన వైరస్, యాంటిబయోటిక్స్ నేపథ్యంలో వీటి పై అధ్యయనం చేసేందుకు విదేశీ ఆక్వా శాస్త్రవేత్తల బృందం నీలి విప్లవ రాజధానిగా పేరొందిన పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలో మంగళవారం పర్యటించింది. యునైటెడ్ కింగ్‌డం (యుకె), బంగ్లాదేశ్, కెన్యా, వియాత్నం, ఇటలీ వంటి ఐదేశాలకు చెందిన 22 మంది సభ్యులతో కూడిన విదేశీ ఆక్వా శాస్త్రవేత్తల బృందం ఆనంద ఫౌండేషన్-యుకెకి చెందిన స్టర్లింగ్ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో పలు నమూనాలను సేకరించారు. ముఖ్యంగా ఈ ప్రాంతంలోని ఆక్వా చెరువులు, సీడ్ (రొయ్యల పిల్లలు) పెంచే హ్యాచరీలు, ఫీడ్ తయారుచేసే పరిశ్రమలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఆక్వా ఉత్పత్తులు ఉత్పత్తి చేసే నెల్లూరు జిల్లా నుంచి శ్రీకాకుళం వరకు అంటే సముద్ర తీర ప్రాంతాన ఈ బృందం పర్యటించిన అనంతరం భీమవరంలో ఆనంద గ్రూప్ ఛైర్మన్ ఉద్దరాజు కాశీ విశ్వనాధరాజును కలిసి అనేక అంశాలపై చర్చించారు. గత కొంతకాలంగా ఆక్వా రైతులను నష్టాలకు గురిచేస్తున్న వైట్ స్పాట్, ఇఎంఎస్, ఇహెచ్‌పి తదితర వ్యాధులను నివారించేందుకు ఈ ఆక్వా శాస్త్రవేత్తల బృందం పరిశోధనలు చేస్తోంది. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఆనంద ఫౌండేషన్ ఆంధ్రప్రదేశ్ ఫిషరీస్ అండ్ ఓషన్ యూనివర్సిటీని భీమవరం ప్రాంతంలో ఏర్పాటు చేయనున్న నేపథ్యంలో యుకెకి చెందిన స్టర్‌లింగ్ విశ్వవిద్యాలయంతో గతంలో ఎంఒయు చేసుకుంది. ఆక్వా రంగాన్ని కుదేలు చేస్తున్న వైరస్‌లపై అధ్యయనం చేసేందుకు ఈ బృందంపర్యటించింది.

Printed and Published from Vijayawada by **K.Sudhakar** on behalf of Deccan Chronicle Holdings Limited at Deccan Chronicle Holdings Press, No.C 3 & 4, Patamata, Industrial Estate, Vijayawada. Chief Editor **T.V.Ravi Reddy**, Phones:2555284,2555185,2555287 Regd. No.AP/VJA/41/51/2000. RNI Registration No.52743/90

క్రీడ

ఆస్ట్రేలియన్ ఓపెన్ టెన్నిస్
రెండో రౌండ్‌లోకి ఫెదరర్, జుకోవిచ్

మెల్‌బోర్న్, జనవరి, 16: ఆస్ట్రేలియన్ ఓపెన్ టెన్నిస్ టోర్నీలో ప్రపంచ నెంబర్ 2 ఆటగాడు రోజర్ ఫెదరర్, ఆరుసార్లు చాంపియన్‌గా అవతరించిన నవోక్ జుకోవిక్ తమ మొదటిరౌండ్లలో విజయం సాధించడం ద్వారా రెండో రౌండ్‌లోకి ప్రవేశించారు. జుకోవిక్ అమెరికన్ ఆటగాడు డొనాల్డ్ యంగ్‌పై మార్గరెట్ కోర్టు అరెనాలో గంట 51 నిమిషాల వ్యవధిపాటు జరిగిన పోటీలో 6-1, 6-2, 6-4 తేడాతో విజయం సాధించాడు. అదేవిధంగా ఫెదరర్ సొవేనియాకు చెందిన తన ప్రత్యర్థి అలిజ్ బెడెనెను 6-3, 6-4, 6-3 తేడాతో ఓడించి రెండో రౌండ్‌లోకి ప్రవేశించాడు.

టాటా స్టీల్ మాస్టర్స్ చెస్ టోర్నీ
మూడో రౌండ్‌లోకి విశ్వనాథన్ ఆనంద్

విక్ ఆన్ జీ, జనవరి 16: చెస్‌లో ఐదుసార్లు ప్రపంచ చాంపియన్‌షిప్ సాధించిన భారత ఆటగాడు విశ్వనాథన్ ఆనంద్ టాటా స్టీల్ మాస్టర్ చెస్ టోర్నీలో మూడో రౌండ్‌లోకి ప్రవేశించాడు. అమెరికాకు చెందిన ఫాబినో కెర్వానా జరిగిన పోటీలో ఆయన 2.5 పాయింట్లు సాధించడం ద్వారా మూడో రౌండ్‌లోకి చేరాడు. మూడురోజుల్లో రెండోసారి ఈ విజయం సాధించడం ద్వారా ఆనంద్ ఆరోసారి కూడా విజయం సాధించాలని ఆశిస్తున్నాడు. ప్రత్యర్థి ఎత్తులను చిత్తు చేస్తూ 16 మూమెంట్‌లో తన ప్రత్యర్థి వ్యవహరించిన తీరుపై ఆశ్చర్యం వ్యక్తం చేశాడు.

ముంగిట భారీ లక్ష్యం
ఛేదనలో తడబడిన భారత్

❖దక్షిణాఫ్రికాతో రెండో టెస్టు మూడో రోజు కోహ్లీ రికార్డు

❖నాలుగో రోజు 26 పరుగులలోపే పెవిలియన్‌కు ముగ్గురు బ్యాట్స్‌మన్లు

సెంచూరియన్, జనవరి 16: దక్షిణాఫ్రికాతో జరుగుతున్న రెండో టెస్టు నాలుగో రోజు జరిగిన రెండవ ఇన్నింగ్స్‌లో మంగళవారం జరిగిన మ్యాచ్‌లో భారత బ్యాట్స్‌మెన్లు బ్యాటింగ్ ఝుళిపించడంలో తడబడ్డారు. 287 పరుగుల లక్ష్యఛేదనలో బ్యాటింగ్ ప్రారంభించినప్పటినుంచే తడబడ్డారు. తొలుత బ్యాటింగ్ ప్రారంభించిన ఓపెనర్ మురళీ విజయ్ 8వ ఓవర్‌లో 9 పరుగులకే ఔటయ్యాడు.

ఇతను తొలి ఇన్నింగ్స్‌లో అద్భుతంగా ఆడినా, రెండో ఇన్నింగ్స్‌లో పరుగులు చేయడంలో విఫలమయ్యాడు. కేఎల్ రాహుల్ 29 బంతులు ఎదుర్కొని కేవలం నాలుగు పరుగులు మాత్రమే చేయగలిగాడు. దక్షిణాఫ్రికా జట్టులో టెస్టు క్రికెట్‌లో తొలిసారిగా ఆరంగేట్రం చేసిన యువ క్రికెటర్ లుంగీ ఎంగిడి రాహుల్‌ను ఔట్ చేశాడు.

ఆ తర్వాత వచ్చిన కెప్టెన్ విరాట్ కోహ్లీ 20 బంతులు ఎదుర్కొని కేవలం ఐదు పరుగులు మాత్రమే చేసి ప్రేక్షకులను నిరాశపరిచాడు. రెండో ఇన్నింగ్స్ మూడవ రోజున చెలరేగి విధ్వంసకర బ్యాటింగ్‌తో అలరించిన కోహ్లీ మళ్లీ నాలుగో రోజు కూడా అదేవిధంగా ఆట తీరును కనబరుస్తాడనుకుంటే ఉసూరుమనిపించాడు. ఈ ముగ్గురూ 26 పరుగులలోపే పెవిలియన్ దారి పట్టడం ప్రేక్షకులను నిరాశపరిచింది. లుంగీ ఎంగిడి విరాట్ కోహ్లీ, కేఎల్ రాహుల్‌లను ఔట్ చేయగా, మురళీ విజయ్ వికెట్‌ను కగిసో రబడ దక్కించుకున్నాడు. ప్రస్తుతం చటేశ్వర్ పుజారా, పార్థివ్ పటేల్ క్రీజులో ఉన్నారు.

భారత్ ముంగిట భారీ లక్ష్యం

భారత్‌తో జరుగుతున్న టెస్టుమ్యాచ్ నాలుగోరోజున దక్షిణాఫ్రికా కెప్టెన్ ఫఫ్ డుప్లెసిస్ సారథ్యంలో ఆ జట్టు బ్యాట్స్‌మెన్లు మొత్తం 258 పరుగులు చేశారు. ఒక్క డుప్లెసిస్‌నే ఏకంగా మూడుగంటలపాటు ఆడి 122 బంతులను ఎదుర్కొన్నాడు. డుప్లెసిస్, వెర్నన్ ఫిలాండర్‌తో కలసి ఆరో వికెట్‌కు 26వ ఓవర్ సరికల్లా 46 పరుగులు జత చేశారు. మహ్మద్ షమీ లంచ్ విరామ సమయానికి ముందు వేసిన నాలుగు ఓవర్లలో 42 పరుగులిచ్చి మూడు వికెట్లు తీసుకోవడంతో దక్షిణాఫ్రికా జట్టు ఆచితూచి ఆడడం మొదలెట్టింది.

ఓవర్‌నైట్ స్కోరుతో ఆడిన దక్షిణాఫ్రికా 91.3 ఓవర్లలో 258 పరుగులు చేసి ఆలౌట్ అయింది. ఆతిథ్య జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 28 పరుగులు ఎక్కువ చేసింది. దీంతో ఈ లక్ష్యఛేదనకు భారత్ 287 పరుగులు చేయాల్సి ఉంది. అంతకుముందురోజు సోమవారం జరిగిన మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా జట్టు బ్యాట్స్‌మెన్ డివిలియర్స్ 121 బంతుల్లో 10 ఫోర్లతో చెలరేగి 80 పరుగులు సాధించాడు. తన పదునైన ఆటతీరుతో భారత బౌలర్లను వణికించినా శతకం చేజార్చుకున్నాడు. డివిలియర్స్‌తో పాటు దిగిన ఓపెనర్ డీన్ ఎల్గర్ 121 బంతులు ఎదుర్కొని ఎనిమిది ఫోర్లు, ఒక సిక్సర్‌తో 60 పరుగులు చేసి వెనుతిరిగాడు. అతని తర్వాత వచ్చిన డికాక్ కేవలం 12 పరుగులు చేసి అవుటయ్యాడు. డివిలియర్స్, డీన్ ఎల్గర్, డికాక్‌లను భారత ఫాస్ట్‌బౌలర్ మహ్మద్ షమీ ఔట్ చేశాడు. ఆ తర్వాత వచ్చిన దక్షిణాఫ్రికా కెప్టెన్ డుప్లెసిస్ 141 బంతులు ఎదుర్కొని కేవలం 48 పరుగులు చేయగలిగాడు.

ఆ తర్వాత వచ్చిన ఆటగాళ్లెవరూ ఎక్కువ పరుగులేమీ చేయకుండానే వెనుతిరిగారు. భారత్‌లో షమీ మొత్తం నాలుగు వికెట్లు, బుమ్రా రెండు వికెట్లు, ఇశాంత్ శర్మ రెండు వికెట్లు, రవీంద్రన్ అశ్విన్ ఒక వికెట్ తీశారు. సెంచూరియన్ మైదానంలో గతంలో జరిగిన చాలా మ్యాచుల్లోని నాలుగో ఇన్నింగ్స్‌లో ఒక జట్టు ఆడిన అత్యధిక స్కోరు 226. అయితే, దక్షిణాఫ్రికా జట్టు 258 పరుగులు చేయడం ఒక విశేషమైతే, భారత్ జట్టు ముందు భారీ లక్ష్యం ఉంచింది.

దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్‌లో 335 పరుగులు చేయగా, రెండో ఇన్నింగ్స్‌లో 258 పరుగులు చేసింది.

స్కోర్‌బోర్డు (నాలుగో రోజు):

భారత్‌తో జరిగిన రెండవ టెస్టుమ్యాచ్ మొదటి ఇన్నింగ్స్‌లో దక్షిణాఫ్రికా 335 పరుగులు చేయగా, భారత్ 307 పరుగులు చేసింది. రెండవ ఇన్నింగ్స్‌లో 91.3 ఓవర్లలో దక్షిణాఫ్రికా 258 పరుగులకు ఆలౌట్ అయింది.

సంక్షిప్తంగా: ఎయిడెన్ మోర్కమ్ ఎల్‌బిడబ్ల్యు బి బుమ్రా 1, డీన్ ఎల్గర్ సి రాహుల్ బి షమీ 61, హష్మి ఆమ్లా ఎల్‌బిడబ్ల్యు బి బుమ్రా 1, ఏబీ డివిలియర్స్ సి పటేల్ బి షమీ 80, ఫఫ్ డుప్లెసిస్ సి అండ్ బి బుమ్రా 48, క్వింటన్ డి కాక్ సి పటేల్ బి షమీ 12, వెర్నర్ ఫిలాండర్ సి విజయ్ బి ఇషాంత్ 26, కేశవ్ మహారాజ్ సి పటేల్ బి ఇషాంత్ 6, కగిసో రబడ సి కొహ్లి బి షమీ 4, మోర్నె మోర్కల్ నాటౌట్ 10, లుంగి ఎంగిడి సి విజయ్ బి అశ్విన్ 1.

ఎక్స్‌ట్రాలు: (బి-2 ఎల్‌బి-5 వికెట్-1) మొత్తం 8 (91.3 ఓవర్లలో ఆలౌట్) 258 పరుగులు.

వికెట్ల పతనం: 1/1/ 2/3 3/144 4/151 5/163 6/209 7/215 8/245 9/245.

బౌలింగ్: రవీంద్ర అశ్విన్ 29.3-6-78-1, జస్ప్రిత్ బుమ్రా 20-3-7--3, ఇషాంత్ శర్మ 17-3-40-2, మహ్మద్ షమీ 16-3-49-4, హార్థిక్ పాండ్యా 0-1-14-0



బ్రాడ్‌మన్ రికార్డును సమం చేసిన కోహ్లీ

సెంచూరియన్, జనవరి 16: భారత క్రికెట్ జట్టు కెప్టెన్ విరాట్ కోహ్లీ అరుదైన రికార్డును సాధించాడు. దక్షిణాఫ్రికాతో జరుగుతున్న టెస్ట్‌మ్యాచ్ రెండవ ఇన్నింగ్స్‌లో సోమవారం జరిగిన పోటీలో కోహ్లీ ఆస్ట్రేలియా మాజీ క్రికెటర్ బ్రాడ్‌మన్ రికార్డుతో సమానంగా టెస్ట్‌మ్యాచ్‌లలో 150 పరుగులు చేశాడు. దక్షిణాఫ్రికాతో జరిగిన మ్యాచ్‌లో 152 పరుగులు చేసి అజేయంగా నిలబడడమే కాకుండా 150కి పైగా పరుగులు సాధించడం కోహ్లీకి ఇది ఎనిమిదవసారి. ఇవన్నీ కూడా 56 టెస్టుల్లోనే సాధించడం విశేషం. ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ మైకేల్ క్లార్స్ ఏడుసార్లు 150 పరుగులు చేయడం ద్వారా మూడో స్థానంలో నిలిచాడు. మూడోరోజు ఆటలో 182/5 ఓవర్‌నైట్ స్కోరుతో భారత్ బ్యాటింగ్ ఆరంభించింది. కెప్టెన్ విరాట్ కోహ్లీ తన విరాట రూపం ప్రదర్శించి కెపెస్సీ ఇన్నింగ్స్ ఆడాడు. కోహ్లీ తనదైన శైలిలో ప్రత్యర్థి బౌలర్లపై విరుచుకుపడుతూ అర్థవంతమైన, అందమైన, చురుకైన షాట్లతో అలరించాడు. కోహీ తన కెరీర్‌లో 21వ శతకం బాదాడు.



అండర్-19 క్రికెట్ ప్రపంచ కప్ పోటీల్లో భాగంగా పపువా న్యూజెనియాతో గ్రూప్-బి విభాగంలో జరిగిన పోటీలో భారత జట్టు బ్యాట్స్‌మెన్ అంకుల్ రాయ్ ఒక్క పరుగు కూడా ఇశ్వకుండానే ఐదు వికెట్లు తీసుకున్నాడు.

అండర్-19 క్రికెట్
క్వార్టర్ ఫైనల్‌లోకి భారత్

★ ఒక్క పరుగు ఇవ్వకుండా ఐదు వికెట్లు సాధించిన భారత బౌలర్ అంకుల్ రాయ్

మౌంట్ మౌంగనూయి, జనవరి 16: ప్రతిష్టాత్మక అండర్-19 క్రికెట్ ప్రపంచ కప్ పోటీల్లో భారత జట్టు క్వార్టర్ ఫైనల్‌లోకి దూసుకెళ్లింది. సోమవారం పపువా న్యూజెనియాతో గ్రూప్-బి విభాగంలో జరిగిన పోటీలో భారత్ ఆటగాళ్లు 10 వికెట్ల తేడాతో విజయం సాధించి క్వార్టర్ ఫైనల్‌లోకి ప్రవేశించారు. భారత జట్టు కెప్టెన్ పృథ్వీషా తనదైన బ్యాంటింగ్ సరళితో అర్థ సెంచరీతో ఆకట్టుకోగా స్పిన్నర్ అంకుల్‌రాయ్ ఐదు వికెట్లు తీసుకుని జట్టును విజయపథంలో దూసుకెళ్లేందుకు దోహదపడ్డాడు. తొలుత టాస్ గెలిచి ఫీల్డింగ్ ఎంచుకున్న భారత్ తిరుగులేని ఆధిపత్యాన్ని సాధించింది.

ప్రత్యర్థి జట్టు అయిన వపువా న్యూజెనియాలో ఒవియ సామ్ (15), ఓపెనర్ సిమోన్ అత్తై (13) మాత్రమే కష్టపడి రెండల స్కోరు చేయగలిగారు. మొత్తం 21.5 ఓవర్లలో ఈ జట్టు కేవలం 64 పరుగులు మాత్రమే సాధించగలిగింది. అండర్-19 ప్రపంచ కప్‌లో జరుగుతున్న పోటీల్లో ఇప్పటివరకు వపువా న్యూజెనియాదే అత్యల్ప స్కోరు కావడం గమనార్హం. అనంతరం బ్యాటింగ్‌లోకి దిగిన భారత్ జట్టుకు ప్రత్యర్థి తన ముంగిట ఉంచిన అత్యల్ప స్కోరు ఏమాత్రం పెద్ద టార్గెట్ కాకపోవడంతో కేవలం 8 ఓవర్లలో ఒక్క వికెట్ కూడా కోల్పోకుండా లక్ష్యాన్ని ఛేదించింది. భారత్ కెప్టెన్ పృథ్వీ షా మొత్తం 57 బంతులు ఎదుర్కొని 39 పరుగులతో కెప్టెన్సీకే వన్నెతేగా ఇందులో 12 బౌండరీలు కూడా ఉండడం విశేషం.

అండర్-19 ప్రపంచ కప్ టోర్నీలో భారత కెప్టెన్‌కు ఇది రెండో అర్థ సెంచరీ కావడం గమనార్హం. భారత జట్టు సభ్యుడు అంకుల్ రాయ్ ఒక్క పరుగు కూడా ఇవ్వకుండా ఐదు వికెట్లు సాధించడం మరో విశేషం. భారత జట్టుకు చెందిన మరో క్రికెటర్, ఫాస్ట్ బౌలర్ శివమ్ మవీ రెండు వికెట్లు తీసుకోగా, కమలేష్ నాగర్‌కోటి, అర్షదీప్ సింగ్ చెరో వికెట్ చేజిక్కించుకున్నారు. ఇదిలావుండగా, భారత్ ఈనెల 19వ తేదీన జింబాబ్వేతో తలపడుతుంది.

సంక్షిప్తంగా స్కోరు:

పపువా న్యూజెనియా: 21.5 ఓవర్లకు 64 ఆలౌట్ (ఓ.ఎల్.శామ్ 15; ఏ.ఎస్.రాయ్ 5/14)

భారత్: 8 ఓవర్లకు 67 పరుగులు (పి.పి.షా 57; ఎల్.మోరియా 0/11)

24 గంటల స్పోర్ట్స్ రేడియో చానల్ ప్రారంభం

న్యూఢిల్లీ, జనవరి 16: ఇంతవరకు క్రీడా వార్తల ప్రసారానికి కేవలం వివిధ చానెళ్లపైనే ఆధారపడిన భారత క్రీడాభిమానులకు శుభవార్త. వివిధ క్రీడలకు సంబంధించిన సమస్త సమాచారంతోపాటు 24 గంటలపాటు వివిధ క్రీడలపై కామెంటరీలు వినిపించేందుకు ఇంటర్‌నెట్ ఆధారిత రేడియో కార్యక్రమాలు మన ముందుకు రానున్నాయి. 24 గంటలపాటు క్రీడావార్తల సమాహారాన్ని అందజేసేందుకు తద్వారా క్రీడాభిమానులకు మరింత చేరువయ్యేందు ఈ స్పోర్ట్స్ రేడియో చానల్ తన వంతు కృషి చేయనుంది. ఇంటర్‌నెట్ ఆధారిత స్పోర్ట్ రేడియో చానల్‌కు బహుళార్థక స్పోర్ట్ అప్లికేషన్ (యాప్) ఉండడం వల్ల దేశవ్యాప్తంగా జరిగే సాధారణ క్రీడా వార్తలే కాకుండా ప్రత్యేక కార్యక్రమాలు ప్రసారం చేయనుంది. ఇందులో ఆయా క్రీడా పోటీలకు సంబంధించి క్రీడా నిపుణుల కామెంట్లు, ప్రీమియర్ లీగ్, ఐపీఎల్, ఫిఫా వరల్డ్ కప్ వంటి వాటితోపాటు నిరంతరం 400 క్రీడల్లో జరిగే మార్పులు, చేర్పులు ఉంటాయి. ఇప్పటివరకు ఉన్న స్పోర్ట్స్ చానళ్లలో లేని, రాని అంశాలను ఒక వేదికపైకి తీసుకువచ్చి తమ స్పోర్ట్స్ రేడియో చానల్ ద్వారా ప్రసారం చేసి, ప్రజలను ఆకట్టుకునేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తామని ఈ స్పోర్ట్స్ రేడియో చానల్‌కు రామన్ రహేజా వ్యవస్థాపకుడు పేర్కొన్నారు. వివిధ అసోసియేషన్ల ద్వారా వివిధ క్రీడలకు సంబంధించిన సమగ్ర సమాచారం సేకరించడం ద్వారా వారిని మరింత ప్రోత్సహిస్తామన్నాడు. ప్రస్తుతం ఇంగ్లీష్, హిందీ భాషల్లో మాత్రమే ప్రసారమయ్యే ఈ రేడియో స్పోర్ట్స్ చానల్‌లోని అంశాలను స్పోర్ట్‌ఫ్లాష్.కామ్ ద్వారా మొబైల్ యాప్ నుంచి వీక్షించవచ్చునని ఆయన తెలిపాడు.

కోహ్లీ మ్యాచ్ ఫీజులో 25 శాతం కోత

సెంచూరియన్, జనవరి 16: భారత క్రికెట్ జట్టు కెప్టెన్ విరాట్ కోహ్లీకి మ్యాచ్‌లో 25 శాతం కోత పడింది. దక్షిణాఫ్రికాతో సెంచూరియన్ స్టేడియంలో జరుగుతున్న రెండవ టెస్టు మూడవ రోజు సోమవారం జరిగిన ఆట సందర్భంగా కోహ్లీ ఐసీసీ కోడ్ నియమ నిబంధనలను ఉల్లంఘించినందుకు అతని మ్యాచ్ ఫీజులో 25 శాతం కోత విధించారు. మూడవ రోజు ఆట సందర్భంగా రెండవ రోజు 25వ ఓవర్‌లో కోహ్లీ ఎంపైర్ మిచెల్ కాఫ్‌తో అదే పనిగా వాదనకు దిగిన నేపథ్యంలో ఐసీసీ కోడ్ లెవెల్ 1ను అనుసరించి అతని మ్యాచ్ ఫీజులో 25 శాతం కోత విధించినట్టు ఐసీసీ ఒక ప్రకటనలో పేర్కొంది. ఈ మ్యాచ్‌లో కోహ్లీ వ్యవహరించిన తీరు ఐసీసీ కోడ్ ఆఫ్ కాండక్ట్ 2.1.1 ఆర్టికల్ ప్రకారం నియమ నిబంధనలను ఉల్లంఘించడం అవుతుందని పేర్కొంది. కోహ్లీ తీరు మిగతా క్రీడాకారుల్లో ఉత్సాహాన్ని నీరుగార్చేలా ఉందని పేర్కొంది. అనంతరం విరాట్ కోహ్లీ తాను చేసిన తప్పునకు ఐసీసీ మ్యాచ్ రిఫరీలు మిచైల్ కాఫ్, పాల్ రీఫిల్, థర్డ్ ఎంపైర్ రిచర్డ్ కెటిల్ బారో, ఫోర్త్ ఎంపైర్ అల్లాహుదీన్‌లకు క్షమాపణలు కోరాడు.

జపాన్‌తో నేడు తలపడనున్న భారత్
జాతీయ ఇన్విటేషనల్ హాకీ టోర్నీ

తౌరంగ (న్యూజిలాండ్), జనవరి 16: నాలుగు జాతీయ ఇన్విటేషనల్ టోర్నమెంట్లలో భాగంగా భారత్ హాకీ జట్టు తొలిరోజు బుధవారంనాడు జపాన్ జట్టుతో తలపడుతుంది. జపాన్‌తో జరిగిన పోటీ అనంతరం బెల్జియం, న్యూజిలాండ్‌తో జరిగే ఐదు రోజుల సిరీస్‌లలో భారత్ ఆడుతుంది. నాలుగు రోజులపాటు జపాన్‌తో జరిగే పోటీలో భాగంగా భారత్ ఇక్కడి బ్లేక్ పార్క్‌లో వాతావరణ పరిస్థితులను అంచనా వేసింది. భారత్ జట్టు కెప్టెన్ రూపేంద్రపాల్ సింగ్ స్టేడియంను పరిశీలించి, ఇది తమకు అన్నివిధాల అనుకూలంగా ఉందని సంతోషం వ్యక్తం చేశాడు. ఈ పిచ్‌పై తమ జట్టు బాగా ఆడుతుందనే నమ్మకాన్ని ఆయన వ్యక్తం చేశాడు. ఈ కొత్త ఏడాదిలో భారత జట్టు ఇదే తొలి టోర్నమెంట్ అని, కనుక కొన్ని మ్యాచ్‌ల్లో గెలవడం ద్వారా ఆ మధుర క్షణాలతో మళ్లీ స్వదేశానికి తిరిగి వెళ్తామనే ధీమాను ఆయన వ్యక్తం చేశాడు. ఇదిలావుండగా, జపాన్‌తో గతంలో జరిగిన పలు టోర్నీలో భారత్‌కు మంచి రికార్డు ఉందన్న విషయం గత ఏడాది ఒడిషాలోని భువనేశ్వర్‌లో జరిగిన పురుషుల ఆసియా కప్ టోర్నమెంట్‌లో రుజువైంది. ఈ టోర్నీలో భారత్ 5-1 తేడాతో జపాన్‌ను మట్టికరిపించిన విషయం తెలిసిందే. ఇదే ఉత్సాహంతో నాలుగు జాతీయ ఇన్విటేషన్ టోర్నమెంట్లలో కూడా బాగా ఆడతామనే విశ్వాసాన్ని ఆయన వ్యక్తం చేశాడు. తమ జట్టులోకి శ్రీజేష్ మళ్లీ రావడంతో, అతని అనుభవం టోర్నీలో పెద్ద జట్లతో ఆడినపుడు తమకు సానుకూలంగా ఉండగలదని ఆయన అన్నాడు. గాయం తర్వాత కోలుకున్న తర్వాత బెల్జియం, న్యూజిలాండ్ వంటి జట్లతో ఆడేందుకు తాను ఎంతో ఉత్సుకత చూపిస్తున్నానని ఆయన పేర్కొన్నాడు.

మలేషియా మాస్టర్స్ టోర్నీ
నిరాశపరిచిన భారత షట్లర్లు
ప్రణవ్, సిక్కిరెడ్డి పరాజయం

లూంపూర్, జనవరి 16: భారత మిక్స్‌డ్ డబుల్స్ జంట ప్రణవ్ జెర్రీ చోప్రా, ఎన్.సిక్కిరెడ్డి 350,000 అమెరిన్ డాలర్ల మలేషియా మాస్టర్స్ టోర్నీలో నిరాశపరిచారు. ఏడో సీడ్‌కు అయిన హాంకాంగ్ జంట లీ చున్ హై రెజినాల్డ్, చౌహా హూయ్ వహతో సోమవారం జరిగిన అంతర్జాతీయ పోటీలో 18-21, 27-21 తేడాతో అపజయం పాలయ్యారు. అయితే, ఇండో-మలేసియన్ జంట ప్రజక్తా సావంత్, యోగేంద్రన్ కృష్ణన్ మాత్రం మిక్స్‌డ్ డబుల్స్‌లో రెండో రౌండ్‌లోకి దూసుకెళ్లారు. వీరిద్దరూ ఆస్ట్రేలియాకు జంట సావంత్ సెర సింగే, సెత్యానా మపాసాను చాలా తేలిగ్గా ఓడించి రెండో రౌండ్‌లోకి చేరుకున్నారు.



ఆస్ట్రేలియా ఓపెన్ టెన్నిస్
రెండో రౌండ్‌లోకి షరపోవా, కెర్బర్

మెల్‌బోర్న్, జనవరి 16: ప్రపంచ మాజీ చాంపియన్లు మరియా షరపోవా, ఏంజిలీక్యూ కెర్బర్ ఆస్ట్రేలియా ఓపెన్ టెన్నిస్ టోర్నీలో రెండో రౌండ్‌లోకి ప్రవేశించారు. అయితే, మెల్‌బోర్న్‌లో వాతావరణం చాలా వేడిగా ఉండడంతో వారు రెండో రౌండ్‌లోకి వెళ్లడానికి చాలా సమయం వెచ్చించాల్సి వచ్చింది. 15 నెలల నిషేధం తర్వాత మళ్లీ రంగంలోకి దిగిన ఐదుసార్లు ప్రధాన టోర్నీల్లో విజయం సాధించిన షరపోవా మళ్లీ యధాప్రకారంగా తన సత్తా చూపేందుకు సిద్ధమైంది.

2008లో మెల్‌బోర్న్‌లో జరిగిన పోటీలో చాంపియన్‌గా అవతరించిన ఈమె ప్రస్తుతం 48వ ర్యాంకుతో ఉంది. మరో క్రీడాకారిణి, 2016లో టైటిల్ సాధించిన ప్రపంచ మాజీ నెంబర్ వన్ అయిన ఏంజిలీక్యూ కెర్బర్ మాట్లాడుతూ గతంలో జరిగిన కొన్ని పొరపాట్లకు తాను చింతించడంలేదని, ప్రస్తుతం జరుగుతున్న పోటీపైనే తన ఆటను దృష్టి సారించానని పేర్కొంది. ఇదిలావుండగా, ఆరో సీడ్ కరొలినా లిస్కోవా, ఎనిమిదో సీడ్ కరోలినా స్లోయెనా స్టీఫెన్స్, కోకో వాండెవెగ్ ఆదివారం జరిగిన పోటీలో తలపడ్డారు.

భూమిక

bhoomika@andhrabhoomi.net

ఆంధ్రభూమి

బుధవారం 17, జనవరి 2018



మన దేశంలో నృత్యం ఎంతో పవిత్రమైనది. భారతీయ సాంప్రదాయ నృత్యం పథం, గమ్యం కూడా భగవంతుని పాదాలు చేరటమే! కూచిపూడి మన తెలుగువారి మణిమయ కిరీటం. ఇది చేసేవారికి, చూసేవారికి భక్తి, ముక్తి, రక్తి లభిస్తాయి. కూచిపూడికే తరతరాలుగా అంకితమైన సంప్రదాయ కటుంబాలు ఎన్నో ఉన్నాయి. వీరికి నృత్యం ఒక తపస్సు. అటువంటి ఆణిముత్యం డా. యేలేశ్వరపు శ్రీనివాసులు. వీరు దశాబ్దాలుగా కూచిపూడికి సేవ చేస్తున్న నృత్య కౌముది. "కూచిపూడి భాగవతుల ప్రదర్శిత యక్షగానాలలో ప్రతినాయక పాత్రలు- పరిశీలన" అనే అంశంపై సిద్ధాంత వ్యాసం రాసి, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో 2016లో పిహెచ్‌డి పొందారు. సంగీతం, సాహిత్యం, నృత్యం మూడింటిలో ఎన్నో ఉన్నత శిఖరాలు చేరారు వీరు. "చిన్నప్పటినుండి కళలను నేర్చుకోవాలి. నృత్యం నేర్చుకుని, ప్రచారం చేసి, పరిశోధన చేయాలి. అప్పుడే ప్రజలకు కళాకారుల విలువ, కళల విలువ తెలుస్తుంది" అంటారు డా॥ యేలేశ్వరపు శ్రీనివాసులు.

నృత్య కౌముది

యేలేశ్వరపు వేణుగోపాల శర్మ కుమారుడైన ఈయన ఎంతోమంది వద్ద నృత్యం నేర్చుకున్నారు. డా.వెంపటి పెదసత్యం, డా.వెంపటి చినసత్యం, పద్మశ్రీ వేదాంతం సత్యనారాయణ శర్మ, నాట్యాచార్య మహంకాళి శ్రీరాములు శర్మ, నాట్యాచార్య పసుమర్తి రత్తయ్య శర్మగారి వద్ద కూచిపూడి నేర్చుకున్నారు. దాదాపు రెండు దశాబ్దాలుగా పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, శ్రీ సిద్ధేంద్రయోగి ప్రాంగణం, కూచిపూడి నృత్య విభాగంలో పనిచేస్తూ అక్కడ విద్యార్థులకు కూచిపూడి నేర్పిస్తున్నారు.

ప్రశ్న: మీకు నృత్యంలో ఎవరు సహాయం చేశారు?

జవాబు: వెంపటి చినసత్యం, వేదాంతం సత్యనారాయణ శర్మ, మహంకాళి శ్రీరామశర్మ తదితరులు నృత్యంలో చాలా ప్రోత్సహించారు.



కళాంజలి

-డా. శ్రీలేఖ కొచ్చెర్లకోట, పిహెచ్.డి

ప్రశ్న: జీవితంలో బాగా గుర్తుపెట్టుకున్న ప్రదర్శనలు ఏవి?

జవాబు: వేదాంతం సత్యనారాయణ శర్మగారు సత్యభామ, ఉష పాత్రలు వేయించారు. ఆయన నట్టువాంగం చేస్తుండగా, పాట మహంకాళి శ్రీరాముల శర్మ గారు. ఇది మనస్సుకు ఎంతో సంతోషంగా అనిపించింది- 1993, 94, 95లలో.

ప్రశ్న: విదేశాలలో మీరు పొందిన అనుభవాలు?

జవాబు: అమెరికా, ఫ్రాన్సు, కెనడా వెంపటి చినసత్యంగారితో వెళ్లాను. అప్పుడు రవికి అనుకోకుండా జ్వరం వచ్చింది. నేను వెంటనే శివుడిగా క్షీరసాగర మథనంలో చేశాను. అప్పుడు అందరూ ఎంతో మెచ్చుకున్నారు. గురువుగారి మెచ్చుకోలు రావడం ఒక మధురస్మృతి. కెనడా వెళ్ళినప్పుడు, ఒటావా, టోరంటోలో హరవిలాసం చేశాము. అప్పుడు ఒకతనికి వీసా రాలేదు. అప్పుడు నేను బ్రహ్మ, వీరభద్రుడు, మన్మథుడు అన్నీ ఒకేసారి చేశాను. గురువుగారు నన్ను ప్రోత్సహించారు. అది మనస్సుకు హత్తుకుపోయింది.

ప్రశ్న: వర్తమానంలో టీవీ, సినిమా బాగా ప్రభావితం చేస్తున్నాయి. మరి మన సంప్రదాయ కళలకు ప్రజాధారణ ఎలా?

జవాబు: ఇప్పుడు జనరేషన్‌లో మీడియా ప్రభావం బాగా ఉంది. కళాతపస్వి కళలు, కళాకారులమీద సినిమాలు తీసేవారు. సాగరసంగమం, శంకరాభరణం వచ్చినపుడు అందరూ సంగీతం నేర్చుకోవడంపై ఆసక్తి చూపేవారు. అందుకే నేడు టీవీ, సినిమాలలో కళలు బాగా ప్రోత్సాహం చేస్తే కళలు బాగా రాణిస్తాయి. మంచి సినిమాలు, టీవీ సీరియల్స్ రావాలి.

ప్రశ్న: అవార్డులు కొంతమందికే వస్తున్నాయి.. ఆర్థిక స్థోమత, రాజకీయ పలుకుబడి సహాయపడుతుంది అంటున్నారు కొందరు. మీరేమంటారు?

జవాబు: అవార్డులు ప్రతిభకి వచ్చేవి ఒప్పుడు. ఇప్పుడు అలా జరగడంలేదు. అది తప్పు. బాగా కృషి చేసి, కష్టపడి ప్రతిభ వున్నవారికి అవార్డులు రాకపోతే చాలా బాధపడాల్సిన విషయం. అలా ఉండకుండా రికమెండేషన్స్ లేకుండా కేవలం ప్రతిభని, సృజనని గుర్తించి అవార్డులు ఇవ్వాలి. అప్పుడే ఇచ్చేవారికి, పుచ్చుకునేవారికి ఆనందంగా ఉంటుంది.

పురస్కారాలు, సత్కారాలు

డా. యేలేశ్వరపు శ్రీనివాసులుఎన్నో గౌరవాలు,పురస్కారాలు, సత్కారాలు పొందారు. నిండుకుండ తొణకదు అని అంటారు. వీరు 2010లో కేంద్ర సంగీత నాటక అకాడమీ, న్యూఢిల్లీవారి బిస్మిల్లాఖాన్ యువ పురస్కారం పొందారు. నృత్యకౌముది, నృత్యరత్న అనే బిరుదులు కూడా ఉన్నాయి. దూరదర్శన్‌లో బిగ్రేడ్ కళాకారుడు. ఎన్నోసార్లు ఎస్‌విబిసి (శ్రీ వెంకటేశ్వర భక్తి చానల్‌లో) నాద నీరాజనంలో ప్రదర్శించారు.

డా.యేలేశ్వరపు శ్రీనివాసులు నృత్యంమీద ఎన్నో వ్యాసాలు ప్రచురించారు. దేశమంతటా ఎన్నో లెక్చర్ డెమాన్‌స్ట్రేషన్లు ఇచ్చారు. కేంద్రీయ విద్యాలయాలు, నవోదయ పబ్లిక్ స్కూల్స్‌లలో దాదాపు వందకుపైగా లెక్చర్ డెమాన్‌స్ట్రేషన్లు ఇచ్చారు.

దేశ విదేశాలలో ప్రదర్శనలు

2వేలకుపైగా నృత్య ప్రదర్శనలు దేశ విదేశాల్లో ఇచ్చారు. యుఎస్‌ఎలో 1994, 1998, 2000, 2008లో కూచిపూడి ప్రదర్శనలిచ్చారు. అక్కడ సిలికాన్ ఆంధ్రా ఫెస్టివల్‌లో భాగం పంచుకొని మన కీర్తి పతాకను ఎగురవేశారు. 1993లో కెనడా, 2001లో ఫ్రాన్స్, 2010లో వరల్డ్ కామన్‌వెల్త్ ఇనాగరేషన్‌లో నృత్య ప్రదర్శనలిచ్చారు. సంగీతం అంటే ఎంతో ఇష్టం. ఆట, పాట, మాట అంటే నృత్యం, సంగీతం, సాహిత్యం అన్నీ అభ్యాసం చేసి కళలకే అంకితం అయ్యారు.

కొరాపుట్

కథ

పూర్ణిమకు కొరాపుట్ ఎప్పుడొస్తుందాని వుంది. ఆమె కొరాపుట్ మీదుగా వెళ్లే హీరాఖండ్ ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణిస్తున్నది. రైలు మామూలు వేగంతోనే వెళ్తున్నా, ఎందుకో నెమ్మదిగా వెళ్తున్నట్టుగా తోచిందామెకి. ప్రశాంత్ ఆమెకు రాయగడ స్టేషన్ రాగానే మేలుకో, అక్కడ నుంచి, బయట ప్రకృతి దృశ్యాలు బాగుంటాయి, నువ్వు తప్పక చూడాలి అని చెప్పాడు. దారి కొండలూ, అడవులతో వుంది రెండువైపులా, ఆకాశ పర్యంతం. సొరంగాల లోంచి ప్రయాణం, వింతగా వుంది. రాయగడ రావడానికి ముందరే ఆమె లేచింది. గాజు కిటికీ లోంచి బయటకు చూసింది. మబ్బుగా వున్న నింగిలో కాసేపట్లో వేకువ కాబోతున్న దృశ్యం మనోహరంగా కన్పించింది. చాలామంది ప్రయాణికులు పడుకుని వున్నారు. కానీ ఆమె ఎప్పట్నుంచో మెళకువగానే వున్నది.

ఆమె కొంతకాలంగా కొరాపుట్‌కు వెళ్లాలి అనుకుంటున్నది కానీ వీలు చిక్కలేదు. ఇప్పుడు ప్రశాంత్ ఉద్యోగ రీత్యా ఇక్కడ పోస్టింగ్ రావడం వలన, ఇలా వెళ్లడం సాధ్యపడ్డది. ఆమెకు తనతో పెళ్లి నిశ్చయం అయింది. వారిమధ్య ప్రేమ ఇందుకు కారణం కాగా, వారి తల్లిదండ్రులు అంగీకరించారు. త్వరలో పెళ్లి. ప్రశాంత్ ఒడిశా స్టేట్ గవర్నమెంట్‌లో గ్రూప్ వన్ అధికారి, తనకి కొరాపుట్‌లో మూడేళ్ల కిందట పోస్టింగ్ వచ్చింది. కానీ తాను జయపూర్‌లో నివాసం వుంటున్నాడు, అందువలన కొరాపుట్ స్టేషన్ నుంచి కారు ద్వారా తీసుకువెళ్తానని చెప్పాడు. ప్రశాంత్ ఆమెకి ప్రయాణం ఎలా చేయాలన్నది ఒక డజను సార్లయినా చెప్పాడు. దాంతో ఆమెకు విసుగొచ్చింది. ఆమె ఫోన్‌లో కొరాపుట్ ఏమీ కాశ్మీర్ కాదుకదా, ఎందుకంత భయం తన భద్రతపట్ల? అని అడిగింది కూడా. ఫోన్‌లో ప్రశాంత్ కొరాపుట్ గురించి పరిసరాల గురించి చాలా చెప్పాడు. జయపూర్ కొరాపుట్ నుంచి ఇరవై రెండు కి.మీ. ఎడమవేపుకు ప్రయాణిస్తే సునబెడా కూడా అంతే దూరం. అక్కడ నుంచి పతంగి కూడా ఇరవై రెండు కి.మీ. ఏమిటీ ఇరవై రెండు విశేషం అడిగింది తను. పూర్వకాలంలో రాజులు ఏనుగుపై సవారీ వెళ్లేవారు, ఏనుగు రోజుకు ఇరవై రెండు కి.మీ ప్రయాణం చేయగలదు. రాత్రి కాగానే రాజు విశ్రాంతి కోసం ఆగేవారు. అలా ఈ జనావాసాలు ఏనుగు ఒకరోజుకు నడిచే దూరంలో ఏర్పడ్డాయి. అవే ఇప్పుడు పట్నాలుగా మారాయని వివరించాడు ప్రశాంత్.

పూర్ణిమ రైలు కిటికీ లోంచి కనిపిస్తున్న ప్రకృతి అందాలను చూస్తున్నది.. కొండల వరుస పైనంతా ఆకుపచ్చగా, అటుపై మబ్బులతో నిండి ప్రశాంతంగా వున్న ఆ ప్రాంత సహజ సౌందర్యం ఆమెనెంతగానో ఆకట్టుకున్నది. కాశ్మీర్ లాగా ఉందా అని అబ్బురపడ్డది.


కొరాపుట్ వచ్చేస్తున్నది, ప్రయాణికులు లేచి దిగడానికి సర్దుకుంటున్నారు. ఆమె కూడా దిగేందుకు సిద్ధమైంది. తల సరిచేసుకుని, ఒకసారి మొగం అద్దంలో చూసుకున్నది. వాన పడుతూనే వుంది. స్టేషన్ చిన్నదిగా, అదేదో ఇంగ్లీషు నవలలో చెప్పిన రీతిన చూడముచ్చటగా వున్నది. ఆమె దిగి ప్రశాంత్ కోసం చూసింది. ఒక యువకుడు దగ్గరగా వచ్చి అడిగాడు మీరు పూర్ణిమ మేడమ్‌గారా! పూర్ణిమ పలకరింపుగా నవ్వి "ప్రశాంత్ బిజీగా వుండి రాలేకపోయారా ఏమిటి?" అడిగింది. రాలేదు. టాక్సీ పంపించారు మీ కోసం రండి. పూర్ణిమ తన చేతి సూట్‌కేసు అతనికిచ్చి వెనుకే వెళ్లింది. బయట నిలబడి వున్న తెల్లని కార్లో కూచోపెట్టారు. నా పేరు నాగేశ్వరరావు అన్నాడతను ముందు సీటులో కూచుంటూ. కారు బయలుదేరింది. వాన పడుతూనే వున్నది. కారు కొరాపుట్ దాటాక అరగంట తర్వాత ప్రశాంత్ ఫోన్ మోగింది. ఆమె ఫోన్‌లో ప్రశాంత్ నెంబర్ చూసి గుడ్‌మార్నింగ్. నేను కారులో వున్నాను. రైలు సరిగా సమయానికి వచ్చింది. నాగేశ్వర్ నన్ను రిసీవ్ చేసుకుని కారులో తీసుకొస్తున్నారు. ఇబ్బంది ఏమీ లేదని తెలిపింది.

ఒకింత ఆందోళన ధ్వనిస్తున్న గొంతుతో ప్రశాంత్, నాగేశ్వర్ ఎవరు? నా కారు దారి మధ్యలో రిపేరు వచ్చి ఆగిపోతే, నేను రావడానికి అరగంట ఆలస్యమైంది. నేను స్టేషన్‌లో వున్నాను నీ కోసం. నువ్వెక్కడున్నావు? ఆమె జవాబు చెప్పే లోపలే, నాగేశ్వర్ ఆమె చేతిలోంచి ఫోన్ లాగేస్కొని, సారీ మిమ్మల్ని ఫోన్‌లో మాట్లాడనివ్వలేను అన్నాడు. కానీ మీరు ప్రశాంత్ నన్ను తీసుకురమ్మన్నాడని చెప్పారుకదా- లేదు. మేము మిమ్మల్ని కిడ్నాప్ చేసాం. కిడ్నాపా? పూర్ణిమను నాగేశ్వర్‌లో వచ్చిన మార్పు కలవరపెట్టింది. కానీ మీరు చెప్పింది మా మనిషి ఆ కారులో వున్నాడు. తనకి ఆ జీపు స్టేషన్‌కి రావడం ఆలస్యం చెయమని చెప్పాము. ఇక మీరు నన్ను ఏ ప్రశ్నలూ అడగకండి. మీరీ ప్రశ్నలన్నీ కాసేపట్లో కలువబోయే సిమాంచల్‌ను అడగవచ్చును.

పూర్ణిమ కారు ఆపమన్నది. నేను మీతో రాను. ఇలా మీరు నన్ను తీసుకెళ్లలేరు. నాగేశ్వర్ ఆమె వేపు ఎర్రని కళ్లతో, జేవురించిన మొగంతో చూసాడు. ఇలా మీరు అరిస్తే మిమ్మల్ని చంపేయాల్సి వుంటుంది. నిశ్శబ్దంగా వుండండి, లేదా ఏం జరిగినా దానికి బాధ్యులు మీరే. పూర్ణిమ భయంతో ఏడవసాగింది. ఆమె తనకిలాంటి పరిస్థితి ఎదురవుతుందని ఎన్నడూ అనుకోలేదు. ఆమెకు కొరాపుట్‌లో నక్సల్ సమస్య వున్నదని తెలుసు కానీ, తానే ఇలా ఎదుర్కోవలసి వస్తుందని తలపోయలేదు. ఇంతవరకూ కొరాపుట్ ప్రయాణంలో ఆమె ఆనందిస్తూ వచ్చింది. ఒక్క నిమిషంలో అంతా తారుమారైంది. కారు తన ప్రమాదకరమైన ప్రయాణం చేస్తూనే వున్నది. కాసేపటికి ఒక మట్టి రోడ్డులోకి, అలా అడవివేపు కారు తిరిగింది. తనెక్కడ వున్నానో ఆమెకు తెలీదు. చుట్టుపక్కల అన్నీ పెద్ద పెద్ద చెట్లే. ఆమెకు ఇక తన పని ముగిసినట్టే అనిపించింది. ఈ తెగించినవాళ్లు ఇక ఇక్కడ తనను తప్పకుండా చంపేస్తారని తోచింది.

మీరు చూడచక్కగా వున్నారు. అందువలన గుర్తుపట్టడం కష్టం కాలేదు. మేము ప్రశాంత్ దగ్గర మీ ఫొటో కూడా చూసాం. ఎంత నాగరికత లేకుండా మాట్లాడుతున్నాడు అనిపించిందామెకు. అతని ఉద్దేశం ఏమిటో అర్థంకాక, కిటికీ లోంచి కదలిపోతున్న చెట్లను చూస్తూ పూర్ణిమ ఒక బొమ్మలా కూచున్నది. ఇలా మనుషుల్ని ఎత్తుకపోవడం గురించి ఆమె విన్నది, సినిమాల్లో చూసింది కానీ అవన్నీ ఎంచక్కా తన ఇంటి భద్రతలోంచి చూడ్డమే తప్ప ఇలా ప్రత్యక్షంగా అనుభవానికి రాలేదు.

భయమేస్తున్నదామెకు. భయం వలనేమో ఆమెకు కారు బయటకు వెళ్లాల్సినట్టు తోచింది. అడిగింది నాగేశ్వర్‌ని- కారు ఆపితే తను బాత్రూమ్‌కి వెళ్లాలని. కారు ఆగింది. కానీ అదొక ఆరుబయలు ప్రదేశం. ఇద్దరు మొగాళ్లు కారులో వున్నారు. వారి కంటపడకుండా ఎలా? 'ఇక్కడ కాదు' అందామె చిరాగ్గా. "ఏమిటి కొరత? ఇక్కడి ఆడవాళ్లెందరో ఇలా ఆరుబయలులోనే కానిస్తారు. మీరెందుకు చేయలేరు?" అడిగిన తీరు ఆమెకు మరింత ఒళ్లు మండేలా చేసింది. అలా అయితే లోపలే కూచోండి. మనకు ఎక్కువ సమయం లేదు. ఆమె కారులో వెళ్లి కూచున్నది. చాలా ఇబ్బందిగా వుంది. కానీ మరే మార్గం లేదు. ఈ ప్రభుత్వాలు నడిపేవారు చక్కగా భువనేశ్వర్‌లో కూచున్నారు వారి సుఖం చూసుకుంటూ, ఇక్కడ ప్రజలకు ఈ ఇబ్బందులన్నీ మామూలే! అన్నాడు నాగేశ్వర్. అతని మాటల్లో నిజం వుందనిపించిందామెకు. ఐతే తననెందుకు ఇలా ఇబ్బంది పెడుతున్నారు వీళ్లు? పది నిమిషాల తర్వాత



కారు ఒక ఊరి గుడిసెముందు ఆగింది. మేడమ్ మీరిక్కడ బయలుకి వెళ్లవచ్చు. ఇంతకన్నా మంచి చోటు ఇక్కడ వుండదన్నారు వాళ్లు. ఆమె వెళ్తుంటే వెనుక వారి నవ్వులు వినిపించాయి.

ఆమె వారిని పడరాని తిట్లన్నీ తిట్టుకుంది. కానీ బయటకి వస్తుండగా చూసింది- ఇద్దరూ తనను చూసి కాదు టేకు చెట్టుపైన ఆడుతున్న ఉడతను చూసి నవ్వుతున్నారని గ్రహించింది. ఆమెకు తన తల్లిదండ్రులూ, చిన్న తమ్ముడు లితు గుర్తొచ్చారు. ఈపాటికి ప్రశాంత్ వారికి ఇక్కడ జరిగిందేమిటో చెప్పే వుంటాడు. సాయంకాలానికల్లా ఇదంతా టీవీల్లో వస్తుంది. పేపర్లో సరేసరి. ఎందుకిలాంటి దురదృష్టంలో తాను చిక్కుకున్నానా అని తనని తానే నిందించుకున్నది. నాగేశ్వర్ ఆమెకు రెండు జామకాయలు, ఒక యాపిల్ ఇచ్చాడు. తను ఒక జామకాయను వుంచుకుని ఒకటి డ్రైవర్‌కి అందించాడు. పూర్ణిమకు వాటిని విసిరిపారేద్దామన్నంత కోపం వచ్చింది. కానీ ఆమెకి నాగేశ్వర్ ఎలా రియాక్టవుతాడో అని భయం కలిగింది.

కారు ముందుకి పోతూనే వుంది ఎక్కడకో తెలీకపోయినా. ఎక్కడున్నాం మనం? అడిగిందామె. ఒడిశాలో. అదే ఒడిశాలో ఎక్కడ? దాని గురించి మీరేమీ కంగారు పడనవసరం లేదు. మనం చేరాల్సిన చోటు పది నిమిషాల్లో వచ్చేస్తుంది. కొద్దిసేపట్లో వారొక కుగ్రామం చేరారు. ఒక గుడిసెలోనికి వెళ్లగా, అక్కడ ఒక యువకుడు, ఇద్దరు యువతులున్నారు. పూర్ణిమకు రూఢి అయింది వారు నక్సల్స్ అని. నాగేశ్వర్ వారి నాయకుడు అయినా సిమాంచల్ వీరందరికీ పెద్ద. మిమ్మల్ని కిడ్నాప్ చేయడానికి మాకు రెండు కారణాలున్నాయి. ఒకటి కిడ్నాప్‌వల్ల డబ్బు, రెండోది, అవినీతిపరుడైన ప్రశాంత్‌కు ఒక గుణపాఠం నేర్పడం అన్నాడు నాగేశ్వర్.

పూర్ణిమ అరిచిందతనిపై. అతన్ని అవినీతిపరుడనే ధైర్యమా మీకు? మీరే దొంగలు, బందిపోట్లు, తీవ్రవాదులు, పైపెచ్చు అబద్ధాలు, కపటం ద్వారా ఇతరులను మీరే తప్పుగా చిత్రిస్తుంటారు. అతనంత మంచివాడిని మీరెలా అవినీతిపరుడిగా మాట్లాడుతున్నారు, మీకు తెలుసా? తన డాక్టర్ జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ నుంచి, అది కూడా గాంధీ ఆదర్శాల మీద. ఆమాటలకు నవ్వేశాడు నాగేశ్వర్, ఆమె అమాయకురాలనే అర్థం తెలిసేలా. గాంధీయా? ఆ విషయం మర్చిపోవచ్చును. మీరీ ఇంట్లో ఉండవచ్చును. మాకు డబ్బు అందగానే మిమ్మల్ని మెయిన్ రోడ్డు దగ్గర్లో దించేస్తాము. మీరీ గ్రామంలో అటూ ఇటూ తిరగవచ్చు కూడా. కానీ మమ్మల్ని మోసం చేయాలని ప్రయత్నం చేయవద్దు, దానికి ఫలితం తీవ్రంగా వుంటుంది అన్నాడు నాగేశ్వర్ స్పష్టంగా, కటువుగా.

మీరు నన్ను చంపేస్తారా? అడిగింది. 'అవును'.

ఒకవేళ డబ్బు రాకపోతేనో? అప్పుడు కూడా చంపేస్తాము. రోజూ ఎందరో చనిపోతూ వుంటారు. అదొక సాధారణ విషయం.

పూర్ణిమకు భయంతో చెమటలు పోశాయి. వీళ్లకి చంపడం అంటే ఏమీ కాదు.

ఎంత డబ్బు అడిగారు? అది నేను మీకు చెప్పలేను.

నాగేశ్వర్ సంభాషణ అంతటితో ఆపుచేసాడు. ఆ ఇద్దరు యువతులను పిలిచాడు, వారికి కొన్ని జాగ్రత్తలు చెప్పి వెళ్లిపోయాడు తన రైఫిల్ భుజాన తగిలించుకుంటూ.

ఇక ఆ గుడిసెలో మిగిలింది పూర్ణిమ. ఆమెతోపాటు ఇద్దరు యువతులే. ఆమె రెండు చేతుల్లో మొగం దాచుకుని ఏడ్వనారంభించింది. ఇక తనకు చావు తప్పదని ఆమెకు తోచింది. ఎందుకంటే ఇక్కడనుంచి ఈ గ్యాంగ్ సభ్యుల నుంచి తప్పించుకుపోవడం సాధ్యంకానిపని. వీళ్లు అడిగిన డబ్బు ఎంతో కూడా ఆమెకు తెలీదు. ఈవార్త విని ఆమె తల్లిదండ్రులెంతగా దిగ్భ్రాంతి చెందుతారో ఆమెకు తలచుకుంటేనే ఆందోళనగా వున్నది. తండ్రి గోడకు తల కొట్టుకుని ఏడిస్తే, ఇక తల్లి అయితే జగన్నాథస్వామిని తలుచుకుని సకల విధాలా ప్రార్థనలు చేస్తుంది. కాసేపు గుడిసెలో కూచుంటే ఆలోచనలు మళ్లుతాయని ఆమె ఆ గుడిసెలోకి వెళ్లింది. ఆ యువతులిద్దరూ కూడా ఆమె వెంటే లోపలికి అనుసరించారు. ఆ కుగ్రామపు మురికి, అశుభ్రత, ఆమెకు దిక్కు తోచనివ్వడంలేదు. దారి నిండా పేడ, కోసేసిన కోళ్ల ఈకలూ, గుడ్ల పెంకులూ చెల్లాచెదురుగా పడి వున్నాయి. అక్కడే మూడు పందులు తిరుగాడుతున్నాయి బురదలో ఏదన్నా తినడానికి వెదుక్కుంటూ. ఆమెకు రోత పుట్టి వాంతి వచ్చింది.

ఆమెకు దాహంగా అనిపించి ఆ యువతులకు సైగ చేసింది. వారిలో చిన్నది పరుగున వెళ్లి ఒక విరిగిపోయిన మగ్గులో నీళ్లు తెచ్చింది. ఇంతలో నాగేశ్వర్ గబుక్కున లోనికొచ్చి ఆ మగ్గు పక్కనపడేసి, ఆమెకు మినరల్ వాటర్ సీసా అందజేసాడు. ఊరంతా డయేరియాతో నిండివున్నది, ఈమెకు మనం ఏదన్నా ఇచ్చేటపుడు జాగ్రత్తగా వుండాలని ఆ యువతులపై కేకలేశాడు. అది చూసిన పూర్ణిమకు, ఈ నాగేశ్వర్ తాను అనుకున్నంత చెడ్డవాడు కాదేమో అనిపించింది. దగ్గర్లో ఒక మహిళ ఏడుస్తున్న శబ్దం. పందులు కోళ్లూ కలకలంగా పరిగెడుతున్నాయి. నాగేశ్వర్ ఆమెను గుడిసెలోనికి వెళ్లిపొమ్మని సూచించాడు.

ఇద్దరు యువతులు ఆమెకు తెలీని భాషలో మాట్లాడుకుంటున్నారు. ఏదో పరిణామం జరిగిందని ఆమె గ్రహించింది. దాంతోనే ఆమెకు ఆశ కూడా కలిగింది. పోలీసులు ఎవరినన్నా అరెస్టు చేసారా లేక వారి కస్టడీలో ఎవరన్నా చనిపోయారా ఏదో జరిగి వుండవచ్చు అని తోచిందామెకు. ఏమన్నా కానీ, వీరి పనులకు తగ్గట్టే జరిగివుంటుందని కూడా ఆమె మనసులో అనిపించింది.

ఆమె అడిగింది ఆ ఇద్దరు కాపలా యువతుల్ని ఏం జరిగింది? ఎందుకు ఏడుస్తున్నారు వాళ్లు?

చిన్న యువతి తెలిపింది. నిన్న ఇద్దరు అమ్మాయిలు డయేరియా బారినపడ్డారు. వారిని ఆసుపత్రికి తీసుకుని వెళ్లారు వారి తండ్రి, మామయ్య.

ఏ ఊర్లో ఆసుపత్రికి? అడిగింది పూర్ణిమ సహజంగా ఆదుర్దాగా. కానీ ఊరి పేరు చెప్పనియ్యకుండా, వయసులో పెద్దయిన కాపలా యువతి అడ్డుపడింది. ఊరి పేర్లు ఎందుకులెండి, ఇది మీ విషయం కాదు అని తోసిపుచ్చింది. వాళ్లింకా ఆసుపత్రినుంచి రాలేదు, ఇక్కడ తల్లి చనిపోయింది. అందుకే గ్రామస్తులు ఏడుస్తున్నారని చెప్పింది. పూర్ణిమ ఈ మారుమూల గ్రామాల్లో ఆటవిక గూడేల్లో జీవనం ఎంత దుర్భరంగా వుంటుందో చదివింది. అంటురోగాలవల్ల ఎలా వీరు ఎక్కువ సంఖ్యలో కన్నుమూస్తుంటారో కూడా ఆమెకు తెలుసు. ఆమెకు ఎప్పుడూ వీరి దురవస్థ గురించి మాట్లాడే తన స్నేహితురాలు సాధన గుర్తుకొచ్చింది. సాధన, వీరి జీవన స్థితిగతులపై డాక్టరేట్ చేస్తున్నది. ఆమె చెప్పగా విన్నప్పుడు ఇవే సంగతులు ఆమెకు విసుగ్గా తోచాయి. వీటికి బదులుగా ఆసక్తికరమైన వీరి సంస్కృతి, అలవాట్లు వారి ఆటపాటలూ గురించి చెప్పమని అప్పట్లో సాధనను అడిగింది కూడా.

ఒకతను చేత్తో కోడిపెట్టను పట్టుకుని తూలుతూ నడుస్తున్నాడు. తాగి వున్నాడేమో. చిన్న యువతి చెప్పింది- తాను ఆ కోడిపెట్టను దేవతకు బలివ్వడానికి తీసుకెళుతున్నాడని. ఈ మారుమూల ప్రాంతల జీవితపు కష్టాలు చుట్టూ వున్న ప్రకృతి అందాలను మించివుంటాయి. ఎక్కడా ఒక్క కాంక్రీటు భవనం లేదు. మూడు పక్కలా కొండలు, ఒక దిశగా ఒక మట్టిదారి అదే బహుశ బయట ప్రపంచానికి వెళ్లే సాధనం. విషయం మార్చి ఆమె కాస్త పెద్దగా వున్న ఆ కాపలా యువతిని అడిగింది. స్కూల్‌కు వెళ్లి చదువుకున్నావా? సమాధానం చిన్న పిల్ల చెప్పింది. తాను స్కూల్‌కు వెళ్లి చదువుకోవాలన్నా, తండ్రికి ఎక్కడ ఆ మాస్టారు ఈమెను ఎత్తుకుపోతాడో అని భయం. అందుకే స్కూల్‌కి పంపలేదు. ఇద్దరూ తమలో తాము నవ్వుకున్నారు కానీ పూర్ణిమ ఎందుకో వారితో తన మనస్థితివల్ల నవ్వు కలపలేకపోయింది.

ప్రశాంత్ ఆదర్శాలకి నిలబడేవాడు కనుక వీరు అడిగిన కిడ్నాప్ డబ్బు ముట్టజెప్పడు అనుకుంది. ఇక తన తల్లిదండ్రులకు తమ ఇల్లు అమ్మి ఈ డబ్బు తేవాలేమో, కానీ అందుకు అంత సమయం ఎక్కడ వున్నది? ఇదంతా చివరికి ఏమవుతుందో తెలీక ఆమెలో భయం పెరిగింది. ఇక్కడే తన బతుకు ముగిసిపోతుందేమో అన్న బెంగ ఏర్పడ్డది. తిరిగి గుడిసెలోనికి వచ్చారు. బయట మధ్యాహ్నం ఎండ మండిపోతున్నది. చిన్న దీపం వెలుగుతోంది లోపల. అందులో చమురు కూడా కాసేపట్లో అయిపోవచ్చు. లోపలంతా దోమలు జుమ్మంటున్నాయి. తన సంచి తలకింద పెట్టుకు పడుకున్నది ఒళ్లంతా అలసటగా అనిపించగా.

ఎవరో తలుపు తడుతున్న శబ్దం రాగా, గబుక్కున లేచింది. చీర సవరించుకున్నది. ఆమెకు చనిపోవాలని లేదు. ఆమెకు పెద్దగా ఏడవాలనిపించింది.

వారిలో పెద్ద యువతి లేచి తలుపు తీసింది. నాగేశ్వర్ మరొక యువకుడితో కలిసి లోనికొచ్చాడు. పూర్ణిమ వేపు చూస్తూ అన్నాడు పదండి, ఇక్కడ నుంచి వెళ్లిపోదాము. ఎక్కడికి అడిగిందామె. అది నేను మీకు చెప్పలేను. ముందు పదండి అన్నాడు ఒత్తిడి చేస్తూ. నాకు నడిచే ఓపిక లేదింక అన్నది ఆమె నీరసంగా. అలా అయితే నేను మిమ్మల్ని ఎత్తుకుని తీసుకువెళ్లాల్సి వుంటుంది అన్నాడతను పట్టుదలగా. ఇడియట్- తనలో తానే తిట్టుకుని ఆమె గత్యంతరం లేక వారిని అనుసరించి వెళ్లింది. ఒక గంటపాటు నడిచాక ఒక నది ఒడ్డుకు వచ్చారు. తాము ఎక్కడికి వెళ్తున్నదీ, ఏమీ తెలీడంలేదు.

ఒక పాతగిల్లిన పడవలో వాళ్ళు ఆమెను నది ఆవలవైపునకు తీసుకెళ్లారు. మళ్లా నడక మొదలైంది. ఆమె వారి వెంటే వెళ్లక తప్పని పరిస్థితి. పాదాలు ఇక నడవమని మొరాయిస్తున్నాయి. అంత దూరాన నల్లగా తారు రోడ్డు కనిపించింది. ఒక ట్రక్ వెళ్తున్న శబ్దం కూడా. నాగేశ్వర్ ఆమె వేపు తిరిగి కొంతదూరం నడిచాక రోడ్ వస్తుంది. అక్కడ మీరు వెయిట్ చేయండి. బిడివో జీప్ వచ్చి మిమ్మల్ని తీసుకువెళ్తారు అన్నారు. ఆమె తన చెవులను తానే నమ్మలేకపోయింది. ఆమె ఒకే క్షణంలో బరువు తీరినట్టూ, ఆనందంగానూ తోచింది. ఉదయం నుంచి పడ్డ పాట్లన్నీ మర్చిపోయింది. ఒకవేళ వెళ్తుంటే వెనుక నుంచి కాల్చేస్తారేమో అన్న భయం కలిగింది. నిజమా, నేనింక వెళ్లిపోవచ్చునా? అడిగింది సందేహం తీరనట్టుగా. అవును, మాకు కావలసిన సొమ్ము అందింది తెలిపాడతను. ఆమె ఒక్కసారిగా బరువు దిగిపోయినట్టుగా నిట్టూర్చింది. చల్లని గాలి తాకింది ఆమె మొగాన విసురుగా. అయినా ఆ గాలి సేద తీరుస్తున్నట్టే తోచింది ఆమెకు. నాగేశ్వర్ ఆమెకు ఒక టార్చ లైట్ ఇచ్చాడు. రోడ్ చేరాక, ఈ టార్చ్ వెలిగించి ముమ్మారు కుడి పక్కగా ఊపండి. జీప్ వచ్చి మిమ్మల్ని తీసుకువెళ్తుంది. ఆమె ఆ టార్చ్ వెలిగించి అతని మొగంమీద వేయబోయింది. తనకూడా వచ్చిన యువకుడు, యువతితో కలిసి వెనక్కు వెళ్లిపోయాడు. తారు రోడ్ చేరటానికి ఆమెకు అరగంట పైగానే పట్టింది. అక్కడ ఒక్క క్షణం తన అలసట తగ్గేందుకు కూచుని, టార్చ్ వెలుగు కుడివేపునకు మూడుమాట్లు చూపింది. నిమిషాల్లో జీప్ వచ్చింది. ఆమెకు ఇంకా భయంగానే వున్నది. అప్పుడు ఆమెకు జీప్‌లో కూచుని వున్న ప్రశాంత్ కన్పించాడు. ఆమె పరుగున వెళ్లి తన భుజంపై తల వాల్చింది చిన్నపిల్లలా. ఇప్పుడిక ఏ భయం లేదు. సర్దుకో.. స్థిమితపడు, వాళ్ళు అసలు నీకే హానీ చేసి ఉండేవారు కారు అన్నాడు ప్రశాంత్. వాళ్ళు నన్ను చంపేస్తామన్నారు అందామె కంపిస్తున్న స్వరంతో. ఏంకాదు. వారికి కావలసిన సొమ్ము అయిదు లక్షలు తీసుకెళ్లారు. డబ్బే వారికి కావాలి తప్ప నీకు హాని చేయడం కాదు. అయిదు లక్షలా? అంత డబ్బు ఎలా వచ్చింది నీకు? ప్రశాంత్ జవాబివ్వలేదు. చెప్పు ప్రశాంత్, ఎక్కడనుంచి వచ్చింది అంత డబ్బు ఉన్నట్టుండి? వారికి కావాలసిన డబ్బు వారికి అందింది. ఆ విషయంలో నువ్వేమీ కంగారు పడకు. ఈ ఏరియాలో అడ్మినిస్ట్రేటర్లుగా పనిచేసే మేము ఒక్కొక్కరం పది కోట్ల విలువ చేస్తాము అన్నాడు ప్రశాంత్- ఒకింత అహమూ, అధికారమూ నిండిన స్వరంతో. వారు జీప్ ఎక్కారు, ముందుకు కదలి వెళ్తుండగా, పూర్ణిమకు ఎందుకో విచారంగా అనిపించింది. తాను ప్రశాంత్ నీతివంతుడు అని చెప్తుండగా, నాగేశ్వర్ నవ్విన నవ్వు మనసులో మెదిలింది. నాగేశ్వర్ చెప్పిందే కరెక్ట్. ఏం జరిగింది, ఎందుకలా మౌనంగా ఉన్నావు అడిగాడు ప్రశాంత్. పూర్ణిమ జవాబు చెప్పలేదు. వారి బందీగా ఉండిపోయినా బాగుండిపోయేది, కనీసం తనకు ప్రశాంత్ నిజస్వరూపం తెలుసుకునే అవసరం తప్పేది, అనుకుందామె.

-గౌర హరిదాస్ (ఒడియా మూలం)

- రామతీర్థ (తెలుగు సేత)

(ఇరవై రెండేళ్లుగా తెలుగు కథ రచయితలకు విజయనగరంలో చాగంటి తులసి నిర్వహణలో చాసో స్ఫూర్తి పురస్కారం ప్రదానం చేస్తున్నారు. ఈ ఏడాది తొలిసారిగా తెలుగేతర కథ సాహిత్యవేత్త, గౌర హరిదాస్, ఒరియా రచయితకు, జనవరి 17న ప్రదానం చేశారు.)



వ్యూహం

21 **అలపర్తి రామకృష్ణ**

తిరువూరు వెళ్ళాడు. అక్కడ అతని అమ్మమ్మ ఉంది. ఆమెకు ఎనభైయ్యేళ్ళు. కళ్ళు సరిగ్గా కన్పించవ్.. వినబడదు కూడా.. కొడుకులు ముగ్గురూ ఎక్కడో దూరంగా వుంటున్నారు, చిన్న చిన్న వ్యాపారాలు చేసుకుంటూ. ఒకటే కూతురు. ఆమె చనిపోయి ఐదేళ్ళు అవుతూ వుంది. ఆమె కొడుకే శేషగిరి.

మనవడిని గుర్తుపట్టింది చూపు సరిగ్గా ఆనకపోయినా.

''మీ అమ్మ చనిపోయినప్పుడు రాలేదేం?'' అడిగిందామె.

ఎక్కడొస్తాడు? జైల్లో వుంటే..

అక్కడ కూడా ఓ సమస్య వచ్చిపడింది.

ఆ ముసలావిడ పేరుమీద పెంకుటిల్లు, ఎకరం పొలం వున్నాయి. అవి అమ్మేయాలని ఆమె కొడుకుల ప్రయత్నం... ''నా తదనంతరం మీకే కదా ఆ ఆస్తి వచ్చేది.. చివరి రోజుల్లో నన్ను ఇబ్బంది పెట్టకండి.. ఇల్లు, పొలం లేకపోతే నేను ఎలా బ్రతికేది.. ఎవడి పంచలోనో చేరి చివరి రోజులు గడపాల్సిన అవసరం నాకు.. నేను ఇక్కడ మట్టిలో కలిసిపోవాలి.. మీ ఇళ్ళకు రాను!'' అందామె.

''మేం చేస్తున్నవి చిన్న చిన్న వ్యాపారాలు.. పెట్టుబడి పెడితే ఇంకా బాగా లాభాలు వస్తాయి.. ఇప్పుడు ఆస్తి అమ్మి ఆ డబ్బు మాకిస్తే మేం నిలదొక్కుకుంటాం. మాకు రోగాలు వచ్చి ఆసుపత్రుల చుట్టూ తిరుగుతున్నాం గాని, నువ్వు మాత్రం గుండ్రాయిలా గట్టిగానే వున్నావ్.. నీ కళ్ళముందే మేమే ఎప్పుడో గుటుక్కుమంటాం!'' అన్నాడు ఆమె చిన్నకొడుకు.

''అవేం మాటలురా! సర్లే అమ్ముకోండి'' ముసలమ్మ మెత్తబడిపోయి అంది.


శేషగిరి అడ్డుపడ్డాడు.

''ఏవో మాయమాటలు చెప్పి ఆస్తి అమ్మేసి సొమ్ము ఎగరేసుకుపోదాం అనుకుని ప్లాను వేస్తున్నారు. ఆ తరువాత మీ అమ్మని గుమ్మం తొక్కనివ్వరు.. గంజి కూడా పొయ్యరు.. మీ ముగ్గురితోపాటు నాక్కూడా ఈ ఆస్తిలో హక్కు వుంది. మా అమ్మక్కూడా వాటా వుంటుంది కదా! నా ఇష్టం లేకుండా మీరు పొలం, ఇల్లు అమ్ముకోలేరు.. నా సంతకం కావాలి, ఆస్తి మరొకరి పేర రిజిస్టర్ కావాలంటే!'' మేనమామలకు ఎదురుతిరిగాడు.

''ఇదెక్కడి పితలాటకం.. మీ అమ్మ బ్రతికి వున్నప్పుడు ఒక్క రోజు కూడా వచ్చి పలకరించలేదు.. ఆమె బ్రతికివుందో చనిపోయిందో పట్టించుకోనివాడికి ఇప్పుడు అమ్మమ్మకు వత్తాసు పలుకున్నావా?''

మాటల యుద్ధం తరువాత నెత్తురు కారేదాకా కొట్టుకున్నారు. పోలీసు స్టేషన్, కోర్టులు చుట్టూ తిరిగారు. ఊళ్ళో వాళ్ళు ముసలమ్మ తరపున మాట్లాడిన శేషగిరికి మద్దతు ఇచ్చారు.

కోర్టులు, పోలీసు స్టేషన్లు శేషగిరికి కొత్తేమీ కాదు. మేనమామలే బెంబేలు ఎత్తిపోయారు.



రాజీకి వచ్చారు. తిరువూరు మిల్క్ ప్రొడక్ట్స్‌లో చిన్న ఉద్యోగం సంపాదించాడు శేషగిరి. రెండు సంవత్సరాలు గడిచిపోయాయి.

ముసలమ్మ చనిపోవడం, మిల్క్ ప్రాజెక్టులోని ఉద్యోగం ఊడిపోవడం ఒక్కసారే జరిగాయి. ఇక అక్కడ ఉండబుద్ధి కాలేదు. అమ్మమ్మ ఆస్తిలో భాగం కోసం ప్రాకులాడకుండా భద్రాచలం వెళ్ళిపోవాలని నిశ్చయించుకున్నాడు.

రోడ్డుమీదకు వచ్చాడు రెండ్రోజులనుంచి తిండి తినడంలేదు. ఎంతో ఆప్యాయంగా వున్న అమ్మమ్మ చనిపోవడం అతన్ని కుదిపేసింది. చివరి దశలో ఆమెకు సేవ చేస్తుంటే ఆమె అన్న మాటలు గుర్తుకొచ్చాయి.

నామీద ప్రేమతోగాని, ఆస్తికోసం నువ్వు నా దగ్గరకు రాలేదని నాకు తెలుసు.. మీ అమ్మను చూడటానిక్కూడా వచ్చేవాడివి కాదు. మేం ఎలా వున్నామో ఎప్పుడూ పట్టించుకోలేదు. జీవితం నీకు ఏవో పాఠాలు నేర్పి వుంటుంది. నీ తప్పుల్ని తెలుసుకున్నావ్. చేసిన పాపాలు కడిగేసుకోవడానికి మళ్లీ నా దగ్గరకు తిరిగి వచ్చావ్.. మంచంమీద నుంచి లేవలేని స్థితిలో నేను వుంటే పసిబిడ్డను సాకుతున్నట్లు నాకు సేవలు చేస్తున్నారు. నీకు మంచి బుద్ధి వచ్చింది. నీకు మంచి రోజులు తప్పకుండా వస్తాయి నీకు దూరం అయినవాళ్ళంతా నీ చెంతకు చేరుతారు'' చనిపోయే ముందు దీవిస్తూ అన్నాడు శేషగిరి తండ్రి.

శేషగిరి నిలబడ్డ చోటికి ఓ కారు వచ్చి ఆగింది.

''భద్రాచలం వైపు వెళ్తున్నాం.. లిఫ్ట్ ఇస్తాం.. కారు ఎక్కు'' అన్నాడు కారులోని వ్యక్తి డోర్ తెరుస్తూ.

ఆకలితో నకనకలాడుతున్నాడు శేషగిరి అప్పటికే. కళ్ళు బైర్లు కమ్ముతున్నాయి, మరో ఆలోచన లేకుండా కారు ఎక్కాడు.

''తినడానికి ఏమన్నా వున్నాయా? ఆకలి వేస్తోంది'' అడిగాడు శేషగిరి.

కార్లో వున్న ముగ్గురు వ్యక్తులకు ఒళ్ళు మండింది. అతన్ని కారు ఎక్కించుకుని అతని దగ్గర ఉన్న డబ్బు కాజేయ్యాలని వాళ్ళ ఆలోచన. వెనుక సీట్లో కూర్చున్న తను శేషగిరి మీద పడి జేబులన్నీ వెతికాడు. రూపాయి బిళ్ళ కూడా దొరకలేదు. మెళ్ళో గోల్డ్ చైన్ కానీ, కనీసం చేతికి వాచి గాని కన్పించలేదు.

''వీడెవడో నిష్ట దరిద్రుడిలా వున్నాడు.. కారు ఆపు బయటకు తోసేద్దాం'' అన్నాడతను కారు నడిపే వ్యక్తితో.

శేషగిరిని రోడ్డుమీదకు నెట్టేసి వెళ్లిపోయారు వాళ్ళు.

రోడ్డుమీద పడిపోయిన అతన్ని ఎవరో హాస్పిటల్లో చేర్చారు. మంచి ఉద్దేశ్యంతో కాదు.. శేషగిరి కిడ్నీ అమ్మేయాలనే ఉద్దేశ్యంతో హాస్పిటల్లో చేర్పించాడు.

హాస్పిటల్‌లో కూతురు కన్పించడంతో శేషగిరి ఆనందానికి అవధులు లేవు. బాధలన్నీ మర్చిపోయాడు.

:::

కాశి దగ్గరకు వెళ్లింది లోహిత.

''ఈ రోజు ఓ విచిత్రం జరిగింది.. జీవితంలో మళ్లీ చూడలేనేమో అనుకున్న వ్యక్తి కన్పించాడు.. ఎంతో సంతోషంగా వుంది నాకు'' అంది లోహిత.

రెండు కొబ్బరి బోండాలు తెప్పించాడు కాశి.

లోహిత వచ్చి ఎదురుగా కూర్చుంటే అతనికి ఎంతో సంతోషంగా వుంటుంది. మనస్సులోని అలజడి క్షణాల్లో మటుమాయమవుతుంది.

నేను కూడా మీకు ఓ విచిత్రమైన సంఘటన చెబుతాను. చనిపోయాడనుకున్న వ్యక్తిని డాక్టర్ అరవింద్‌గారి రూములో చూశాను'' అన్నాడు కాశి.

- ఇంకా ఉంది

మంచిమాట

ప్రసాదం

భగవంతుని సృష్టిలో పనికిరానదంటూ ఏదీ ఉండదు. సూక్ష్మం నుండి స్థూలం వరకు వున్న ప్రతి ప్రాణి పరమాత్మ సృష్టిలోని భాగమే. చెట్టు చేమ, కొండ కోన, నదులు, సముద్రాలు, సూర్యచంద్రులు, గ్రహ నక్షత్రాలు- ఇలా జగత్తులోని అణువణువు దేవుని సంకల్పమాత్రంతో సృష్టింపబడినవే. సర్వజీవుల జీవనానికి అనుగుణంగా సృష్టికర్త ఏర్పరచిన ఒక ప్రణాళికాబద్ధమైన ప్రసాదమే ఈ ప్రకృతి. ఇన్ని సౌకర్యాలను మనకోసం అమర్చి అందించిన ఆ దైవానికి కృతజ్ఞతాభావంతో మనం చేసేదే పూజ లేక అర్చన. పూజలో భాగంగా భగవంతునికి మనం సమర్పించే పండ్లు, పదార్థాలు ప్రసాదంగా మనం స్వీకరిస్తాము.

దైవానికి నివేదించక ముందు పదార్థం- నివేదించిన తరువాత అది ప్రసాదం అవుతుంది. నివేదన చేసినపుడు కేవలం భగవంతుని చూపు పడినంతమాత్రాన ఆ ప్రసాదానికి ఎంతో మాధుర్యం, పవిత్రత, మహత్తు సిద్ధిస్తాయి. భగవంతుని చూపు పడిన తరువాత పువ్వయినా, పండయినా, అన్నమైనా అన్నీ ప్రసాదాలే. దేనినీ నిర్లక్ష్యం చేయకూడదు. దేవునికి సమర్పించిన పూలమాలను ఇంద్రునికి ఇవ్వగా అతడు దానిని నిర్లక్ష్యం చేసినందులన తన పదవిని పోగొట్టుకోవలసి వచ్చింది. అన్నవరం సత్యనారాయణ స్వామి ప్రసాదం ఎంతో మహిమాన్వితమైనది. వ్రత కథలో ప్రసాదాన్ని తీసుకోకుండా వెళ్లిన లీలావతి కుటుంబం కష్టాలపాలవుతుంది. అలాగే ఒక రాజుకూడా ప్రసాదాన్ని తిరస్కరించినందుకు ఎన్నో ఇక్కట్లకు లోనుకావలసి వస్తుంది. సత్యనారాయణవ్రతం చేసుకున్న వారెవరైనా ప్రసాదాన్ని బంధు, మిత్రులకు అందరికీ అందజేసి ఆ సత్యదేవుని అనుగ్రహానికి పాత్రులవుతుంటారు.

తిరుపతిలో శ్రీ వెంకటేశ్వరస్వామికి నివేదించిన లడ్డు ప్రసాదం ఎంతో ప్రఖ్యాతి వహించింది. లడ్డు మాత్రమే కాక వడలు, పాయసాలు, జిలేబీలు, అట్లు రకరకాల ప్రసాదాలు ఎంతో శుచిగా, రుచిగా తయారుచేసి శ్రీనివాసునికి కైంకర్యం చేయటం విశేషం. తిరుపతి వెళ్లివచ్చినవారు లడ్డు, వడ ప్రసాదాలను అందరికీ పంచిపెట్టడం ఒక ఆనవాయితీ. మరో ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన పూరీ జగన్నాథుని ప్రసాదం కూడా అత్యంత ప్రాముఖ్యత కలిగివున్నది. అక్కడ నివేదించిన అన్న ప్రసాదాన్ని ఎటువంటి భేదభావం చూపకుండా సర్వులూ భక్తిశ్రద్ధతో స్వీకరించటం జగద్విదితం. అందుకే 'సర్వం జగన్నాథం' అనేమాట వచ్చింది. శ్రీకృష్ణునికి వెన్న అంటే ఇష్టంకనుక కృష్ణమందిరాలలో వెన్నతోపాటు ఎన్నో రకాలైన మధుర పదార్థాలను తయారుచేసి లెక్కకు మిక్కిలిగా ఆరగింపు చేస్తారు. ఆ ప్రసాదాలను భక్తులందరూ ఎంతో ప్రీతితో ఆరగిస్తారు.

శిరిడీ సాయిబాబా మసీదులో ధుని ఏర్పాటుచేసి దాని నుండి వచ్చిన విబూదినే ప్రసాదంగా అందరికీ పంచిపెట్టేవారు. ఎందరో దీనులు, రోగులు బాబా వద్దకు వచ్చి తమ బాధలను చెప్పుకునేవారు. బాబా అందరికీ ఊదినే ఇచ్చి వారిని రోగాలనుండి, బాధలనుండి విముక్తి చేసేవారు. నేటికీ సాయి ఆలయాలలో ఊదీనే అత్యంత పవిత్రమైనదిగా భావించి భక్తులు స్వీకరిస్తున్నారు. స్వస్థతను పొందుతున్నారు. ఒక్కొక్క దేవునికి ఒక్కొక్క ప్రసాదం ప్రీతికరం అని భావించి ఆ విధంగానే సమర్పిస్తూ వుంటారు. వినాయకునికి ఉండ్రాళ్ళు, అమ్మవారికి పులిహోర, పాయసం, శ్రీకృష్ణుని వెన్న మీగడలు, వెంకటేశ్వరస్వామికి లడ్డూలు, సత్యనారాయణ స్వామికి రవ్వ ప్రసాదం, సూర్యభగవానునికి ఆవుపాలతో చేసిన మెత్తని పాయసం, శిరిడీ సాయిబాబాకు పాలకోవా, కలకండ, రొట్టెలు మొదలైనవి. ఆంజనేయస్వామికి అప్పాలు, శ్రీరామచంద్రునికి పానకం, వడపప్పు- ఇలా ప్రత్యేకంగా నివేదించటంతోపాటు పండుగల సందర్భాలలో అందరు దేవుళ్ళకు పంచభక్ష్య పరమాన్నాలు నివేదించి ప్రసాదాన్ని అందరూ భక్తితో స్వీకరిస్తారు.

ఏ దేవునికైనా ఎక్కువగా కొబ్బరికాయను కొట్టి నైవేద్యంగా పెడుతూంటారు. అరటిపళ్ళతో పాటు ఇంకా ఆయా కాలాలలో లభించే ఇతర ఫలాలను కూడా ముందుగా దేవునికి నివేదన చేసిన తరువాతనే తాము తినటం అనే నియమాన్ని కొందరు పాటిస్తూ వుంటారు. ధనుర్మాసం నెల రోజులు వైష్ణవాలయాలలో తెలతెలవారకముందే పులిహోర, చక్కెర పొంగలి, దధ్యోజనం, రవ్వకేసరి, పాయసం ఇలా రొజుకొక రకంగా భగవంతునికి కైంకర్యాలు జరుగుతూ వుంటాయి. ప్రత్యేకంగా తయారుచేయబడే ఈ ప్రసాదాలు ఎంతో రుచిగా ఉండి భక్తులు విశేషంగా ఇష్టపడేలా చేస్తాయి.

- అబ్బరాజు జయలక్ష్మి

యాజ్ఞసేని



- త్రోవగుంట వేంకట సుబ్రహ్మణ్యము 13

స్వయంవరాన్ని తప్పక ప్రకటించి పాండవులు బయల్వెడలేటట్లు చేయాలి అని అన్నాడు.

తన తనయ పడుతున్న వేదను ద్రుపదుడు కూడా గమనించాడు. ద్రౌపది గొప్ప ధైర్యవంతురాలు, దృఢచిత్తురాలు అనే గొప్ప నమ్మకం ద్రుపదుడికి. తామిప్పుడు ఒక కఠినమైన పరీక్షను ఎదుర్కొంటున్నారు. తను పడ్డ కష్టం ఎట్లా వృథా కాగలదు. తన లక్ష్యం లక్ష్యంగానే ఉండగూడదు. పాండవుల ఉనికిని తెలిసికొంటానికి చేసే ప్రయత్నాన్ని విరమించ గూడదు. ఆ ప్రయత్నంలోనే స్వయంవరాన్ని ప్రకటించటం ఒక భాగం కావాలి. అలా చేస్తే ద్రౌపదిని ఆశిస్తున్న కొన్ని దేశాల రాజకుమారుల ఆశలను కొంతవరకు అడ్డుకొనవచ్చును. స్వయంవరానికి పాండవులు వచ్చి అర్జునుడు పాంచాలిని చేబడితే తన కోరిక నెరవేరిట్లే అని ఆలోచిస్తున్న ద్రుపదుడు ఒక్కసారిగా ఏ జ్ఞప్తి కొచ్చి దృష్టద్యుమ్నుడిని చూచి-

దృష్టద్యుమ్నా! శ్రీకృష్ణవాసుదేవుడిని ఒకసారి కలిసి మాట్లాడాలి. యాదవులకు ఆరాధ్యదైవమని వింటున్నాము. గొప్ప రాజనీతిజ్ఞుడని కూడా అంటున్నారు. అతడు చేసిన అనేక అద్భుతాలను గురించి ప్రజలు కథలు చెప్పుకొనడం వింటున్నాము. ప్రయత్నించి ఆ శ్రీకృష్ణ వాసుదేవుడిని ఇక్కడికి వచ్చేటట్లుగా చేయాలి. ఆ పనిని ఎలా సాధిస్తావో ఆలోచించు. గురుదేవుడు సాందీపాని వారి సహాయాన్ని అర్థించుము. వెంటనే బయలుదేరుము అని కోరాడు ద్రుపదుడు.

దృష్టద్యుమ్నుడు తండ్రి ఆజ్ఞతో అక్కడినుంచి నిష్క్రమించాడు.

9



ద్రుపద మహారాజు రాజభవనంపైన నిలబడి చూస్తున్నాడు.

అటూ నిటూ తిరుగుతూ ఆవేదనతో నిట్టూర్పులు విడుస్తున్నాడు. కొంతసేపు వీక్షించి తిరిగి క్రిందికి వచ్చాడు. రాజభవనంలోని విశాలమైన ఒక గదిలో ఆసనంపై ఆసీనుడయ్యాడు. అలా నిరీక్షిస్తుండగా ఒక ప్రతీహారి లోనికి ప్రవేశించాడు.

రాజుగారికి జయము! జయము అని నిలబడ్డాడు.

విషయమేంటి? అడిగాడు ద్రుపదుడు.

ప్రభూ! తమ దర్శనార్థమై దృష్టద్యుమ్నులవారు వేచి యున్నారు'' అని అన్నాడు.

వెంటనే ప్రవేశపెట్టుము అని ఆజ్ఞాపించాడు రాజు.

దృష్టద్యుమ్నుడు లోనికి ప్రవేశించాడు. తండ్రికి పాదాలంటి నమస్కరించాడు.

ఆయుష్మాన్‌భవ! అని అన్నాడు ద్రుపదుడు. తండ్రి ప్రక్కనే ఆసీనుడయ్యాడు.

ఆరాటంలోనున్న ద్రుపదుడు అడిగాడు.

దృష్టద్యుమ్నా! పోయిన పని ఏమయింది? అని.

తండ్రీ! శ్రీకృష్ణవాసుదేవులవారికి తమ సందేశాన్ని విన్నవించాను. వారు వెంటనే వచ్చే ప్రయత్నం చేస్తానన్నారు. తొందరలోనే వచ్చి తమను కలుస్తారు'' అని అన్నాడు క్లుప్తంగా.

రెండు రోజులు గడిచాయి. మరునాడు వేగులవారు వచ్చి రాజదర్శనాన్ని కోరారు. రాజభటులు వారిని రాజమందిరంలోనికి ప్రవేశబెట్టి నిష్క్రమించారు. వేగులవారు అన్నారు- ప్రభువులవారికి జయము! జయము! అని.

ఏమిటి వార్తలు! విశేషాలేమిటి? మన రక్షణ వ్యవస్థ అప్రమత్తంగానే ఉన్నది గదా! అన్నాడు రాజు. ప్రభూ! గంగానదిలో కొన్ని పడవలు జనంతో నిండి రాజధానివైపునకు పయనిస్తున్నాయి. అందులోనున్నవారు ఎవరో ఇంకా గుర్తుపట్టవీలుగా లేదు. మన వేగులవారు అదేపనిలో వున్నారు. వారి వేషధారణబట్టి వారు బహు దూర ప్రాంతం నుండి వస్తున్నట్లు అనిపిస్తున్నది'' అని మనవి చేశారు.

''సరే! మీరు వెళ్లవచ్చు. వివరాలను సేకరించి వెంటనే వచ్చి తెలియపరచండి'' అని ఆజ్ఞాపించాడు ద్రుపదుడు.

వేగులు నిష్క్రమించారు.

కొంతసేపటికి దృష్టద్యుమ్నుడు భటులవలన తన రాకను తెలియపరిచి లోనికి ప్రవేశించాడు. తండ్రికి యధావిధిగా నమస్కరించి ఆశీస్సులను పొందాడు. ఆసీనుడై తండ్రితో- తండ్రీ! శ్రీకృష్ణవాసుదేవులవారు వస్తున్నట్లుగా వార్తలందాయి. వారి ఆంతరంగిక వ్యక్తులు వచ్చి విషయాన్ని తెలియపరచారు. వారి పరిమిత బలగం జలమార్గం ద్వారా వస్తున్నారు. ఏ సమయంలోనైనా వారు ఇక్కడ ప్రవేశించవచ్చును'' అని చెప్పిన వెంటనే నిష్క్రమించాడు.

అది సాయం సమయము

ద్రుపద మహారాజు శ్రీకృష్ణుని రాకకై వేయి కళ్ళతో ఎదురుచూస్తున్నాడు.

గంగానదికి దక్షిణాన పాంచాల రాజ్యం వున్నది. ఇది దక్షిణ పాంచాలం.

పాంచాల రాజ్యానికి తూర్పుకు దిగువలో దక్షిణ దిశగా మగధ సామ్రాజ్యము విస్తరించి వున్నది.

రాజగృహము దాని రాజధాని.

- ఇంకా ఉంది

రచనలు పంపవలసిన చిరునామా: **ఎడిటర్,** ఆంధ్రభూమి దినపత్రిక,
36, సరోజినీదేవి రోడ్, సికింద్రాబాద్-500 003

నేర్చుకుందాం



శ్రీ నరసింహ శతకములోని పద్యము

సీ. **తనువు ప్రాణముల్ తరలిపోయెడి వేళ**
నీ స్వరూపమును ధ్యానింపవచ్చు
నిమిష మాత్రము లోన నిన్నుఁ జేరును గాని
యముని చేతికిఁజిక్కి -శ్రమలఁబడుడు
పరమసంతోషాన భజన చేసెడివారి
పుణ్యమేమనవచ్చు భోగిశయన
మోక్షము నీదాస ముఖ్యుల కగుఁగాని
నరకమెక్కడిదయ్య నళినన్రేత!

తే. **కమలనాభ నీ మహిమను గానలేని**
తుచ్ఛులకు ముక్తిదొరుకుట దుర్లభంబు
భూషణ వికాస! శ్రీధర్మపురనివాస!
దుష్టసంహార! నరసింహ! దురిత దూర!

భావం; ఓ నరసింహస్వామీ ప్రాణం విడిచి వెళ్లేవాడు చిట్ట చివర నిన్ను ధ్యానిస్తే వెంటనే మోక్షాన్ని అందుకుంటాడు. అతనికి నరకబాధ తప్పుతుంది. మహానందంతో నీ భజన చేసేవారు పుణ్యాత్ములు. నీ భక్తులకే మోక్షమబ్బుతుంది. నరక బాధలు వారినంటవు. నీ గొప్పదనం తెలీని అజ్ఞానులకు సంసారబంధ విముక్తి అబ్బదు.

మాటాట : 1539

నిర్వహణ: సుధామ

■	■	1		2		■
3		■	■		■	4
	■	5			■	
6			■	7		
■	■	8		■	■	
9	■	■	■	10	■	■
11			■	12		

ఆధారాలు

అడ్డం:
1. పాట పాడేవాడు
3. తోడు వీడని అనుచరుడు
ఈభుజం తో సమానం
5. పాడ్యమి తరువాత
6. అబ్బాస్ చేసేది
7. కశ్మలము
8. పిచ్చి బాపతే
11. లోపలి నేను హరించిన కొబ్బరి
13. ఆడులేడి

నిలువు:
2. పక్షిగూడు, శరీరము
3. క్షేమము
4. పావడ, గాగర
5. మనవి వంటిదే
9. అనుమానము
10. మొండి పట్టుదల

మాటాట - 1538 సమాధానం

1 క	ను	2 ము	■	3 ము	ను	4 పు
జ్జ	■	ర	■	వ్వ	■	రు
లం	■	ళి	■	లు	■	వు
■	5 పి	■	6 ఆ	■	7 గో	■
8 త	ల్లి	■	స	■	9 లెం	10 కి
డ	■	11 నో	రా	12 ర	■	ద్రు
13 ప	ర్వ	ము	■	14 మ	గు	వ

రాశిఫలం



- గౌరీభట్ల దివ్యజ్ఞాన సిద్ధాంతి

- **మేషం (అశ్విని, భరణి, కృత్తిక 1పా.)**
తలచిన కార్యాలన్నియు విజయవంతంగా పూర్తిచేసుకోగలుగుతారు. బంధు, మిత్రుల మర్యాద మన్ననలను పొందుతారు. అనారోగ్య బాధలుండవు. సహ ఉద్యోగులకు సహకరించే అవకాశం లభిస్తుంది.
- **వృషభం (కృత్తిక 2, 3, 4పా., రోహిణి, మృగశిర 1, 2పా.)**
మీ మంచి ప్రవర్తనను ఇతరులు ఆదర్శంగా తీసుకుంటారు. ప్రయత్న కార్యాలన్నింటిలో విజయాన్ని సాధిస్తారు. దైవదర్శనం చేసుకుంటారు.
- **మిథునం (మృగశిర 3, 4 పా., ఆరుద్ర, పునర్వసు 1, 2, 3పా.)**
కుటుంబ పరిస్థితులు సంతృప్తికరంగా వుండును. ఆరోగ్యం గూర్చి శ్రద్ధ వహించాలి. ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతారు.
- **కర్కాటకం (పునర్వసు 4 పా., పుష్యమి, ఆశ్రేష)**
స్థానచలనం కలిగే అవకాశాలున్నాయి. గృహంలో మార్పును కోరుకుంటారు. ఇతరుల విమర్శలకు లోనవుతారు. స్థిరమైన నిర్ణాలు తీసుకోలేరు.
- **సింహం (మఖ, పుబ్బ, ఉత్తర 1 పా.)**
శుభకార్య ప్రయత్నాలు సులభంగా నెరవేరతాయి. దూర బంధువులతో కలుస్తారు. తద్వారా లాభాలుంటాయి. విదేశయాన ప్రయత్నాలు సంపూర్ణంగా నెరవేర్చుకుంటారు నూతన కార్యాలకు ప్రణాళికలు వేస్తారు.
- **కన్య (ఉత్తర 2, 3, 4పా., హస్త, చిత్త 1, 2 పా.)**
కుటుంబంలో సుఖ సంతోషాలుంటాయి. ధనధాన్యాభివృద్ధి ఉంటుంది. విద్యార్థులు విజయాన్ని సాధిస్తారు. ప్రయత్న కార్యములు ఫలిస్తాయి. గృహంలో జరిగే మార్పులు సంతృప్తినిస్తాయి.
- **తుల (చిత్త 3, 4పా., స్వాతి, విశాఖ 1, 2, 3పా.)**
మానసికానందం లభిస్తుంది. అనుకొన్న పనులు పూర్తవుతాయి. విందులు, వినోదాల్లో పాల్గొంటారు. వృత్తిరీత్యా అభివృద్ధిని సాధిస్తారు.
- **వృశ్చికం (విశాఖ 4 పా., అనూరాధ, జ్యేష్ఠ)**
ఋణప్రయత్నం ఫలిస్తుంది. చెడు సహవాసంవైపు వెళ్లకుండా వుంటే గౌరవం దక్కుతుంది. క్షణికావేశం పనికిరాదు. విందులు, వినోదాల్లో పాల్గొనే అవకాశం ఉంది.
- **ధనుస్సు (మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1 పా.,)**
బంధు, మిత్ర విరోధమేర్పడకుండా జాగ్రత్త వహించుట మంచిది. మానసికాందోళన అధికమగును. అనారోగ్య బాధలను అధిగమిస్తారు.
- **మకరం (ఉత్తరాషాఢ 2, 3,4పా., శ్రవణం, ధనిష్ఠ 1, 2పా.)**
సంతోషంగా కాలం గడుపుతారు. శుభవార్త వింటారు. కుటుంబ పరిస్థితి సంతృప్తికరంగా ఉంటుంది. తోటివారి ప్రశంసలందుకుందురు.
- **కుంభం (ధనిష్ఠ 3, 4పా., శతభిషం, పూర్వాభాద్ర 1,2, 3పా.)**
ఊహించని కార్యాల్లో పాల్గొనే అవకాశముంటుంది. వృత్తి ఉద్యోగ రంగాల్లో అభివృద్ధి ఉంటుంది. ఆత్మీయులను కలియుటల విఫలమవుతారు.
- **మీనం (పూర్వాభాద్ర 4 పా., ఉత్తరాభాద్ర, రేవతి)**
అద్భుతమైన అవకాశాలను పొందుతారు. శుభకార్య ప్రయత్నాలు సులభంగా నెరవేరతాయి. ముఖ్యమైన శుభవార్తలు వింటారు. ఆత్మీయుల సహాయ సహకారాలు సంపూర్ణంగా లభిస్తాయి




అలహాబాద్‌లోని త్రివేణిసంగమం భక్తజనకోటి పుణ్యస్నానాలతో నిండిపోయింది. ఈ సంగమ ప్రాంతంలో పవిత్ర స్నానం ఆచరిస్తే జీవితాలను తరింపచేసుకోవచ్చన్న భావనతో భక్తులు అలహాబాద్‌లో జరిగిన మేఘమేళా ఉత్సవానికి తరలివచ్చారు. ఇలా భక్తుల తాకిడితో త్రివేణి సంగమ ప్రాంతానికి దారితీసే పాంటూన్ వంతెన నిండిపోయింది.



సంక్రాంతి వచ్చిందంటే ఒక్కో ప్రాంతంలో ఒక్కో క్రీడ కొత్త అనుభూతుల్ని మిగులుస్తుంది. ఆంధ్రనాట కోడి పందేలు, తమిళనాట జల్లికట్టు ఎప్పటికప్పుడు వివాదాలను రేకెత్తిస్తూనే ఉన్నా వాటికున్న ఆదరణ మాత్రం తగ్గడం లేదు. ఇక్కడ కనిపిస్తున్న దృశ్యం మదుర జిల్లాలో జరిగిన జల్లికట్టుకు సంబంధించింది. పరుగులు పెడుతున్న ఆబోతును అదిమిపట్టుకుని అదుపులోకి తెచ్చుకున్న ఓ గ్రామస్థుడు విజేతగా నిలిచాడు.

భయం పోతేనే వెనక్కి...



- రెండేళ్లలో రోహింగ్యాలను తిప్పి పంపే ఒప్పందం
- వేలాదిమందిలో ఇంకా అభద్రతా భావం
- మైనారిటీ ముస్లింలకు మైన్మార్ అభయహస్తం ఇస్తుందా?


నెలల తరబడి ఇటు బంగ్లాదేశ్, అటు మైన్మార్‌ను కుదిపేసిన రోహింగ్యాల సమస్య ఇప్పట్లో ఓ కొలిక్కి వచ్చే అవకాశం కనిపించడం లేదు. మైన్మార్‌లో రఖీనా రాష్ట్రానికి చెందిన రోహింగ్యాలు అక్కడ జరిగిన సైనిక దాడులకు తల్లడిల్లి ప్రాణాలు అరచేతిలో పట్టుకుని పొరుగున ఉన్న బంగ్లాదేశ్‌తోసహా అనేక దేశాలకు తరలిపోవడం, ముఖ్యంగా బంగ్లాలో దయనీయ పరిస్థితుల్లోనే వారు జీవనాన్ని గడపడం అంతర్జాతీయంగా కలవరాన్నే రేపింది. తరతరాలుగా మైన్మార్‌లోనే ఉంటున్నా పౌరసత్వం అంటూ లేని పరిస్థితుల్లోనే రోహింగ్యా మైనారిటీ ముస్లింలు జీవనాన్ని సాగించారు. అయితే వీరి కారణంగానే దేశంలో హింసాత్మక పరిస్థితులు తలెత్తుతున్నాయన్న ఆరోపణలతో మైన్మార్ సైన్యం వారిని తొలగించే ప్రయత్నం చేసింది. ఆ విధంగా వందల సంఖ్యలోనే రోహింగ్యాలు మరణించారు. ఇంకొంత మంది ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని లక్షల సంఖ్యలోనే పొరుగున ఉన్న బంగ్లాకు పరుగులు పెట్టారు. ఇంతకీ రోహింగ్యాలు చేసిన పాపమేమిటో తెలియదు కానీ, వారిపట్ల మైన్మార్ వ్యవహరించిన తీరు సర్వత్రా విమర్శలకు దారితీసింది. ప్రస్తుత పరిస్థితుల్లో ఏ దేశమైనా కూడా ఇతర దేశాలతో ఆర్థిక, రాజకీయ సంబంధాలను పెంపొందించుకోగలిగితేనే మనుగడ సాగిస్తుంది. ఇలాంటి పరిస్థితుల్లో మరో దేశానికి చెందిన వ్యక్తులు లక్షల సంఖ్యలో రావడం అన్నది భరించలేని పరిణామమే అవుతుంది. గత కొన్ని నెలలుగా రోహింగ్యాల తాకిడివల్ల బంగ్లాదేశ్ ఇదే సమస్యను ఎదుర్కొంటూ వచ్చింది. వారికి కొన్నిచోట్ల శరణార్థ శిబిరాల్లో ఆశ్రయం కల్పిస్తున్నప్పటికీ నిరంతర ప్రాతిపదికన వారిని పోషించే అవకాశం ఉండదు కాబట్టి వారిని వెనక్కి పంపే ప్రయత్నంలో భాగంగా మైన్మార్‌తో ఒప్పందం కుదుర్చుకుంది. అంటే రెండేళ్ల వ్యవధిలో తమ దేశంలో ఉన్న రోహింగ్యాలు తిరిగి మైన్మార్‌కు వెళ్లిపోయే విధంగా ఈ ఒప్పందాన్ని కుదుర్చుకున్నట్టుగా స్పష్టమవుతోంది. అందర్నీ ఒకేసారి కాకుండా క్రమానుగతంగా వీరిని స్వదేశానికి పంపే విషయంలో ఓ స్పష్టమైన రీతిలోనే ఇరు దేశాలు అవగాహన కుదుర్చుకున్నాయి. అంటే ప్రపంచ వ్యాప్తంగా ఇతర దేశాల్లో ఉన్న రోహింగ్యాలు తిరిగి మైన్మార్ వెళ్లిపోవడానికి ఈ ఒప్పందం ఎలాంటి ఆశలు కల్పించదు. కేవలం కొన్ని నెలల్లో బంగ్లాకు తరలిపోయినవారు మాత్రమే తిరిగి రావడానికి ఇది వీలు కల్పిస్తుంది. ముఖ్యంగా ఉత్తర రాష్ట్రమైన రఖీనా నుంచి బంగ్లాకు తరలిపోయిన వారు ఈ ఒప్పందాన్ని ఆలంబనగా చేసుకుని రెండేళ్ల వ్యవధిలో స్వదేశానికి వెళ్లే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం బంగ్లాలో రెండు లక్షల మందికి పైగా మైన్మార్ రోహింగ్యాలు అక్కడి శరణార్థ శిబిరాల్లో తలదాచుకుంటున్నట్లు ఐక్యరాజ్య సమితి అంచనాల ప్రకారం తెలుస్తోంది. రోహింగ్యాలను వెనక్కి పంపాలన్న ఈ ఒప్పంద స్ఫూర్తి అభినందనీయమే అయినప్పటికీ స్వదేశానికి తిరిగి వెళ్లిన తర్వాత వీరికి పూర్తి స్థాయిలో భద్రత చేకూరుతుందా? మళ్లీ ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని మరో దేశానికి పరుగులు పెట్టాల్సి ఉంటుందా అన్నది ఇప్పటికిప్పుడే చెప్పలేని పరిస్థితి. సమీప భవిష్యత్తులోనే రోహింగ్యాలను వెనక్కి పంపే ప్రక్రియను ప్రారంభిస్తామని ఇరు దేశాల ప్రతినిధులు చెబుతున్నా ఎలాంటి అవరోధాలకు తావు లేకుండా దీన్ని అమలు చేయడం అన్నది అత్యంత కీలకం. ఈ విషయంలో బంగ్లాదేశ్ కంటే కూడా మైన్మార్ పాలకులకు రాజకీయ చిత్తశుద్ధి ఎంతైనా అవసరం. ముఖ్యంగా తమ దాడులవల్లే పారిపోయిన రోహింగ్యాలను తిరిగి వెనక్కి తీసుకునే విషయంలో మైన్మార్ ఓ పట్టాన ముందుకు రాలేదు. ఐక్యరాజ్య సమితి మొదలుకుని అన్ని దేశాల నుంచి తీవ్ర స్థాయిలో ఒత్తిడి వచ్చిన నేపథ్యంలోనే ఈ తాజా ఒప్పందం కుదుర్చుకుందన్నది వాస్తవం. శరణాస్థులకు ఆశ్రయం ఇచ్చేందుకు బంగ్లాదేశ్ భారీ ఎత్తున తాత్కాలిక శిబిరాలను ఏర్పాటు చేసినట్టే తిరిగి స్వదేశానికి వస్తున్న రోహింగ్యాలను అన్ని విధాలుగా ఆదుకునేందుకు మైన్మార్ కూడా గట్టి ఏర్పాట్లు చేయడం అత్యంత అవసరం. అంతేగాకుండా వీరికి ఆవాసంతోపాటు తమ ప్రాణాలకు తిరుగులేదన్న భద్రతా భావాన్ని కూడా కల్పించాల్సి ఉంటుంది. ఇప్పటికే తాము స్వదేశానికి వెళ్లేది లేదన్న సంకేతాలను అందిస్తున్న రోహింగ్యాలు మళ్లీ అక్కడికి వెళితే తమ ప్రాణాలకే ముప్పు అన్న ఆందోళనతోనూ ఉన్నారు. ముందుగా వీరిలో ఈ భయాన్ని తొలగించి, ధీమాను కల్పించాల్సిన బాధ్యత మైన్మార్ పాలకులపై ఉంది.

- బి. రాజేశ్వర ప్రసాద్

మలుపు తిరిగిన మైత్రి

- భారత్ - ఇజ్రాయిల్ మధ్య సరికొత్త సుహృద్భావం
- అంతర్జాతీయంగా బలపడేందుకు పునాది
- నెతన్యాహు రాకతో తొలగిన అపోహలు

అంతర్జాతీయంగా అన్ని కీలక దేశాలతో ఆర్థిక, రాజకీయ వ్యూహాత్మక సంబంధాలను పెంపొందించుకోవాలన్న భారత్ ప్రధాని నరేంద్రమోదీ ఆశయానికి ఒక స్పష్టత చేకూరుతోంది. చిన్నా పెద్ద అన్న తేడా లేకుండా ఇరుగుపొరుగు వైరుధ్యాలకు ఆస్కారం ఇవ్వకుండా అందరితో మనం, మనతో అందరూ అనే సామరస్య ధోరణితో సాగుతున్న నరేంద్రమోదీ విదేశీవ్యూహం మంచి ఫలితాలను ఇవ్వడమేగాక, అనన్యమైన రీతిలో ఆర్థిక, రాజకీయ వ్యూహాత్మక ఫలితాలను అందిస్తోంది. పశ్చిమ ఆసియాలో అత్యంత శక్తివంతమైన, కీలకమైన వ్యూహాత్మకమైన దేశంగా ఉన్న ఇజ్రాయిల్‌తో భారత్‌కు గతంలో ఎన్నడూ లేని రీతిలో ఈ మూడేళ్లలో ఎనలేని సాన్నిహిత్యం ఏర్పడింది. పాలస్తీనా వ్యవహారం నిరంతర అగ్నిని రాజెయ్యడం ఇజ్రాయిల్‌కు భారత్ అత్యంత సన్నిహితం కాకపోవడానికి ఇన్నేళ్లుగా ప్రధానకారణమైనప్పటికీ, తాజా పరిస్థితులు, పరిణామాలు ఒక్క అంశంతో ముడిపడి కాకుండా సమగ్ర దృక్పథంతోనే మైత్రీ బంధం అన్న భారత్ భావనకు అద్దం పట్టింది. అందుకే పాలస్తీనా వ్యవహారం ఒక కొలిక్కి రాకపోయినా, అక్కడి ప్రజలకు పూర్తి స్థాయిలో న్యాయం చేయాలన్న తమ ఆలోచనను, అభిలాషను మార్చుకోకుండానే ఇజ్రాయిల్‌తో లోతైన సంబంధాలను పెంపొందించుకునేందుకు భారత్ సిద్ధపడింది. ఇటీవల మోదీ ఇజ్రాయిల్‌లో పర్యటించి ఇరు దేశాల సాన్నిహిత్యాన్ని కొత్త పుంతలు తొక్కించిన నేపథ్యంలో ఆదేశ ప్రధాని బెంజిమన్ నెతన్యాహు ఆరు రోజుల పర్యటనార్థం భారత్‌కు రావడం ద్వైపాక్షిక సంబంధాల ప్రక్రియలో సరికొత్త శకం. నిన్న మొన్నటి వరకూ ఇజ్రాయిల్‌తో సన్నిహితంగా ఉంటే రాజకీయంగా ఇరుకున పడిపోతామనే ఆందోళనను పక్కన పెట్టి దేశ విశాల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఇజ్రాయిల్‌తో మైత్రికి భిన్న రంగాల్లో పరస్పర సహకారానికి మోదీ తెరతీశారు. అనేక అంశాలపై ఇరు దేశాలకు ఎన్నో విబేధాలున్నాయి, అవేవీ కూడా పరస్పర వ్యాపార వాణిజ్య సంబంధాలకు అవరోధం, ఆటకం కావన్న స్నేహ స్ఫూర్తికి నెతన్యాహు తాజా పర్యటన అద్దం పట్టింది. ముఖ్యంగా ఈ రెండు దేశాల మధ్య దౌత్య సంబంధాలు మొదలై పాతికేళ్లు పూర్తయిన సందర్భంలోనే నెతన్యాహు భారత్ రావడం సరికొత్త స్ఫూర్తిదాయక పరిణామంగానే భావించవచ్చు.



అగ్రస్థానానికి సంబంధాలు

ఉత్తరాన లెబనాన్, ఈశాన్యంలో సిరియా, తూర్పున జోర్డాన్, నైరుతిలో ఈజిప్టు దేశాలతో కలిసి ఉన్న నైరుతి ఆసియా దేశం ఇజ్రాయిల్. భారత్‌తో సత్సంబంధాల్లో అగ్రస్థానానికి చేరుకుంటోంది. సాంస్కృతిక, సంప్రదాయ, పురాతన చరిత్రలో భారతీయ సంస్కృతికి దగ్గరగా ఉన్న ఇజ్రాయిల్‌తో వ్యవసాయం, శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం, అంతరిక్ష పరిశోధన, నీటి యాజమాన్యం, విదేశాంగ విధానం, రక్షణ రంగాల్లో భారత్ సరికొత్త సంబంధాలకు తెరతీసింది. దశాబ్దాలుగా పట్టించుకోని దేశం భారత్‌కు అత్యంత ఆత్మీయంగా మారింది. ఆర్థిక, సాంకేతిక రంగాలకు కీలకమైన ఇజ్రాయిల్ పట్టణం టెల్ అవివ్‌తో భారత్ కొత్త ఒప్పందాలను కుదుర్చుకుంది. 1950 నుండి 1990 వరకూ ఇజ్రాయిల్‌తో భారత్‌కు మంచి సంబంధాలు లేకున్నా , 1992లో అప్పటి ప్రధాని పివి నర్సింహారావు హయాంలో భారత్- ఇజ్రాయిల్ సంబంధాలు కొత్త పుంతలు తొక్కాయి. 1992 నుండి నేటి వరకూ ఇజ్రాయిల్- భారత్ అనేక అంశాల్లో కలిసి పనిచేస్తున్నాయి. భారత్‌కు అతిపెద్ద మిలటరీ వస్తువుల విక్రయదారుల్లో ఇజ్రాయిల్ కూడా ఒకటి. రష్యా, అమెరికా తర్వాత ఇజ్రాయిల్ భారత్‌కు అతిపెద్ద మిలటరీ సరఫరాదారుగా మారింది. రక్షణ రంగంలో ఇజ్రాయిల్ సహకారాన్ని ఎపుడూ భారత్ కోరుకుంటోంది. ఆయుధాల సరఫరాతో పాటు భారత్‌కు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిస్తున్న ఇజ్రాయిల్ నిఘా సమాచారం అందించడంలోనూ కీలకంగా మారింది. ఇస్లామిక్ తీవ్రవాదానికి సంబంధించిన కీలక సమాచారాన్ని ఇచ్చిపుచ్చుకుంటున్న ఇరు దేశాలు పరస్పర చర్చలతో మరో అడుగు ముందుకు వేశాయి. రక్షణ రగంలో భారత్ ఇజ్రాయిల్ మధ్య బంధం ఇప్పటికే పటిష్టం అయింది. ఇజ్రాయిల్‌తో సుమారు 17వేల కోట్ల రూపాయిల భారీ ఒప్పందాన్ని భారత్ కుదుర్చుకుంది. మధ్య తరహా క్షిపణుల కొనుగోలుకు ఈ మొత్తాన్ని వెచ్చిస్తారు. ఇజ్రాయిల్ ఇండస్ట్రీతో కలిసి భారత్ రక్షణ శాఖ పరిశోధన, అభివృద్ధి సంస్థ వీటిని అభివృద్ధి చేస్తుంది. ఈ క్షిపణుల ద్వారా భారత గగన తలం వైపు చొచ్చుకు వచ్చే శత్రు విమానాలు , డ్రోన్లు , గస్తీ ఎయిర్‌క్రాఫ్ట్‌లను కూల్చేయవచ్చని రక్షణ శాఖ చెబుతోంది. భారత నేవీకి సంబంధించి లాంగ్ రేంజ్ సర్ఫేస్ టు ఎయిర్ మిస్సైల్ సిస్టం పేరుతో మరో కార్యక్రమం కూడా చేపట్టనుంది. ఐదు విభాగాల్లో 40 ఫైరింగ్ యూనిట్లు ఏర్పాట్లు చేస్తారు. అనుమతి లేకుండా భారత గగనతలంలోకి ప్రవేశించే శతృవిమానాలు, డ్రోన్లను అడ్డుకోవడానికి ఇది తోడ్పడుతుంది. ఆకాశంలో 50 నుండి 70 కిలోమీటర్లు దూరంలోని శత్రు దేశాల నిఘా విమానాలను ఈ క్షిపణులతో కూల్చి వేసేందుకు వీలుంటుంది. ఇంకో పక్క వ్యవసాయం, ఫార్మా రంగాల్లో కూడా ఇరు దేశాల మధ్య కీలక ఒప్పందాలు జరుగుతున్నాయి.

ప్రోటోకాల్ పక్కన పెట్టి నెతన్యాహుకు స్వాగతం

భారత ప్రోటోకాల్‌ను పక్కన పెట్టి ఇజ్రాయిల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహుకు భారత ప్రధాని నరేంద్రమోదీ ఘనస్వాగతం పలికారు. బెంచిమన్ నెతన్యాహుతో ఆయన సతీమణి సారా, వివిధ రంగాలకు చెందిన 300 మంది నిపుణులు, ప్రతినిధులు, అధికారుల బృందం కూడా భారత్‌కు వచ్చింది. ఆదివారం మధ్యాహ్నం భారత్‌కు చేరుకున్న నెతన్యాహు బృందం విదేశాంగ మంత్రితో భేటీ అయింది. రెండోరోజు రాష్ట్రపతితో భేటీ అనంతరం మహాత్మాగాంధీ స్మారకస్థూపాన్ని సందర్శించింది. భారత ప్రధాని నరేంద్రమోదీతో భేటీ అనంతరం మరోమారు రాష్ట్రపతిని సందర్శించి చర్చలు జరిపింది. మూడో రోజు ఆగ్ర సందర్శించి తాజ్‌మహల్‌ను తిలకించారు. అక్కడే కాసేపు అమర్ విలాస్‌లో విశ్రాంతి తీసుకుని యుపి ముఖ్యమంత్రితో కలిసి చర్చలు జరిపి నాలుగో రోజు అహ్మదాబాద్‌కు చేరుకుంది. సబర్మతీ ఆశ్రమం సందర్శించి అనంతరం ఐ క్రియేట్ సదస్సులో ఈ బృందం పాల్గొంది. 18వ తేదీన ముంబైలో పారిశ్రామిక వేత్తలతో భేటీ అవుతుంది. నారీమన్ హౌస్‌ను సందర్శించి, సలాం బాలీవుడ్ కార్యక్రమంలో పాల్గొంటుంది. అనంతరం ఇజ్రాయిల్ ప్రధాని పర్యటన ముగుస్తుంది. ఈ పర్యటనతో ఇరు దేశాలు సరికొత్త చరిత్ర సృష్టించనున్నాయి.

- బి వి ప్రసాద్

ఎక్కడ వేసిన గొంగళి అక్కడే!

- ప్రజలు తీర్పిచ్చినా నేపాల్‌లో సర్కార్ ఎండమావే
- కొత్త రాజధానులపై ఎడతెగని రగడ
- కొలిక్కి రాలేకపోతున్న అధికార పార్టీలు

నేపాల్‌లో అభివృద్ధి ఎండమావేనా? రాజకీయ పార్టీల కుమ్ములాటలతో విధానపరమైన స్పష్టత కనిపించకపోవడంతో దేశ ప్రగతి, ప్రజాస్వామ్యం బలాన్ని సంతరించుకోవడం అన్నది అంత సజావుగా కనిపించడం లేదు. తాజా పరిణామాలు ఇందుకు ప్రబల నిదర్శనంగా నిలుస్తున్నాయి. కొన్ని వారాల క్రితం జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో వామపక్ష కూటమి నిర్ణయాత్మకమైన మెజారిటీని సంపాదించినప్పటికీ కొత్త ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే విషయంలో ఇంతవరకూ ఎలాంటి పురోగతి లేకపోవడం విస్మయాన్ని కలిగించే అంశమే. శతాబ్దాల రాచరికానికి స్వస్తి పలికి దేశంలో ప్రజాస్వామ్య విధానాన్ని పునరుద్ధరించేందుకు జరిగిన పోరాటంలో క్రియాశీలకంగా పాల్గొన్న రాజకీయ పార్టీలు తీరా అధికారం తమ చేతికి వచ్చిన తర్వాత అసలు లక్ష్యాన్ని పక్కనబెట్టి అధికారమే పరమావధిగా వ్యవహరించడం మొదలుపెట్టాయి. ఒక వ్యవస్థ నుంచి మరో వ్యవస్థకు మారాలంటే అన్ని విధాలుగా బలమైన విధానపరమైన వ్యవస్థాగత ఏర్పాటు అవసరం. ముఖ్యంగా రాచరిక పాలననుంచి ప్రజాస్వామ్య పథంలో అడుగుపెట్టే దేశాలు తాము అనుసరించబోయే పాలనా విధానాలు మొదలుకుని ప్రతి విషయంలోనూ స్పష్టతను కనబర్చాలి. కాని అధికారం చేతికందిన తర్వాత నేపాల్ రాజకీయ పార్టీల్లో దేశ విధానానికి సంబంధించి ఏళ్ల తరబడి ఒక అవగాహన అంటూ లేకపోయింది. పార్లమెంటరీ ప్రజాస్వామ్య విధానమా లేక మరో తరహా పాలనా విధానాన్ని అనుసరించాలన్నదానిపై ఎప్పటికప్పుడు విభేదాలే ప్రధానమయ్యాయి. కనీసం రాజ్యాంగ ముసాయిదాను రూపొందించుకుని కొత్త పాలనా విధానాన్ని ఏర్పరచుకోవడంలోనూ విఫలమైన పార్టీలు అనుకున్న స్థాయిలో దేశాన్ని అభివృద్ధి పథంలో ముందుకు నడిపించలేకపోయాయి. ఆ విధంగా అస్తవ్యస్థ చందంగా ఏళ్లకు ఏళ్లే గడిచిపోయాయి. అనేకసార్లు ప్రభుత్వాలు, ప్రధాన మంత్రులు ఓ పరంపరగా మారిపోయే పరిస్థితీ తలెత్తింది. మొత్తానికి కొత్త రాజ్యాంగానికి సంబంధించి పార్టీల మధ్య అవగాహన ఏర్పడినా ఏ రకంగా దేశాన్ని ముందుకు తీసుకెళ్లాలన్న దానిపై స్పష్టత చేకూరినా కూడా అనుకున్న దానిపై రాజకీయ సుస్థిరతకు ఆస్కారమే లేకపోయింది. తాజాగా జరిగిన ఎన్నికల్లో తిరుగులేని రీతిలో విపక్ష కూటమి మెజారిటీని సంపాదించుకున్నా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే విషయంలో మాత్రం మీన మేషాల చందంగానే సాగడం విడ్డూర పరిణామమే. ఎన్నికలకు ముందు నేపాల్ కమ్యూనిస్టు పార్టీ (ఎంఎల్), అలాగే సీపీఎన్ (మావోయిస్టు)ల మధ్య అవగాహన కుదిరింది. దాని ప్రకారమే రెండు పార్టీలూ కలిసికట్టుగా ఎన్నికల్లో పోటీచేశాయి. అయితే తాజాగా తలెత్తిన విభేదాలే కొత్త ప్రభుత్వ ఏర్పాటుకు అవరోధంగా మారుతున్నట్లుగా స్పష్టమవుతోంది. అయితే దేశంలో పరోక్ష ఎన్నికలకు సంబంధించి రాజకీయ పార్టీలు ఏకాభిప్రాయానికి రావడం లేదు. నేపాలీ కాంగ్రెస్ మాత్రం నైష్పత్తిక ప్రాతినిధ్య విధానమే సరైనదని సూచిస్తోంది. అయితే యూఎంఎల్ పార్టీ మాత్రం మెజారిటీ ప్రాతిపదికనే ఓటింగ్ జరగాలని వాదిస్తోంది. విధానపరంగా కొన్ని అంశాలను పరిష్కరించుకోగలిగినప్పుడే ఇతరత్రా కూడా జటిలంగా మారుతున్న అంశాలను అదే స్ఫూర్తితో పరిష్కరించుకోవాల్సిన అవసరం ఉంది. ప్రస్తుతం ఆపద్ధర్మ ప్రభుత్వం నేపాలీ కాంగ్రెస్ సారథ్యంలో సాగుతోంది. ఇటీవల ఎన్నికైన పార్టీలకు అధికారాన్ని అప్పగించే విషయంలో నేపాలీ కాంగ్రెస్ అనుసరిస్తున్న విధానమే కొత్త ప్రభుత్వ ఏర్పాటుకు మార్గాన్ని సుగమం చేయడం లేదు. అలాగే దేశంలో కొత్త రాజధానులకు సంబంధించి కూడా వివాదాలు చెలరేగే అవకాశం కనిపిస్తోంది. ముఖ్యంగా దేశంలోని ఏడు రాష్ట్రాలకు రాజధానులు ఏమిటన్నదానిపై ఇప్పటికీ ఎలాంటి స్పష్టతా లేదు. ముందుగా ఈ రాష్ట్రాలకు గవర్నర్లను నియమించిన తర్వాతే రాజధానుల ఎంపికకు సంబంధించి దృష్టిపెట్టే అవకాశం కనిపిస్తోంది. ఇందుకు సంబంధించి తాజాగా వెలుగుచూసిన తాత్కాలిక ప్రతిపాదనలపైనే ఆయా రాష్ట్రాల ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా రాజకీయ పార్టీలు ఈ విషయంలో ఓ స్పష్టమైన వైఖరిని అవలంబించకపోవడం వల్లే ఈ పరిస్థితి తలెత్తుతోందని వాస్తవం. అలాగే నేపాలీ కాంగ్రెస్ సారథ్యంలోని ఆపద్ధర్మ ప్రభుత్వం ఈ విషయంలో అనుకున్న స్థాయిలో క్రియాశీలతను కనబరచడం లేదు. పరిస్థితులు ఈ రకంగా జటిలంగా మారుతున్న నేపథ్యంలో ఏ ప్రాతిపదికన ఈ అంశాన్ని పరిశీలించాలి, అందుకు అనుసరించాల్సిన రాజకీయపరమైన మార్గమేమిటన్నదానిపై స్పష్టత లేని పరిస్థితి నెలకొంది. దాంతో అన్ని రాష్ట్రాల అసెంబ్లీలు, దేశ రాజధాని ఖాట్మండులో సమావేశమై సమస్యను సామరస్యపూర్వకంగా పరిష్కరించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రస్తుత పరిణామాలను బట్టి ఇదే సముచితమైన విధానంగా కనిపిస్తోంది. దేశ ప్రజలు తమ వంతు బాధ్యతగా కమ్యూనిస్టులకు అధికారాన్ని కట్టబెడితే మెజారిటీ తీర్పును వెలువరించారు. వారి ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగా ప్రాదేశిక నమూనా ప్రాతిపదికగా కొత్త వ్యవస్థను పాదుకొల్పాల్సిన బాధ్యత అధికారంలోకి వచ్చిన కూటమిదే. అయితే ఆ విధానం ఏ రీతిలో అమలవుతుంది? ఆ దిశగా ఎదురయ్యే సమస్యలను ఎలా పరిష్కరించుకుంటారు అన్నదానిపైనే అంతిమ ఫలితం ఆధారపడి ఉంటుంది. దేశ రాజకీయాల మాట ఎలా వున్నా అంతర్యుద్ధ పరిస్థితులు సమసిపోయి కొత్త రాజ్యాంగం అమలులోకి వచ్చినప్పటికీ నేపాల్ అభివృద్ధి ఎక్కడవేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉంది. అధికారాన్ని అప్పగిస్తే అభివృద్ధి వరద సృష్టిస్తామని చెప్పిన పార్టీలకు అధికారంకోసం కుమ్ములాటతోనే సరిపోయింది. ఈ పరిస్థితుల్లో నేపాల్ ప్రజలు మరోసారి నష్టపోవడానికి వీల్లేదు. వారిచ్చిన తీర్పును శిరసావహించి రాజకీయ పరమైన సమస్యలను సామరస్య పూర్వకంగా పరిష్కరించుకుంటూ నేపాల్‌లో బలమైన, స్థిరమైన



ప్రభుత్వాన్ని ఏర్పాటుచేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ముఖ్యంగా కొత్త ప్రధానిని ఎన్నుకునే ప్రక్రియ ఖరారైతే అధికారంలోకి వచ్చిన కమ్యూనిస్టు కూటమి గతానికి భిన్నంగా సరైన అవగాహనతో విధానపరమైన స్పష్టతతో నేపాల్ ప్రజల ఆశలు, ఆకాంక్షలను నెరవేర్చే అవకాశం ఉంది. అయితే ఇప్పటికే ఆ దిశగా తీసుకోవాల్సిన చర్యల్లో తీవ్రజాప్యమే జరిగింది. ఇంకెంత మాత్రం అందుకు ఆస్కారం ఉండకూడదు. ప్రజలిచ్చిన అవకాశాన్ని చేజేతులా వదులుకుంటే మాత్రం నేపాల్ అభివృద్ధి ఎండమావే అన్నది కళ్లకు కట్టే వాస్తవం.

బాలీవుడ్‌పై దృష్టి

తెలుగులో స్టార్ హీరోయిన్‌గా ఒక వెలుగు వెలుగుతోన్న రకుల్ ప్రీత్‌సింగ్, మరోపక్క తమిళ, హిందీ చిత్రాలపై కూడా దృష్టిపెట్టింది. తమిళంలో అగ్ర కథానాయకుల సరసన అవకాశాలను అందుకుంటూ వెళుతోంది. ఈ క్రమంలో తమిళంలో సూర్య జోడీగా ఒక మంచి అవకాశాన్ని దక్కించుకుంది. హిందీలోనూ మరో భారీ ఛాన్స్‌ను పట్టేసిందనేది తాజా సమాచారం. ఆల్‌రెడీ సిద్ధార్థ్ మల్హోత్రా సరసన రకుల్ చేసిన ఓ సినిమా వచ్చేనెల 9వ తేదీన ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈలోగానే ఆమెకి అజయ్ దేవ్‌గన్ జోడీగా చేసే మరో ఛాన్స్ వచ్చింది. రంజన్ దర్శకత్వంలో రొమాంటిక్ కామెడీ ఎంటర్‌టైనర్‌గా ఈ సినిమా తెరకెక్కనుంది. ఈ సినిమాలో రకుల్ సిటీ అమ్మాయిగా చాలా మోడ్రన్‌గా కనిపిస్తుందట. ఆమె స్వభావం కూడా డిఫరెంట్‌గా వుంటుందని అంటున్నారు. త్వరలో సెట్స్‌పైకి వెళ్లి.. దసరాకు ఈ సినిమాను విడుదల చేయాలనే ఆలోచనలో వున్నారు.



రంగస్థలం టీజర్ వస్తోంది



ఎప్పుడెప్పుడా? అని ఎదురుచూస్తున్న మెగా హీరో రామచరణ్ రంగస్థలం సినిమా తాలూకు మరో కొత్త వార్త రావడంతో ఇప్పుడు అభిమానులు పండగ చేసుకుంటున్నారు. ఆల్రెడీ ఫస్ట్‌లుక్‌తో సందడి చేసిన ఈ మెగా హీరో చిత్రం.. ఇప్పుడు టీజర్ చూపించడానికి సిద్ధమవుతోంది. సుకుమార్ దర్శకత్వంలో రామ్‌చరణ్ హీరోగా రూపొందుతున్న 'రంగస్థలం' సినిమా నిజానికి సంక్రాంతి 2018న విడుదల అవ్వాల్సి వుంది. ఎట్టకేలకు పోస్టుపోన్ అయిపోయి.. చివరకు సంక్రాంతినాడు ఒక ప్రకటన ఇచ్చారు. జనవరి 24.. సాయంత్రం 4.15 నిమిషాలకు 'రంగస్థలం' సినిమా టీజర్ విడుదలవుతున్నట్లు ప్రకటించారు. మైత్రీ మూవీస్ వారు మొత్తానికి ఈ న్యూస్ అభిమానుల్లో మాంచి జోష్ నింపుతోంది. గత సంవత్సరం కాలంగా షూటింగ్‌లో ఉన్న 'రంగస్థలం' గ్రామీణ నేపథ్యంలో సాగే కథ.. రామ్‌చరణ్‌కు జోడీగా సమంత నటిస్తుండగా.. ఇప్పటికే లీకైన వారి ఫొటోలు.. వీరిమధ్య కెమిస్ట్రీ ఎంత బాగుందో చెబుతున్నాయి. జగపతిబాబు, ఆది కీలక పాత్రలను పోషిస్తుంటే.. యాంకర్ అనసూయ కూడా ఒక ముఖ్యమైన పాత్రలో మెరవనుందట.

పొలిటికల్ సినిమాలో...



సూపర్‌స్టార్ రజనీకాంత్ మొత్తానికి రాజకీయాల్లోకి ఎంట్రీ ఇచ్చాడు. ఇక రజనీకాంత్ నెక్స్ట సినిమాలు చేయడా? అనే సందేహాలు ఎక్కువయ్యాయి. మరోవైపు రోబో 2.0 రజనీకాంత్ లాస్ట్ సినిమా అంటూ కోలీవుడ్‌లో జోరుగా ప్రచారం జరుగుతోంది. ఆయన ప్రస్తుతం నటిస్తున్న కాలా సినిమా కూడా షూటింగ్ పూర్తిచేసుకుంది. ఈ రెండు సినిమాలు విడుదల తరువాత రజనీ మరో సినిమా చేసేందుకు ఓకే చెప్పాడట. అయితే ఈసారి ఆయన చేసే సినిమా పూర్తి స్థాయి రాజకీయ డ్రామాగా వుంటుందని టాక్? ఈమధ్యే ఈ సినిమాకు సంబంధించి కథా చర్చలు జరిగాయట. పొలిటికల్ డ్రామా అయితే తన రాజకీయాలకు ఇంకా హెల్ప్ అవుతుందని భావించిన రజనీ ఈ సినిమాను ఒప్పుకున్నాడు. అన్నట్టు ఈ సినిమా కథ కూడా పా రంజిత్ వినిపించాడట. కథ బాగా నచ్చడంతో ఓకే చెప్పాడట. మొత్తానికి కబాలి సినిమాతో పా రంజిత్ అంటే రజనీతో ఎక్కువ అనుబంధం పెరిగింది. ఇప్పటికే కాలా సినిమా చేస్తున్న పా రంజిత్, వెంటనే రజనితో మరో సినిమాకు ఒప్పించడం నిజంగా గ్రేట్ అని చెప్పాలి.

16న 'రాజరథం'



నిరూప్ భండారి, అవంతిక శెట్టి జంటగా అనూప్ భండారి దర్శకత్వంలో జాలీ హిట్స్ ప్రొడక్షన్స్ సంస్థ నిర్మిస్తున్న చిత్రం 'రాజరథం'. ఈ చిత్రాన్ని ఫిబ్రవరి 16న ప్రపంచ వ్యాప్తంగా విడుదల చేసేందుకు నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు. ఈ సందర్భంగా దర్శకుడు, సంగీత దర్శకుడు అనూప్ భండారి మాట్లాడుతూ 'రంగితరంగ' వంటి సూపర్‌హిట్ మూవీ తర్వాత నా దర్శకత్వంలో వస్తోన్న చిత్రం 'రాజరథం'. ఈ సినిమాకు దర్శకత్వంతోపాటు సంగీతం కూడా సమకూర్చాను. ఇందులో మొత్తం ఏడు పాటలు వున్నాయి. ఈ పాటలకు రామజోగయ్య శాస్త్రి అద్భుతమైన సాహిత్యాన్ని అందించారు. ఈ పాటలకు తప్పనిసరిగా లైవ్ ఇన్‌స్ట్రుమెంట్స్‌నే వాడాల్సి వుండడంతో వాటితోనే పాటల్ని రికార్డ్ చేయడం జరిగింది. చెన్నైలో విజిపి రికార్డింగ్ థియేటర్ చాలా ఫేమస్.. పాటలకు దేవి ఆర్కెస్ట్రా అరేంజ్ చేశారు. స్యాక్స్ రాజా చాలా సీనియర్ మ్యూజిషియన్. ఆయన పాటలకు ఎరేంజ్‌మెంట్స్ చేశారు. రిథిమ్స్‌ని ఇండియాలోనే బిగ్గెస్ట్ స్టూడియో అయిన యశ్‌రాజ్ స్టూడియోలో చేశాం. దీపేశ్‌వర్మ రెండు పాటలకు రిథిమ్స్ ప్లే చేశారు. దాదాపు 60 మంది మ్యూజిషియన్స్‌తో పాటల్ని క్వాలిటీగా రికార్డు చేశాం. ఆడియోపరంగా, విజువల్ పరంగా పాటలు అందరికీ నచ్చుతాయి అన్నారు. నిర్మాతల్లో ఒకరైన అజయ్‌రెడ్డి గొల్లపల్లి మాట్లాడుతూ- రంగితరంగ వంటి సూపర్‌హిట్ చిత్రాన్ని రూపొందించిన టీమ్ తెలుగులో 'రాజరథం' చిత్రంతో పరిచయమవుతోంది. టెక్నికల్‌గా హైస్టాండర్డ్స్‌లో నిర్మించడం జరిగింది. అనూప్ భండారి ఎక్స్‌ట్రార్డినరీ టేకింగ్‌తో, బ్యూటిఫుల్ మ్యూజిక్‌తో సినిమాని అద్భుతంగా తీర్చిదిద్దారు. ఫిబ్రవరి 16న రాజరథం గ్రాండ్‌గా విడుదల చేయబోతున్నాం అన్నారు. ఈ చిత్రంలో నిరూప్ భండారి, అవంతిక శెట్టి, పి.రవిశంకర్ ప్రధాన తారాగణంగా నటిస్తున్నారు. ఈ చిత్రానికి మాటలు: అబ్బూరి రవి, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్: అజనీష్ లోక్‌నాథ్, ఎడిటింగ్: శాంతకుమార్, కెమెరా: విలియమ్ డేవిడ్, నిర్మాణం: జాలీహిట్స్ టీమ్, అంజు వల్లభనేని, విషు దకప్పదారి, సతీష్ శాస్త్రి, అజయ్‌రెడ్డి గొల్లపల్లి, సంగీతం, స్క్రీన్‌ప్లే, రచన, దర్శకత్వం: అనూప్ భండారి.

ప్రేమలో పడ్డానంటున్న రెజీనా?



టాలీవుడ్‌లో గ్లామర్ హీరోయిన్‌గా మంచి క్రేజ్ తెచ్చుకున్న రెజీనాకు ఈమధ్య అవకాశాలు బాగా తగ్గాయి. పైగా వరుస పరాజయాలు టెన్షన్ పెడుతున్నాయి. అవకాశాలు వస్తున్నాకానీ, ఎందుకో కొన్ని సినిమాలకు నో చెప్పడం షాక్ ఇస్తోంది. రెజీనా ఈమధ్య సినిమాలు కూడా కావాలనే బాగా తగ్గించిందని సినీ వర్గాల్లో గుసగుసలు వినిపిస్తున్నాయి. ఈ విషయం గురించి ఈ భామ స్పందిస్తూ.. నటిని కావాలన్నది నా కోరిక.. అందుకే పరిశ్రమకు వచ్చాను.. నటిగా నిరూపించుకున్నాను.. కానీ ఈ పదేళ్ల కెరీర్‌లో ఎన్నో మలుపులు చూసాను.. ఈమధ్య నేను సినిమాలను తగ్గించానని అంటున్నారు. నిజమే.. దానికి కారణం- ఈమధ్యే నేను ప్రేమలో పడడం అనే పొరపాటువల్లే జరిగిందని షాక్ ఇచ్చింది.

ప్రస్తుతం నా దృష్టి కెరీర్‌మీదే వుందని. ఇకపై వరుసగా సినిమాలు చేస్తానని.. నేనేంటో నిరూపించుకుంటానని చెప్పింది.. అంతా బాగానే వుంది కానీ ఈ అమ్మడికి ప్రేమలోకి దింపిన అతగాడు ఎవరా అన్నది తేలాల్సి వుంది మరి.

నచ్చిన పాత్ర కోసం..!








సినిమా హీరోలు, హీరోయిన్లంటే లక్షల్లో సంపాదన, లక్షల్లో అభిమానులు ఉంటారు. మరి ఇంతమంది అభిమానులు ఉండాలంటే ఎంత కష్టపడాల్సి వస్తుంది. అందం, అభినయం వుండగానే సరిపోదు. ఏ పాత్రలోనైనా ఒదిగిపోయే తత్త్వం వుండాలి. ఒకప్పుడు సినిమాల్లోకి రావాలంటే నాటికలు, డ్రామాలు, స్టేజీ షోల్లో మంచి కార్యక్రమాలు చేసివుండాలి. ఇప్పుడు అలాంటి క్లిష్టపరిస్థితి ఏం లేదు. నాలుగైదు దశాబ్దాల క్రితం సినిమాల్లోకి రావాలంటే రోజులు, నెలల తరబడి మద్రాసులోని స్టూడియోల చుట్టూ తిరగాల్సి వుండేది. ఎంత తిరిగినా కూడా అనుభవం లేకుంటే అవకాశాలు రాకపోయేవి. ఒకప్పుడు నాటకాల ద్వారా సినిమాల్లోకి అడుగుపెట్టిన నటులకు చిత్రసీమలో మంచి అవకాశాలు వారిని వెతుక్కుంటూ వచ్చేవి. ఆరోజుల్లో సినిమాల్లో పోటీ తక్కువగా వుండేది. ఒకటి, రెండు సినిమాలకు పనిచేసినా కూడా బాడీ లాంగ్వేజీ కోసం, డైలాగ్ డెలివరీ కోసం ఇంకా ప్రాక్టీస్ చేసేవాళ్లు. డైలాగ్ చెప్పడం కోసం మాట సన్నగా వస్తుంటే కనుక సిగరెట్లు తాగమని చెప్పటం అప్పట్లో పరిపాటి. బాడీ లాంగ్వేజీ సరిగా ఉండటానికి వ్యాయామం, ఎక్సర్‌సైజ్‌లు చేయటం, ఒక మెనూ ప్రకారం తినడం లాంటివి చేసేవారు. ఒక్కో దశలో ఇవన్నీ చేయాల్సి వచ్చినపుడు కొంత ఇబ్బందికరంగా కూడా వుండేది.

నాలుగైదు దశాబ్దాల క్రితం సినీ పరిశ్రమలో పౌరాణిక చిత్రాలలో హెయిర్ స్టయిల్‌కు గొప్ప ప్రాముఖ్యముండేది. ఎలాంటి పాత్ర పోషించినా తలమీద కిలోల బరువున్న వెంట్రుకలు. అదే ఇప్పుడైతే సినిమాల కోసం నెలల తరబడి హెయిర్, గెడ్డాలు, మీసాలు పెంచుకోవాల్సిందే. బాడీని కూడా అమాంతం రెండింతలు పెరిగేలా నటించాల్సిన సినిమాలు వస్తున్నాయి. ప్రభాస్ అయితే బాహుబలి రెండు భాగాల కోసం దాదాపు 150 కేజీలు పెరగాల్సి వచ్చింది. అసలే శరీరం బరువు, దానికితోడు తల వెంట్రుకలు, గెడ్డం, మీసాలు కూడా సహజత్వం కోసం దాదాపు రెండేళ్లు పెంచుకోవాల్సి వచ్చింది. బరువు పెరగడమంటే ఇష్టమొచ్చినట్లు పెరగడం కాకుండా, ఒక పద్ధతి ప్రకారం రోజులో ఎక్కువ సమయం వ్యాయామానికి కేటాయించాల్సి వుంటుంది. తిండి కూడా లిమిట్‌గా ఒక మెనూ ప్రకారం తినాల్సి వుంటుంది. ఎందుకంటే ఆ పాత్రలో ఇమిడిపోవాలంటే బాడీ లాంగ్వేజీ కూడా అలాగే వుండాలి. కానీ ఎంత రిస్క్‌గా వుంటుందో ఊహకే అందదు. అలాంటివి అనుభవించేవారికి ఎలా వుండాలి. కానీ నచ్చిన పాత్ర కోసం చేయడం వారికిష్టం.

ఇక మెగాస్టార్ చిరంజీవికి కూడా ఇలాంటి నియమాలు తప్పడంలేదు. ఇవన్నీ అభిమానుల కోసమే. అనుష్క జీరో సైజ్ కోసం ఆరు నెలలో 28 కేజీలు పెరిగి మళ్లీ ఐదు నెలల్లో యథాస్థితికి వచ్చింది. దంగల్ సినిమా కోసం అమీర్‌ఖాన్ పొట్ట కూడా పెంచాల్సి వుండడంతో బాడీతోపాటు పొట్టను కూడా పెంచాడు. అమీర్‌ఖాన్ నేచురాలిటీ కోసం దంగల్ సినిమాలో పొట్టతో కనిపించాడు. మరి ఆ సినిమా పూర్తయ్యాక స్లిమ్‌గా తయారవడానికి చాలా కష్టపడాల్సి వచ్చింది. ఎందుకంటే హీరోహీరోయిన్లు కాస్త పీలగా వుంటే కొన్ని పాత్రలకు సరిపోరు. కాబట్టి కొన్ని నెలలు జిమ్‌లో కసరత్తు చేయాల్సి వుంటుంది. ఇంతకుముందు సినిమాల్లోనైతే ముఖాభినయం, నటన బాగుంటే ఒకట్రెండు టేకుల్లో సీన్ పూర్తయ్యేది. కానీ ఇప్పుడు వస్తున్న సినిమాల్లో పాత్రలు ఒక సినిమాలో చక్కగా, మరొక చిత్రంలో కాస్త లావుగా, మరికొన్ని సన్నివేశాల్లో మరీ భారీ కాయంగా కనిపించాల్సి వచ్చినపుడు నటీనటులు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మామూలు నటీనటులకే కాదు పెద్ద హీరోహీరోయిన్లకు కూడా ఇలాంటి తిప్పలు (నచ్చిన పనులు) తాము అనుకున్న సినిమాలోని క్యారెక్టర్స్ చేయాలంటే పద్ధతి ప్రకారం ఎక్సర్‌సైజ్‌లు, బాడీ బిల్డింగ్‌లు ఆహారపు అలవాట్లు మార్చుకోక తప్పడంలేదు. హీరోలనే భారీకాయులుగా చూపించడమే కాకుండా, కథనుబట్టి హీరోయిన్లను కూడా చూయించాల్సి వస్తుంది.

సినిమాలంటే కేవలం మేకప్ మాత్రమే కాదు. ఆ మేకప్ వెనుక కఠోర శ్రమ, కార్యదక్షత, త్యాగం వుంటాయి. మనకు నచ్చకపోయినా జనాలకోసం పేరు కోసం చేయాల్సి వుంటుంది. మేకప్ గదుల్లో కొన్ని గంటలు వుండాల్సి వుంటుంది. ఒక సినిమాలో మొదటి సీన్‌లో ముఖం ఎలా కనపడుతుందో అదే ముఖం చివరి వరకు అలాగే వుండాలి. అలా వుండాలంటే హెయిర్‌స్టయిల్, మీసాలు, గెడ్డం, కనుబొమలు, హీరోయిన్లకైతే మేకప్ చాలా ఎఫెక్టివ్‌గా వుండాలి. కాస్ట్యూమ్స్ కూడా బాడీకి తగ్గట్టుగా వుండాలి. లేకుంటే మనిషిని కాస్ట్యూమ్స్ డామినేట్ చేసే అవకాశం వుంది.

బాడీని డెవలప్ చేయడానికి ఎంత కష్టపడాలో మళ్లీ వెనుకటి స్థితికి, ఫిట్‌నెస్‌గా వుండటానికి అంతకంటే ఎక్కువగా కష్టపడాల్సి వస్తుంది. వీటికోసం వారికి ఇష్టమైనవాటిని కొంతకాలం పక్కన పెట్టాలి. బరువు పెంచడం, తగ్గించడం చిరంజీవి, ప్రభాస్, తారక్, ఎన్టీఆర్‌కు ఎవరికీ మినహాయింపు కాదు. ఎందుకంటే వారు కోరుకున్న సినిమాలు, పేరు తెచ్చే పాత్రలు చేయాలంటే చిన్న చిన్న కష్టాలు తప్పవు. వాటిని నటీనటులు కష్టంగా తీసుకోరు. ఎందుకంటే వారు నచ్చిన పాత్రకోసం వాళ్ల శరీరాల్ని కొంత హింసించుకోక తప్పదు. ఎప్పుడూ ఒకేరకమైన పాత్రలు చేస్తుంటే ప్రేక్షకులు కూడా బోర్‌గా ఫీలవుతారు. కాబట్టి ప్రత్యేక పాత్రలు కూడా నటీనటులు విలక్షణమైన పాత్రలు పోషించాలి కాబట్టి ఇబ్బందులెదురైనా చాలా ఇష్టంతోనే నచ్చిన సినిమా కోసం నచ్చిన పాత్రల కోసం స్టార్‌డమ్ వున్న హీరోలు, హీరోయిన్లు వారు కోరుకుంటున్న హింసే అని చెప్పవచ్చు. బరువులను కరిగించడమేమీ స్టార్‌లకు బాధ కాదు. హీరోయిన్లు నాజూగ్గా కనిపించడం కోసం విపరీతమైన ఎక్సర్‌సైజులు చేస్తారు. విక్రమ్ కూడా సినిమా కోసం రిస్క్ తీసుకున్నాడు. నటులు మేకప్ విషయాల్లో ఎంత రిస్క్ తీసుకుంటారంటే విలక్షణ నటుడు కమల్‌హాసన్ దశావతారం, విచిత్ర సోదరులు సినిమాల్లో- పలు క్యారెక్టర్లు చేసిన గొప్ప నటుడు. అక్కినేని కూడా ఒక సినిమాలో పది పాత్రలు చేయడం ఒక గొప్ప అనుభూతి. ఎప్పటికప్పుడు పాత్రలకు తగినట్లుగా మేకప్ వేసుకోవడం, బాడీ లాంగ్వేజీ మార్చడం చాలా కష్టం ఇలాంటి నటులకు హ్యాట్సాఫ్! ఇన్ని ఇబ్బందులు పడినప్పటికీ ఆ సినిమా మంచి సక్సెస్ సాధించినట్లయితే అభిమానుల ఆదరణలో ఇవేమీ కనిపించవు.

- సుమశ్రీ